




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








శనివారం | 8-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 294 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి సా. 4.03 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: పుష్యమి రా. 10.06 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ. 7.22-8.51; దుర్ముహూర్తం: ఉ. 6.49-8.20; అమృతఘడియలు: సా. 4.12-5.41; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.10 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


# 20 లక్షల తెల్లకార్డులు కట్!

## అనర్హుల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి?

**ఇప్పటికి 18లక్షల మంది వడపోత**

**ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం**

**15నుంచి బియ్యం కార్డుల పంపిణీ**

**ఇకపై అర్హులకే సంక్షేమ పథకాలు**

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెల్లకార్డుల కోతకు రంగం సిద్ధమైంది. ఏకంగా 20లక్షల కార్డులు తొలగించాలని వైసీపీ ప్రభుత్వం దాదాపు నిర్ణయానికి వచ్చింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల గుర్తింపునకు నిర్దేశించిన నిబంధనలను ప్రామాణికంగా తీసుకుని చేపట్టిన సర్వేలో 18లక్షల మంది తెల్లకార్డులు కలిగి ఉండేందుకు అర్హులు కారని క్షేత్రస్థాయిలో తేల్చారు. అయితే ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని, ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పౌరసరఫరాల శాఖ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇప్పుడే వివరాలు బహిర్గతం చేస్తే ఒక్కసారిగా వ్యతిరేకత వస్తుందని, అందువల్ల పూర్తిగా వడపోత చేసేవరకూ బయటపెట్టకూడదని ఆ శాఖ భావిస్తోంది. కాగా, ఈనెల 15నుంచి నూతన బియ్యం కార్డులు పంపిణీ చేయనున్నారు. మార్చి నుంచి వీటి ఆధారంగానే సరుకులు అందిస్తారు. వేలిముద్రల ఆధారంగా సరుకుల పంపిణీ జరుగుతున్నందున కొత్తకార్డులు చేతికి వచ్చినా రాకపోయినా అర్హుల జాబితాలో పేరు ఉండటమే ప్రధానం కానుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించిన అర్హుల జాబితాలో పేర్లులేని 2లక్షల కుటుంబాలకు పైగా అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వాటి పరిశీలన పూర్తిచేసిన తర్వాత బియ్యం కార్డులు పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కార్డుల వడపోత కార్యక్రమం వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభమైంది. అందరికీ నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఇంతమందికి కార్డులెలా ఉన్నాయనేదానిపై దృష్టి సారించింది. రేషన్‌తోపాటు ఇతర సంక్షేమ పథకాలకూ ప్రామాణికంగా భావిస్తున్న తెల్లకార్డుల సంఖ్య ఎంత తగ్గితే ప్రభుత్వంపై అంత భారం తగ్గుతుందని భావించింది. అందుకే కార్డుల ఏరివేతకు శ్రీకారం చుట్టింది. ప్రజాసాధికార సర్వే సమాచారం, వలంటీర్లతో సర్వే నిర్వహించి కార్డులు వడపోసింది. అంతకుముందే ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న 1.38లక్షల కార్డులను

మిగతా 10వ పేజీలో...



పాఠశాలల్లో 'నాడు-నేడు' కార్యక్రమం అమలుపై సమీక్షిస్తున్న సీఎం వైఎస్ జగన్

## స్కూళ్ల అభివృద్ధికి 1500 కోట్లు

**పనుల్లో నాణ్యత తగ్గకూడదు**

మూడంచెల తనిఖీ.. నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలపై చర్యలు

'నాడు-నేడు'పై సమీక్షలో సీఎం ఆదేశాలు

12

**11 నుంచి ఆటోమ్యుటేషన్**



శుక్రవారం విజయవాడలో అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ

## రాజధాని రైతులూ.. ప్రాణత్యాగాలొద్దు

### మహిళల ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయా?

**అక్కడి పరిస్థితులన్నీ నాకు అర్థమవుతున్నాయి.. మీ విజ్ఞాపనపత్రం పరిశీలిస్తా.. తగు విధంగా స్పందిస్తా**

**జేఏసీ, టీడీపీ నేతలకు రాష్ట్రపతి హామీ.. రైతులకు ధైర్యం చెప్పాలని సూచన**

**గడ్కరీతోనూ జేఏసీ నేతల సమావేశం.. ఒకట్రెండు రోజుల్లో ప్రధాని, షాతో భేటీ?**



శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి కోవింద్‌కు వినతిపత్రం అందజేస్తున్న అమరావతి జేఏసీ నాయకులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం అనవసరంగా ప్రాణత్యాగాలు చేయొద్దని రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ సూచించారు. అమరావతి ప్రాంతంలో మహిళలు ఇంకా ఆందోళనలు కొనసాగిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని కొనసాగించాలని కోరుతూ టీడీపీపీ నేత గల్లా జయదేవ్ నాయకత్వంలో అమరావతి పరిరక్షణ సమితి, జేఏసీ ప్రతినిధుల బృందం శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతితో సమావేశమైంది. ఈ సందర్భంగా కోవింద్ మాట్లాడుతూ.. 'అక్కడి పరిస్థితులన్నీ నాకు

మిగతా 11వ పేజీలో...

**దారితోచని కేంద్ర సంస్థలు!**

మూడుతో ముక్కలైన అంచనాలు

అమరావతి బ్రాండ్ మెచ్చి వచ్చిన మిగిలిన సంస్థలదీ ఇదే దుస్థితి

రాజధానిలో 1293ఎకరాలు కొన్న 130కిపైగా ప్రతిష్ఠాత్మక సంస్థలు

11

# ఆర్టీసీలో ప్రైవేట్ వార్

**సస్పెండ్ చేస్తా: పీటీడీ ఉన్నతాధికారి హెచ్చరిక**

**ఏం చేసినా సంస్థకు ద్రోహం చేయను!**

**మరో అధికారి ప్రత్యుత్తరం**

**ప్రైవేటు ఆపరేటర్లకు బస్టాండ్‌లోకి అనుమతిపై ఆ ఇద్దరు అధికారుల వాగ్వాదం**

**ఐఏఎస్ కుమారుడి పెళ్లిలో ఘటన**

**ఉన్నతాధికారి తీరుతో అధికారుల్లో ఆందోళన**

**ముఖ్యమంత్రి వరకూ వెళ్లేందుకు సిద్ధం**

**ప్రత్యక్ష ఆందోళనకు కార్మిక సంఘాలు రెడీ**



(అమరావతి- ఆంధ్రజ్యోతి)

"ప్రైవేటు బస్సు ఆపరేటర్లను ఆర్టీసీ బస్టాండ్‌లోకి వచ్చేందుకు పర్మిషన్ ఇవ్వాలని చెప్పి పదిరోజులైంది. నా మాటంటే లెక్కలేదా?.. సస్పెండ్ చేస్తా!"

"మీరు ఏవేవో అనుకొని చేసేయాలంటే కుదరదు. మీ ఆలోచనలు రైటింగ్‌లో ఇవ్వండి. సాధ్యపడుతుందో లేదో పరిశీలిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా మీరు మౌఖిక ఆదేశాలిస్తే అమలు చేయలేం. ఉద్యోగం ఊడినా సంస్థకు ద్రోహం చెయ్యను"

ఉన్నతాధికారి ఇచ్చిన వార్నింగ్... అందుకు పీటీడీ అధికారి గట్టిగా బదులిచ్చిన తీరు ఇది. ఒక ఐఏఎస్ అధికారి కుమారుడి పెళ్లి వేదికగా జరిగిన ఈ వాగ్వాదంతో అక్కడున్న ఇతర అధికారులు ఆశ్చర్యపోయారు. ప్రజారవాణాలో

మిగతా 2వ పేజీలో...



సియోల్‌లో మాస్కులతో 6 వేల జంటల వివాహం

**వూహాన్‌లో 80 మంది భారతీయ విద్యార్థులు**

వారిలో 70 మంది అక్కడే ఉండడానికి సుముఖం

10 మంది స్క్రీనింగ్‌తో విఫలమయ్యారు: కేంద్రం

కరోనా మృతులు 637

9

# అసలుకే ఎసరు!



కృష్ణాజిల్లా గొల్లపూడిలోని మసీదు

**ఇమామ్, మౌజన్‌లకు ఆగిన గౌరవ వేతనం**

**టీడీపీ పాలనలో నెలకు రూ.5వేలు, రూ.3వేలు**

**తామొస్తే రూ.10వేలు, రూ.5వేలు ఇస్తానన్న జగన్**

**ఏడు నెలలుగా అందని గౌరవ వేతనాలు**

**'దుకాణ్ ఔర్ మకాన్' రుణాల పరిస్థితీ అంతే**

### రెట్టింపు చేస్తామన్నారు.. పైసా ఇవ్వలేదు

'మేం అధికారంలోకి వస్తే మసీదుల్లో పని చేసే ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాన్ని రెట్టింపు చేస్తాం. ఇమామ్‌కు రూ.10వేలు, మౌజన్‌కు రూ.5వేలు గౌరవ వేతనంగా ఇస్తాం' ఎన్నికల ముందు పాదయాత్ర టైంలో జగన్ ఇచ్చిన హామీ ఇది.

జగనన్న అధికారంలోకి వచ్చారు. గౌరవ వేతనాలు రెట్టింపు అవుతాయని ఎదురు చూసిన ముస్లింలకు వైసీపీ సర్కారు అసలుకే ఎసరు పెట్టింది. ఇస్తున్న గౌరవ వేతనాలనూ నిలిపివేసింది.

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలను అందించారు. ముఖ్యంగా ఇమామ్, మౌజన్‌లకు నెలకు రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున గౌరవ వేతనం అందించారు. కృష్ణా జిల్లాలోని సుమారు 400 మసీదుల్లో పని చేసే ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాన్ని ఎన్నికల రెండు మాసాల ముందు వరకు

మిగతా 9వ పేజీలో...






# ఢిల్లీ ఓటరు ఎటు?

## సంక్షేమమా? భావోద్వేగమా?

**నేడే పోలింగ్.. ఆప్ వైపే సర్వేల మొగ్గు!.. పౌరసత్వ చట్టానికి ఇది రెఫరెండం?**

**కాంగ్రెస్ పోటీ నామమాత్రం**

11








పరంజ్యోతి



## మూర్ఖత్వాన్ని జయించాలంటే..

*తనదు బాగుఁగోరి ధర్మంబు చెప్పినా*
*తిట్టుచుండ్రు మొరకు లెట్టయెదుట*
*గడ్డివేయ పోట్లగొడ్డు కొమ్మాడించు*
*విశ్వదాభిరామ వినురవేమ*

తన క్షేమాన్ని కోరి గడ్డి వేయడానికి వచ్చినవారిపైనే పోట్లగొడ్డు కొమ్ము విసిరినట్టు.. మూర్ఖులు తమ మూర్ఖత్వాన్ని తొలగించడానికి మంచిని బోధించేవారిని ముఖం మీదే తిడతాడని దీని అర్థం. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లనే రీతిలో అవివేకపు పట్టుదలతో ఉండేవారిని గురించి వేమన చెప్పిన పద్యమిది. మూర్ఖులను మంచి మాటలతో మార్చాలనుకోవడం ఎంత నిష్ప్రయోజనమో భర్తృహరి ఒక అద్భుతమైన శ్లోకం ద్వారా చెప్పాడు..

*వ్యాళం బాలమృణాళ తంతుభి రసౌ రోద్ధుం సముజ్జృంభతే*
*భేత్తుం వజ్రమణిం శిరీష కుసుమ ప్రాంతేన సన్నహ్యతి*
*మాధుర్యం మధుబిన్దునా రచయితుం క్షారాంబుధే రీహతే*
*మూర్ఖాన్యః ప్రతినేతు మిచ్ఛతి బలాత్సూక్తైః సుధా స్యన్దిభిః*

తామరతూడు దారంతో మదపుటేనుగును బంధించడానికి ప్రయత్నించడం, దిరిశెనపువ్వు కొనచేత వజ్రాన్ని కోయడానికి పూనుకోవడం, లవణ సముద్రపు నీటిని మధురంగా చేయడానికి అందులో తేనెచుక్క వేయడం ఎలా నిష్ప్రయోజనాలో మంచి మాటలతో మూర్ఖుణ్ని సమాధానపరచాలనుకోవడం అంతే నిష్ఫలమవుతుందని పై శ్లోకభావం. సువాసనగల వస్తువులను గాడిద మోస్తుంటుంది. కానీ వాటి విలువను అది తెలుసుకోలేదు. అలాగే.. మంచివారితో ఉన్నా మూర్ఖుడు వారిలోని మంచిని గ్రహించలేడు. వేపచెట్టుకు తేనెపోసి పెంచినా చేదు పోదు. నీటితో నిప్పును నివారించవచ్చు. గొడుగుతో ఎండను ఆపవచ్చు. అంకుశంతో మదపుటేనుగును వశం చేసుకోవచ్చు. ఔషధంతో భయంకర రోగాన్ని బాపుకోవచ్చు. కానీ మూర్ఖుని మొండితనాన్ని నివారించే మందు ఎక్కడా లేదు. ఇసుక నుంచి తైలాన్ని తీయవచ్చు. ఎండమావులలోని నీటిని తాగవచ్చు. తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు. కానీ మూర్ఖుని మనస్సు రంజింపలేము అనే లోకోక్తి అందరికీ తెలిసిందే. మరి దీనికి ఏమిటి మార్గం? మూర్ఖులు మంచి త్రోవ పట్టేదెలా? అంటే... అది వారి చేతుల్లోనే ఉంది. మనిషి మంచికి, చెడ్డకు మనసే కారణం. ఎంత మూర్ఖుడికైనా మంచి చెడుల విచక్షణ తెలుస్తుంది. తెలిసినా మంచిని కాదని చెడువైపు మొగ్గడమే మూర్ఖత్వం. తెలియక చేస్తే అజ్ఞానం. కాబట్టి అలాంటి మొండితనం గలవారు తమ మనసునే ఆయుధంగా చేసుకుని తమ అవివేకాన్ని తామే అదుపులో పెట్టుకోవాలి. తమలో ఉండే మొండితనమనే రోగాన్ని భగవంతుడి వైపు మళ్లించి భక్తి అనే ఆయుధంగా మలచుకోవాలి. సర్వేశ్వర ధ్యానంతో సర్వవిధాలైన రోగాలూ అంతమైపోతాయి. ఇందుకు పెట్టుబడి అవసరం లేదు. భక్తితో మనసారా పరమాత్మను ధ్యానిస్తే చాలు. ఆ సర్వేశ్వరుడు ఎలాంటివారినైనా ఆదుకుంటాడు. భగవంతుని కరుణతో ఎంతటి మొండివాడైనా జన్మను సార్థకం చేసుకోవచ్చు.

**- వల్లూరు చిన్నయ్య, 9948348918**

## లోకం తీరు




బడ్జెట్, నిరుద్యోగం, ఆర్థికమాంద్యం, రాష్ట్రాల్లో ఓటములు.. ఏడడిగినా ఇలాగే నమస్కారాలు చేస్తున్నారు.

## ఉష్ణోగ్రతలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 34.6 | 21.6 |
| హైదరాబాద్ | 32.6 | 20.4 |
| విజయవాడ | 32.5 | 21.4 |
| నెల్లూరు | 31.8 | 22.5 |
| గుంటూరు | 31.7 | 19.7 |
| విజయనగరం | 29.0 | 21.0 |

## కోస్తా, సీమకు వర్షసూచన

విశాఖపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సముద్రం నుంచి తేమగాలులు, ఉత్తరాది నుంచి పొడిగాలులు వీస్తుండడంతో వాతావరణంలో అనిశ్చితి నెలకొని శుక్రవారం ఉత్తర కోస్తాలో వర్షాలు కురిశాయి. గాలుల తీవ్రత ప్రభావం కోస్తాలో మిగిలిన ప్రాంతాలకు కూడా విస్తరించింది. దీంతో రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో ఉరుములు, పిడుగులతో వర్షాలు, కోస్తాలోని మిగిలిన ప్రాంతాలు, సీమలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. శుక్రవారం కర్నూలులో 35డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు

- 'జ్ఞానభూమి' పోర్టల్ ద్వారా నిర్వహణ
- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కసరత్తు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సన్నాహాలు చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకోవడం ద్వారా డిగ్రీ అడ్మిషన్లలో పేపర్‌లెస్ విధానాన్ని తీసుకురావాలని భావిస్తోంది. ఈ విధానంతో నిబంధనలు పాటించని కాలేజీలకు కళ్లెం వేయనుంది. ఇప్పటికే ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఈవిధానం అమల్లో ఉంది. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో 2020-21 విద్యాసంవత్సరం నుంచే దీన్ని అమలు చేయాలని మండలి సంకల్పించింది. దీనికిగాను 'జ్ఞానభూమి' పోర్టల్ అధికారులతో మండలి అధికారులు చర్చించారు. ఇప్పటి వరకు కాలేజీలే అడ్మిషన్లు చేసుకుని విద్యార్థుల జాబితాను సంబంధిత విశ్వవిద్యాలయానికి పంపించి ఆమోదం పొందుతున్నాయి. నిబంధనలు పాటించని కాలేజీలు సైతం ఇష్టానుసారంగా అడ్మిషన్లు పొందుతున్నాయి. విద్యార్థులను ఇతర కాలేజీలకు బదలాయిస్తూ, రీయింబర్స్‌మెంట్ పథకం లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. ఫలితంగా 'క్వాలిటీ' తగ్గిపోతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిగ్రీ చదువుతున్న అందరూ పరీక్షలు రాయడం లేదు. ఉత్తీర్ణతా శాతం అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టడమే మంచిదన్న ప్రతిపాదనపై ఉన్నత విద్యా మండలి అధ్యయనం చేస్తోంది. ఆ బాధ్యతను 'జ్ఞానభూమి' పోర్టల్ ఏజన్సీకి అప్పగించాలని ఆన్‌లైన్ డిగ్రీ అడ్మిషన్లకు అన్ని వర్సిటీలు మౌఖికంగా తమ సమ్మతిని తెలియజేశాయి. ఫలితంగా డిగ్రీ అడ్మిషన్ కోరుకునే విద్యార్థులు 'జ్ఞానభూమి' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుచేసుకోవాల్సి ఉంటుంది.

### కొత్త కోర్సులకు నిబంధనలు

ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టదలచుకుంటే కొన్ని నిబంధనలు పాటించాలి. వాటిపై ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఒక్కో వర్సిటీ పరిధిలో వేర్వేరు కోర్సులు ఉన్నాయి. కొత్త కోర్సుల అనుమతికి అవసరమైన నిబంధనలపై నియమించిన కమిటీ పలు సిఫారసులతో నివేదికను సమర్పించింది. త్వరలోనే ఈ విషయంపై మండలి నిర్ణయం తీసుకోనుంది.

# స్కూళ్ల అభివృద్ధికి 1500 కోట్లు

- పనుల్లో నాణ్యత తగ్గకూడదు.. మూడంచెల తనిఖీ విధానం
- నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలపై చర్యలు
- 'నాడు-నేడు'పై సమీక్షలో సీఎం ఆదేశాలు



పాఠశాలల్లో నాడు నేడు కార్యక్రమం అమలుపై సమీక్షిస్తున్న సీఎం జగన్

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని సీఎం జగన్ అన్నారు. దీనికోసం ప్రత్యేకంగా రూ.1,500కోట్ల బడ్జెట్ కేటాయించిందని చెప్పారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో 'మనబడి నాడు-నేడు' కార్యక్రమంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో మూడంచెల తనిఖీ విధానం ఉండాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత తగ్గకూడదని స్పష్టం చేశారు. స్కూళ్లలో మరుగుదొడ్ల నిర్వహణపై సీఎం సమీక్షించారు. తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, కొంతమంది రూ.1000 కంటే ఎక్కువ ఇస్తున్నారని అధికారులు చెప్పారు. బడి అభివృద్ధిలో భాగస్వాములవుతున్న తల్లిదండ్రుల పేర్లు నోటీసుబోర్డులపై ఉంచాలని చేయాలని జగన్ సూచించారు. ఏప్రిల్ నుంచి నాణ్యమైన బియ్యం పంపిణీని అన్ని జిల్లాల్లో దశలవారీగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చాలాచోట్ల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, కనీస ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధిక ఫీజులపై దృష్టి పెట్టాలన్నారు. ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించాలని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఉన్నత విద్య, పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ల ఛైర్మన్లు జస్టిస్ వి.ఈశ్వరయ్య, జస్టిస్ ఆర్.కాంతారావు, అధికారులు పాల్గొన్నారు.

### నేడు 'దిశ' స్టేషన్ ప్రారంభించనున్న సీఎం

రాజమహేంద్రవరంలో 'దిశ' పోలీస్‌స్టేషన్‌ను సీఎం జగన్ శనివారం ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా 18దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దిశ పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. 'దిశ' యాప్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం నన్నయ వర్సిటీలో దిశ చట్టంపై జరుగుతున్న వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. కాకినాడలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.48,69,372 బడ్జెట్‌తో నిర్మించనున్న 'వన్ స్టాప్ సెంటర్'కు ఇక్కడనుంచే శంకుస్థాపన చేస్తారు. రాష్ట్రంలోని అన్ని వన్‌స్టాప్ సెంటర్ల సిబ్బందితో సీఎం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తారు.

### 'నాడు-నేడు'కు 400 కోట్లు

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన 'నాడు-నేడు'కు ప్రభుత్వం 400కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని గ్రీన్‌ఛానెల్ ద్వారా విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు.

## జగన్ మూడో కన్ను తెరిస్తే చంద్రబాబు భస్మమే

- దమ్ముంటే కొత్త పార్టీ పెట్టి గెలవండి: అనిల్



నంద్యాల, ఫిబ్రవరి 7: "సీఎం జగన్మోహన్‌రెడ్డి మూడోనేత్రం తెరిస్తే చంద్రబాబు భస్మం అవుతాడు. కానీ ఆయనలో క్షమ, దయా గుణం ఉండడంతో ఎన్ని కుట్రలు చేస్తున్నా చూస్తూ ఉన్నాం" అని మంత్రి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా నంద్యాలలో బహిరంగ సభలో మాట్లాడుతూ రాయలసీమ పౌరుషం, రక్తం చంద్రబాబులో గానీ, బాలకృష్ణలో గానీ ఉంటే ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని పక్కన పెట్టి.. దమ్ముంటే కొత్తగా పార్టీపెట్టి గెలవాలని సవాల్ చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని లాక్కున్న చంద్రబాబు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ బొమ్మ లేకుంటే ఆ పార్టీకి డిపాజిట్లు రావని ఎద్దేవా చేశారు. పదేళ్ల కష్టంతో, ప్రజల ఆదరాభిమానాలతో, 3వేల కిలోమీటర్ల పాదయాత్రతో, 151 సీట్లు గెలిచిన వైసీపీని గాలిలో కలుపుతారా? అంటూ చంద్రబాబుపై మంత్రి మండిపడ్డారు. జోలె పట్టుకొని అడుక్కోవడం చంద్రబాబుకు తెలుసుకానీ.. ఎన్ఆర్‌సీ, సీఏఏ, ఎన్‌పీఆర్‌పై మాట్లాడే దమ్ములేదని, బీజేపీతో బాబు సత్సంబంధాలను కలిగి ఉన్నారన్నారు. సీఎం జగన్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని, తామంతా జగన్ భక్తులమని మంత్రి అన్నారు.



## మహా ప్రభుత్వం దానంతట అదే కూలిపోతుంది

ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కానీ, ఆసక్తి కానీ మాకు లేదు. ఎందుకంటే తన సొంత భారం వల్ల ఆ ప్రభుత్వం దానంతట అదే కూలిపోతుంది. ప్రతిపక్షంగా మా విధులను మేము నిజాయతీగా నిర్వర్తిస్తాం.

- దేవేంద్ర ఫడణవీస్, మహారాష్ట్ర ప్రతిపక్ష నేత



## ఆర్థికవ్యవస్థ బతకాలంటే పేదల చేతుల్లో డబ్బు పెట్టండి

ప్రజల వద్ద డబ్బు లేకపోవడం వల్లే వారు వస్తుసేవలను కొనగోలు చేయలేకపోతున్నారు. డిమాండ్ లేకపోవడం వల్ల ఆర్థికవ్యవస్థ క్షీణిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం పేదల చేతుల్లో డబ్బు పెట్టడమే. అంతేతప్ప ధనవంతుల చేతుల్లో కాదు. కానీ మోదీ ప్రభుత్వం అలా చేయదు. ఎందుకంటే అది సూటు, బూటు (ధనవంతుల) సర్కారు.

- కాంగ్రెస్ నేత చిదంబరం

## పీఆర్సీ గడువు మరో 2నెలలు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ గడువును మరో రెండు నెలలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2019 నవంబరు 30తో గడువు ముగియడంతో 2020 జనవరి 31వరకూ పెంచారు. ఇప్పుడు అది కూడా పూర్తవడంతో మార్చి 31వరకూ పెంచాలని నిర్ణయించారు.

## గిరిజన సాంస్కృతికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థి సమాఖ్య(జీవీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో ఎస్వీ యూనివర్శిటీలో నిర్వహించే జాతీయ గిరిజన సాంస్కృతికోత్సవం పోస్టర్, కరపత్రాలను మంత్రి అవంతి శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎస్, జీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున నాయక్, భాస్కర్ నాయక్, శ్రీనివాసులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 12న మంత్రివర్గ సమావేశం

- సచివాలయం తరలింపుపై నిర్ణయం?

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 12న జరగనుంది. సీఎం జగన్ నేతృత్వంలో జరిగే ఈ భేటీలో పాలన వికేంద్రీకరణపై చర్చించే వీలుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ రాజధానుల ఏర్పాటు బిల్లును అసెంబ్లీ ఆమోదించడం.. శాసనమండలి దానిని సెలెక్ట్ కమిటీకి పంపిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించే అవకాశముందని అంటున్నాయి. విశాఖకు సచివాలయం తరలింపుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుతారా?

- ముందుగా మాకు చెప్పండి.. ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా బోర్డు లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచుతున్నారా..? ఒకవేళ పెంచే ప్రతిపాదన ఉంటే ముందు మాకు చెప్పండి. అపెక్స్ కౌన్సిల్ నుంచి అనుమతి తీసుకోవలసి ఉంటుంది' అని కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) పేర్కొంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి బోర్డు కార్యదర్శి హరికేష్ మీనా లేఖ రాశారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచే ప్రతిపాదన ఉంటే అందుకు సంబంధించిన వివరాలను సమర్పించాలని కోరారు.

## పెంచిన పన్నులతో కాసుల గలగల

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాలు భారీగా తగ్గినా సర్కారు ఆదాయానికి ఢోకా లేకుండా పోయింది. మద్యంపై సర్కారు కొత్తగా విధించిన పన్నులు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. లిక్కర్‌లో 20శాతం, బీర్లలో 50శాతానికిపైగా అమ్మకాలు పడిపోయినా 10నెలల కాలంలో (ఏప్రిల్-జనవరి వరకూ) ఆదాయం ఇసుమంత తగ్గకపోగా ఒకింత పెరిగింది. 2018-19లో ఇదే పది నెలల కాలానికి రూ.14,407కోట్ల ఆదాయం వస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14,836 కోట్లు వచ్చింది. అంటే 2.98 శాతం పెరుగుదల నమోదయింది. వైసీపీ ప్రభుత్వం కొత్తగా విధించిన అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో రూ.1139కోట్లు, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.279కోట్లు ఖజానాకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్- జనవరి వరకు 322 లక్షల కేసుల లిక్కర్ అమ్మితే, ఈ ఏడాది 264లక్షల కేసులు అమ్మారు. గతేడాది 227లక్షల కేసుల బీరు అమ్ముడుపోగా, ఈసారి 195లక్షల కేసులే అమ్మారు. గతేడాది అమ్మిన మద్యం విలువ రూ.16,652కోట్లు కాగా, ఈ ఏడాది రూ.17,577కోట్లకు చేరుకుంది. ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగు వేయడంతో అమ్మకాలు తగ్గినా ఆదాయం మాత్రం పెరిగింది.

## మున్సిపాలిటీలుగా కుప్పం, కొండపల్లి!

- కొత్తగా మరో పది పట్టణ స్థానిక సంస్థలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మరో పది పట్టణ స్థానిక సంస్థలు ఏర్పాటైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీటితో కలిపి రాష్ట్రంలో మొత్తం పట్టణ స్థానిక సంస్థల సంఖ్య 120కి పెరిగింది. కొత్త వాటిలో 2 మున్సిపాలిటీలు, 8 నగర పంచాయతీలు ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని కుప్పం, కృష్ణా జిల్లాలోని కొండపల్లి మున్సిపాల్టీలు కాగా, పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు, పెనుగొండ, గుంటూరు జిల్లాలోని గురజాల, దాచేపల్లి, ప్రకాశంలో దర్శి, నెల్లూరులోని బుచ్చిరెడ్డి పాలెం, కడప జిల్లాలోని కమలాపురం, కర్నూలులోని బేతంచర్ల నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి.

# ఆర్టీసీలో ప్రైవేట్ వార్

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా ఉన్న ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో ఇప్పుడు ఆర్టీసీ హౌస్‌లో అదే పెద్ద చర్చనీయాంశమైంది. ఉన్నతాధికారి తీరుతో విసిగివేసారిన అధికారులు... సమస్యను నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధవుతున్నారు. కార్మిక సంఘాలు కూడా ప్రత్యక్ష ఆందోళనకు సమాయత్తం అవుతున్నాయి.

### కోరితెచ్చుకుంటున్న ప్రమాదం!

ఏదైనా ఒక సంస్థ ప్రగతిపథంలో పయనించాలంటే సమస్యల్ని గుర్తించి, వాటిని ఎదుర్కొంటూ విస్తరణకు మార్గం ఏర్పరచుకోవాలి. యాజమాన్యం ఈ మేరకు ఆలోచించి తీసుకునే సముచిత నిర్ణయాలను సిబ్బంది అమలు చేస్తారు. కానీ ప్రజారవాణా సంస్థ (పీటీడీ)గా మారిన ఆర్టీసీ ఇప్పుడు తనకు తానే రివర్స్ గేర్ వేసుకుంటోందని విమర్శలు వస్తున్నాయి. ఆర్టీసీ బస్సులకు ప్రధానమైన పోటీ ప్రైవేటు వాహనాలు. వాటిలో రూటు పర్మిట్లను అతిక్రమించి తిరిగే వాటివల్ల ఆదాయం కోల్పోతున్న ఆర్టీసీ... జిల్లాల ఎస్పీలు, రవాణాశాఖ అధికారుల సహకారాన్ని ఎప్పటికప్పుడు కోరుకుంటుంది. అయితే కొత్త ఏడాదిలో పీటీడీగా మారిన సంస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి వచ్చిందని, కోరి మరీ ఈ పరిస్థితి తెచ్చుకుంటున్నారని కార్మికవర్గాలు అంటున్నాయి.

### అదెలాగెంటే..?

ప్రైవేటు బస్సులకు ఆర్టీసీ జిల్లాల అధికారులు స్టిక్కర్లిస్తారు. వాటిని అతికించుకున్న ఏ బస్సు అయినా బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను తీసుకెళ్లవచ్చు. ఈ వింత ప్రతిపాదనను ఉన్నతాధికారి గత కొన్ని రోజులుగా జిల్లాల్లో పర్యటిస్తూ చేస్తున్నారు. విద్యాసంస్థ నుంచి పరిశ్రమల బస్సుల యాజమాన్యం వరకు అందరినీ పిలిచి సమావేశం పెట్టి మరీ ప్రోత్సహిస్తున్నారు. ఉన్నతాధికారి ప్రతిపాదనకు కిందిస్థాయి అధికారులు విస్తుపోతున్నారు. మన బస్టాండ్‌లోకి ప్రైవేటుబస్సులను ఎలా అనుమతివ్వాలని నోరెళ్ల బెడుతున్నారు. ఇన్నాళ్లూ బస్టాండు పరిసరాల్లోకి రావొద్దని చెప్పి, ఇప్పుడు లోపలికి ఆహ్వానించడమా? అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

### వెనక్కు తీసుకోవాలి

ఉన్నతాధికారి తీరుతో సంస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడబోతోందని, ఆర్టీసీ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ఆయన నిర్ణయాలు తీసుకుంటే మనమెందుకు చిక్కుల్లో పడాలని అధికారులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లాలనుకుంటున్నారు. మరోవైపు కార్మిక సంఘాలు కూడా ప్రత్యక్ష ఆందోళనకు దిగాలని నిర్ణయించాయి. 'మా యూనియన్లు వేర్వేరు అయినా సంస్థ ఉనికికి ప్రమాదం ఏర్పడితే అందరం ఏకమవుతాం. ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం' అని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఈయూ ఈ విషయంపై శుక్రవారం విజయవాడలో రాష్ట్రకమిటీ సమావేశమై చర్చించింది. ఈ నెల 11, 12 తేదీల్లో అన్ని డిపోలు, వర్కుషాపుల వద్ద నిరాహారదీక్షలు చేపట్టాలని నిర్ణయించింది. మరో కార్మిక సంఘం ఇప్పటికే ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. వైఎస్ఆర్ మజ్దూర్ నేతలు సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు కడప జిల్లాకు చెందిన జగన్ బంధువైన ఎమ్మెల్యే ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలిసింది.



## పింఛను రాక ఆగిన పేద గుండె!



రామాపురం, ఫిబ్రవరి 7: పింఛను నిలిచిపోయిందన్న ఆందోళనతో ఓ పేద గుండె ఆగిపోయింది. కడప జిల్లా రామాపురం మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గాజులపేట గ్రామానికి చెందిన కత్తి రెడ్డెమ్మ (69)కు మూడేళ్ల నుంచి వృద్ధాప్య పింఛన్ వస్తోంది. అయితే వైసీపీ ప్రభుత్వం ఇటీవల ఆమె పింఛనును నిలిపివేసింది. భర్త మూడేళ్ల క్రితం చనిపోయినందున తనకు వితంతు పింఛను లేదా వృద్ధాప్య పింఛను ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ స్పందించలేదు. మనస్తాపానికి గురైన ఆమె రెండురోజుల నుంచి ఆహారం తీసుకోకపోవడంతో శుక్రవారం గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పింఛన్లు ఆగిపోయాయని ఎవరికీ చెప్పడం లేదని, ప్రస్తుతం రాకపోయి నా ఒకటి రెండు నెలల్లో వస్తాయని, ఒకేసారి మొత్తం డబ్బు ఇస్తామని చెబుతున్నామని ఎంపీడీవో నరసింహులు చెప్పారు.

### విశాఖ లైట్ మెట్రో..

## డీపీఆర్‌కి పచ్చజెండా

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం లైట్ మెట్రో రైల్ కారిడార్‌కు సంబంధించి సవివర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్(ఏఎంఆర్‌సీ) ఎండీకి అనుమతినిస్తూ పురపాలక శాఖ కార్యదర్శి జె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ('ఎలుడా') వైస్ చైర్ పర్సన్‌గా పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### ప్రపంచ బ్యాంకు నిధులతో..

## రైతు ఉత్పాదక కార్యాలయాలు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచబ్యాంకు నిధులతో రాష్ట్రంలో రైతు ఉత్పాదక సంస్థ(ఎఫ్‌పీవో)ల కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.29.44 కోట్లతో 161 మండలాల్లో 168 కార్యాలయాలను ఏపీఆర్ఐజీపీ పథకం కింద చేపట్టనున్నారు. 72 కేంద్రాల్లో కార్యాలయాలతో పాటు గోడౌన్లు, మిగిలిన కేంద్రాల్లో కార్యాలయాలు మాత్రమే నిర్మిస్తారు. వీటి నిర్వహణ బాధ్యతలను వ్యవసాయశాఖ తీసుకోనుంది.

## బట్టమేక సంరక్షణకు గ్రీన్‌కో

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రోళ్లపాడులోని పక్షుల అభయారణ్యం అభివృద్ధికి, నల్లమల అటవీ ప్రాంతంలో అంతరించిపోతున్న 'బట్టమేక పిట్ట' (గ్రేట్ ఇండియన్ షెప్పర్డ్) సంరక్షణకు అటవీశాఖతో కలిసి పని చేయడానికి గ్రీన్ కో కంపెనీ ముందుకొచ్చింది. ఈ మేరకు గ్రీన్ కో, అటవీశాఖల మధ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం పై పనుల నిమిత్తం గ్రీన్ కో తన సీఎస్ఆర్ నిధుల నుంచి ఏటా రూ.కోటి చొప్పున పదేళ్లపాటు అటవీశాఖకు ఇస్తుందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ప్రతీప్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ నళినీ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆహారపు అలవాట్ల 'సోషల్' కాపీయింగ్

లండన్, ఫిబ్రవరి 7: సోషల్ మీడియా వినియోగదారులు తమ స్నేహితుల ఆహారపు అలవాట్లను కాపీ కొట్టే ప్రయత్నం చేస్తున్నారని యూకేలోని యాస్టన్ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. ఇష్టమైన ఆహార పదార్థాలకు సంబంధించి ఇతరులు పెట్టే పోస్టులతో ప్రభావితమై ఈవిధంగా చేస్తున్నారని గుర్తించారు. ఈక్రమంలో కొంతమంది జంక్ ఫుడ్, చక్కెర మోతాదు అధికంగా ఉండే శీతల పానీయాలను మితిమీరి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కొందరు నెటిజన్లు మాత్రం స్నేహితుల స్ఫూర్తితో పండ్లు, కూరగాయల వాడకం పెంచి ఆరోగ్యకర జీవన శైలి వైపు అడుగులు వేస్తున్నారన్నారు.

## క్యాబేజీ, కాలీఫ్లవర్‌లతో 'ఫ్యాటీ లివర్'కు చెక్

హూస్టన్, ఫిబ్రవరి 7 : కాలేయ వ్యాధులకు అడ్డుకట్ట వేసే ఔషధ గుణాలు క్యాబేజీ, కాలీఫ్లవర్‌లో ఉన్నాయని అమెరికాలోని టెక్సస్ ఏఅండ్ఎం అగ్రిలైఫ్ రిసెర్చ్ సంస్థ శాస్త్రవేత్తలు అంటున్నారు. నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధిని అరికట్టగల 'ఇండోల్' అణువులను సాధారణంగా మన శరీరంలోని గట్(హానిచేయని) బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తుంటుంది. ఈ అణువులు క్యాబేజీ జాతి కూరగాయల్లోనూ సహజసిద్ధంగా ఉంటాయని, వాటిని తినడం ద్వారా ఫ్యాటీ లివర్ వ్యాధికి కళ్లెం పడుతుందని తాజా పరిశోధనల్లో గుర్తించారు. స్థూలకాయుల రక్తంలో ఇండోల్ అణువుల మోతాదు చాలా తక్కువగా ఉండటంతో వారికి కాలేయ వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు.

# సారా ఏరులు!

- ఎక్సైజ్ దాడులతో భారీగా వెలుగులోకి..
- అగ్రస్థానంలో కృష్ణా, కర్నూలు జిల్లాలు
- 13 కేసులు.. 15 మంది అరెస్టు

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సారా ఏరులై పారుతోంది!.. మద్యం కొరత, ధరల పెంపు నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా నాటుసారా స్థావరాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. వాటిలో వేల లీటర్ల సారా ఉత్పత్తి జరుగుతోంది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నాటుసారా నివారణ ప్రత్యేక అధికారి సురేంద్రబాబు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ పి.హరికుమార్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం నుంచి ఎక్సైజ్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున దాడులు నిర్వహించాయి. 82 ప్రాంతాల్లో 195 ప్రత్యేక బృందాలు దాడులు జరిపి, అనేక చోట్ల సారా ఉత్పత్తి కేంద్రాలను ధ్వంసం చేశారు. 13 కేసులు నమోదుచేసి, 15 మందిని అరెస్టు చేశారు. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం ఊట ఏకంగా 84,115 లీటర్లు పట్టుబడింది. సారా 521 లీటర్లు, సారా తయారీకి ఉపయోగించే బెల్లం 1482 కిలోలు పట్టుకున్నారు. సారా తయారీదారులతోపాటు, వారికి సహకరిస్తున్న, బెల్లం విక్రయించిన వారందరిపైనా కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ హరికుమార్ తెలిపారు.

### కృష్ణా, కర్నూలు జిల్లాల్లో భారీగా...

నాటుసారా ఉత్పత్తిలో కృష్ణా, కర్నూలు జిల్లాలు అగ్రస్థానంలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 84వేల లీటర్ల బెల్లం ఊట దొరికితే అందులో ఒక్క కృష్ణాలోనే 30వేల లీటర్లు స్వాధీం చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో 16వేల లీటర్లకుపైగా దొరికింది. కృష్ణా- 30వేలు, గుంటూరు- 700, ప్రకాశం- 2900, చిత్తూరు- 7150, శ్రీకాకుళం- 3786, విజయనగరం- 3500, విశాఖపట్నం- 3000, తూర్పుగోదావరి- 8500, పశ్చిమగోదావరి- 2300, కడప- 350, అనంతపురం- 4095, కర్నూలు- 16,400 లీటర్లు చొప్పున బెల్లం ఊట పట్టుబడింది.

### మద్యం విక్రయాలు తగ్గింది ఇందుకేనా?

తాజా దాడుల్లో సారా, ముడిసరుకు భారీగా పట్టుబడటం అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. దశలవారీ మద్య నిషేధంలో భాగంగా తాము చేపట్టిన చర్యలతో రాష్ట్రంలో లిక్కర్ 26శాతం, బీరు 50 శాతానికిపైగా పడిపోయిందని ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. కానీ అటు మద్యం అమ్మకాలు తగ్గిపోతుంటే, ఇంకోవైపు నుంచి సారా తయారీ, విక్రయాలు పెరిగినట్లు తెలుస్తోంది. మద్యం ధరల పెంపు, పాపులర్ బ్రాండ్ల కొరత, సమయం కుదింపులాంటి చర్యలు వినియోగదారులను సారా వైపు మళ్లిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో మద్యం షాపుల కొరత కూడా దీనికి ఒక కారణంగా కనిపిస్తోంది.

# బదిలీలు ఇంకెప్పుడు?

- రాష్ట్రంలో అనిశ్చితి.. పోలీసుశాఖలో సందిగ్ధం
- నలుగురు ఎస్పీలు, ఇద్దరు డీఐజీలకు బదిలీ చాన్స్
- పలువురికి ప్రమోషన్ల నేపథ్యంలో మరిన్ని ట్రాన్స్‌ఫర్లు
- ఏడీజీ, ఐజీల కొరతతో పలు విభాగాలకు అధిపతుల్లేరు
- ఐపీఎస్‌ల కొరత తీర్చాలని కేంద్రానికి పోలీసుశాఖ వినతి



అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో పదోన్నతులు... సంక్రాంతి తర్వాత బదిలీలు... ఇదీ కొన్నేళ్లుగా రాష్ట్ర పోలీసుశాఖలో జరుగుతోన్న వ్యవహారం. అయితే 2020లో ఇప్పటికీ అలాంటి ప్రక్రియ ఏదీ కనిపించకపోవడంతో బదిలీలు ఉంటాయా?.. ఉంటే ఎప్పుడు? అనే ప్రశ్నలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, పాలనాపరమైన సందిగ్ధంతో ఐపీఎస్ అధికారుల బదిలీలు, డీఎస్పీల పోస్టింగులు ఆగిపోయాయి. ఈ ఎదురుచూపులకు ఎప్పుడు శుభంకార్డు పడుతుందో తెలియని పరిస్థితి డిపార్ట్‌మెంట్‌లో నెలకొంది. పోలీసుశాఖలో డీజీపీ తర్వాత జిల్లాల ఎస్పీల పోస్టింగులు కీలకమైనవి. కొన్ని జిల్లాల్లో ఎస్పీలను మారుస్తారన్న సమాచారంతో ఐపీఎస్ అధికారులు ఇప్పుడు ఎదురు చూస్తున్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో ఒక్కో ఎస్పీని, కోస్తాలో ఇద్దరిని మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు రాయలసీమ జిల్లాల్లో ఒక చిన్న పోలీసు జిల్లా ఎస్పీని మార్చవచ్చనే ప్రచారం జరుగుతోంది. కోస్తా జిల్లాల్లో ఒక పెద్ద జిల్లా ఎస్పీ పనితీరుపై ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఎక్కువ నేరాలు జరుగుతోన్న ఆ జిల్లాలో ఇటీవల ఒక పార్టీ కార్యకర్తలపై అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులు దాడులు చేయడం పోలీసు ప్రతిష్ఠకు కొంత ఇబ్బంది కలిగించింది. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ఇంటిని రాజకీయ పార్టీ కేడర్ ముట్టడిస్తుందని ముందే తెలిసినా అడ్డుకోవడంలో విఫలమయ్యారన్న భావన వ్యక్తం అవుతోంది. దీంతో ఆ జిల్లా ఎస్పీ బదిలీ ఉండవచ్చని పోలీసుశాఖలో చర్చ జరుగుతోంది. గుంటూరు అర్బన్ ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ పనితీరు బాగున్నా డీఐజీ పదోన్నతి పొందడంతో ఆయనను బదిలీ చేయక తప్పని పరిస్థితి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక ఎస్పీపై ఆరోపణలు వస్తున్నాయి. అవి నిజమని తేలితే బదిలీ తప్పక పోవచ్చంటున్నారు. ఇక డీఐజీల విషయానికొస్తే రాయలసీమలో ఒక రేంజ్ డీఐజీ తనకు తానుగా లూప్‌లైన్‌కు వెళ్లాలని అనుకొంటున్నట్లు పోలీసుశాఖలో ప్రచారం జరుగుతోంది. స్వతహాగా సౌమ్యుడైన ఆయన శాంతిభద్రతల పోస్టింగ్ తనకు అక్కర్లేదని ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సమాచారం. కోస్తాంధ్రలో ఏలూరు రేంజ్ డీఐజీ ఏఎస్ ఖాన్‌కు పదోన్నతి లభించనుండటంతో ఆయన బదిలీ తప్పకపోవచ్చు. ఈ రెండింటితోపాటు విశాఖపట్నం జాయింట్ పోలీస్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. మరిన్ని బదిలీలపై ప్రభుత్వం దృష్టి సారించబోతోందని, త్వరలో పదిమందికిపైగా ఐపీఎస్ అధికారుల బదిలీలు ఉంటాయని ఉన్నతస్థాయి వర్గాలు చెబుతున్నాయి.

### ఏడీజీ, ఐజీల కొరతతో...

గత ఏడాది జూన్‌లో డీజీపీతోపాటు పలు జిల్లాల ఎస్పీలను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం... పోలీసుశాఖలోని కొన్ని విభాగాల అధిపతులను పట్టించుకోలేదు. అందుకు ప్రధాన కారణం అడిషనల్ డీజీలు, ఐజీలు, డీఐజీల కొరత ఉండటమే. పోలీసుశాఖలో డీజీపీ తర్వాత అడిషనల్ డీజీ శాంతిభద్రతలు, ఇంటెలిజెన్స్ చీఫ్, గ్రేహౌండ్స్, సీఐడీ, పీ అండ్ ఎల్, ఏపీఎస్పీ, హోంగార్డ్ తదితర విభాగాల అధిపతులుంటారు. అయితే వీటిలో శాంతిభద్రతల ఏడీజీగా రవిశంకర్ అయ్యన్నార్, సీఐడీ అధిపతిగా సునీల్ కుమార్, హోంగార్డ్స్ చీఫ్‌గా హరీశ్ కుమార్ గుప్తా ఉన్నారు. ఇంటెలిజన్స్ అధిపతిగా అడిషనల్ డీజీ ర్యాంకు అధికారి కుమార్ విశ్వజీత్‌ను కొనసాగించిన ప్రభుత్వం ఆ తర్వాత కేంద్ర సర్వీసుల నుంచి ఐజీ ర్యాంకు అధికారి మనీష్ కుమార్ సిన్హాను తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అప్పటికే ఇన్‌చార్జి ఏసీబీ డీజీగా ఉన్న విశ్వజీత్‌ను పూర్తిస్థాయిలో నియమించినా ఇటీవల ఏసీబీ పనితీరుపై సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్ పెదవి విరిచారు. ఉన్నఫళంగా విశ్వజీత్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం ఆయనకు కనీసం పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో రవాణాశాఖ కమిషనర్‌గా ఉన్న బాలసుబ్రమణ్యంను బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో పీఎస్ఆర్ ఆంజనేయులను నియమించింది. ఆయన పనితీరుతో సంతృప్తి చెందిన ప్రభుత్వం ఏసీబీ డీజీగా పోస్టింగ్ ఇచ్చింది. హోంగార్డ్స్ డీజీగా ఉన్న కె.టి.ఉజేలా డ్రగ్ కంట్రోల్ విభాగానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో హరీశ్ కుమార్ గుప్తాను నియమించిన ప్రభుత్వం మరికొన్ని విభాగాలను భర్తీ చేయలేకపోతోంది. రాష్ట్రంలో ఏడీజీ ర్యాంకు స్థాయి అధికారుల కొరత వేధిస్తుండగా గ్రేహౌండ్స్ చీఫ్‌గా ఉన్న నళిన్ ప్రభాత్ ఇటీవలే కేంద్ర సర్వీసులకు వెళ్లి పోయారు. అంజనా సిన్హా, మధుసూదన్‌రెడ్డి అంతకుముందే కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో ఏడీజీలతోపాటు ఐజీల కొరత ఉంది. ఫలితంగా ఏపీఎస్పీ లాంటి విభాగాలు పెద్దదిక్కు లేకుండా ఉన్నాయి. ఈ పరిస్థితిని ఇటీవల డీజీపీల సమావేశంలో కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన గౌతమ్ సవాంగ్... ఆ స్థాయి అధికారులను ఇవ్వాలని కోరారు.

**డీఎస్పీలకు ఎదురు చూపులేనా..?**

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీల పోస్టింగ్ కోసం పలువురు ఎదురు చూస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వంలో సబ్ డివిజన్లలో విధులు నిర్వర్తించిన వారిలో ఎక్కువ మందిని ఈ ప్రభుత్వం రాగానే పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌కు పంపింది. సుమారు 25మంది వరకూ డీఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్నారు.

# జమ్మూలో శ్రీవారి ఆలయం

- నేడు టీటీడీ అధికారుల స్థల పరిశీలన

తిరుమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జమ్మూలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయనున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జమ్మూ, వారాణశిల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ బోర్డు నిర్ణయించిందని చెప్పారు. స్థలం తుది ఎంపిక కోసం టీటీడీ అధికారులు జమ్మూ వెళ్లారని, శనివారం పరిశీలించి అనుకూలంగా ఉన్న ఒకదాన్ని ఎంచుకుంటారని తెలిపారు. భువనేశ్వర్, వైజాగ్, హైదరాబాద్, చెన్నైల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో 650 గజాల స్థలంలో రూ.30కోట్ల అంచనా వ్యయంతో ఆలయ నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామన్నారు. కురుక్షేత్రలో వేదపాఠశాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా, జనవరిలో శ్రీవారి హుండీ ద్వారా ఆలయానికి రూ. 94.9కోట్ల ఆదాయం సమకూరింది. మే నెలకు సంబంధించి మొత్తం 72,773 ఆర్జిత సేవాటికెట్లు అందుబాటులో ఉన్నట్లు ఈవో తెలిపారు.

### రాయితీ లడ్డూలను కొనసాగించండి

ఉచిత లడ్డూ పథకంతో పాటు రాయితీ లడ్డూలను కూడా కొనసాగించండని కొందరు భక్తులు డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను కోరారు. గతంలో రూ.70కి ఇచ్చే నాలుగు లడ్డూలు ఇప్పుడు రూ.100 కైనా ఇస్తే బాగుంటుందని సూచించారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు రూ.100 తర్వాత రూ.వెయ్యి అద్దె కలిగిన గదులు మాత్రమే ఉన్నాయని మరో భక్తుడు తెలుపగా, అన్ని కేటగిరీల గదులు ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈవో పేర్కొన్నారు.

### హథీరాంజీ మఠానికి త్వరలో మరో మహంతు: వెలంపల్లి

హథీరాంజీ మఠం వ్యవహారాలపై వచ్చిన ఆరోపణల విచారణకు సహకరించనందునే మహంతును తొలగించాల్సి వచ్చిందని దేవదాయశాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారి దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ మఠంపై గత ప్రభుత్వ హయాంలోనే విచారణ జరిగిందని, అనేక అవకతవకలు జరిగినట్టు లోకాయుక్త చెప్పిందన్నారు. విచారణకు మహంతు అర్జున్‌దాస్ సహకరించకపోవడంతో ఆయన్ను తొలగించి తాత్కాలికంగా ఓ అధికారిని నియమించినట్టు వివరించారు. త్వరలో అర్హుడైన మరో మహంతును నియమిస్తామని మంత్రి చెప్పారు.





**కార్పొరేషన్ బ్యాంక్**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

**బహిరంగ ప్రకటన**

**KYC కాంప్లియన్స్ గురించి మా విలువైన వినియోగదారులకు గమనిక**

నో యువర్ కస్టమర్ (KYC) మార్గదర్శకాల అమలుకు, బ్యాంక్ వినియోగదారులకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, ఒకవేళ ఖాతాదారులు తమ PAN/ఫారం 60 మరియు ఇతర KYC డాక్యుమెంట్లను సంబంధిత కార్పొరేషన్ బ్యాంక్ శాఖకు దాఖలు చేయనియెడల వినియోగదారులు దిగువ సమాచారం/అధికారికంగా చెల్లుబాటుగల డాక్యుమెంట్లు (OVDs)/ లబ్ధిదారు యజమాని వివరాలు (న్యాయపరమైన వ్యవస్థ అయినచో) ఇవ్వగలరు.

- గుర్తింపు రుజువు మరియు మొబైల్ నంబర్.
- ఖాతాదారు ఇటీవలి ఫోటోగ్రాఫ్ మరియు తాజా నివాస చిరునామా రుజువు.
- FATCA/CRS సెల్ఫ్ సర్టిఫికేషన్‌తోపాటు చెల్లుబాటులోగల పాస్‌పోర్ట్ అటెస్ట్ చేయబడిన ఇటీవలి కాపీని నాన్ రెసిడెంట్ ఇండియన్ (NRI) ఖాతాదారులు దాఖలు చేయవలసి ఉంటుంది.
- తదుపరి RBI మార్గదర్శకాల ప్రకారం KYC వివరాల (Re-KYC) పునరుద్ధరణ కొరకు వినియోగదారులు సంబంధిత శాఖకు OVDs కాపీలు దాఖలు చేయవలసిందిగా కోరబడుతున్నారు, దీని వల్ల సేవలకు అంతరాయం కలగకుండా వారి ఖాతాలు యథాతథంగా కొనసాగించబడును.

పై డాక్యుమెంట్లు/ న్యాయపరమైన హక్కుదారుల యొక్క లబ్ధిదారు యజమాని వివరాలు **15.02.2020** లోగా దాఖలు చేయనిచో, సంబంధిత ఖాతాలో నిర్వహణలను నిలిపివేయడం బ్యాంక్‌కు తప్పనిసరి అవుతుంది.
మీకు ఉత్తమంగా సేవలందించుటకు మీరు వెంటనే స్పందించి మాకు సహకరించగలరు.

జనరల్ మేనేజర్, KYC & AML డివిజన్, ప్రధాన కార్యాలయం


## ఏపీ జేఏసీ కౌన్సిల్ సమావేశాలు నేడు

- నూతన కార్యవర్గం ఎన్నిక.. బొప్పరాజు ఏకగ్రీవం
- 'తుమ్మలపల్లి'లో సభ.. హాజరుకానున్న సీఎం జగన్

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ అమరావతి) తృతీయ కౌన్సిల్ సమావేశాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఏపీ జేఏసీ అమరావతి కార్యవర్గ కాలపరిమితి కూడా పూర్తవుతున్న నేపథ్యంలో నూతన కార్యవర్గ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. జేఏసీ అధ్యక్షుడిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భారీ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభకు ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానించారు. సీఎంతో పాటు రవాణా శాఖ మంత్రి పేర్ని నాని కూడా పాల్గొననున్నారు. ఏపీ జేఏసీ అమరావతిలో 94 సంఘాలు అంతర్భాగంగా ఉన్నాయి. తాజాగా ప్రజా రవాణా సంస్థ (పీటీడీ) ఆవిర్భావం చెందింది. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎంప్లాయిస్ యూనియన్ దాదాపుగా 30 వేల మంది సభ్యత్వాన్ని కలిగి ఉంది. ఈ సందర్భంగా పీటీడీ ఉద్యోగ సంఘంగా ఏపీ జేఏసీలో అంతర్భాగం అయ్యేందుకు అది శనివారం సభలో తమ సమ్మతిని తెలియజేయనుంది.

### అపోలో టైర్స్ కర్మాగార నిర్మాణంపై స్టే తొలగింపు

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా చిన్నపండూరు పరిధిలో నిర్మాణదశలో వున్న 'అపోలో టైర్స్' కర్మాగార పనులకు అడ్డంకి తొలగింది. ఇప్పటివరకు ఆ పనులపై ఉన్న స్టేను హైకోర్టు తొలగించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యలతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఆదేశాలిచ్చింది.

### కాకినాడ పోర్టు ఆఫీసర్ ఆదినారాయణపై వేటు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ పోర్టు అధికారి బి.ఆదినారాయణపై ప్రభుత్వం వేటు వేసింది. ఆయన్ను పోస్టు నుంచి తప్పిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సముద్రంలో ప్రయాణించే బార్జికి అనుమతులు ఇవ్వడానికి పోర్టు కన్జర్వేటర్ అధికారి వెంకటరావు రూ.60 వేలు లంచం తీసుకుంటూ గురువారం రాత్రి పట్టుబడ్డాడు. అయితే ఈ లంచం తన కోసం మాత్రమే కాదని, అందులో 80 శాతం పోర్టు అధికారికి ఇవ్వాలని వెంకటరావు ఏసీబీకి వాంగ్మూలం ఇచ్చాడు. ఎక్కడెక్కడ ఎంత వసూలు చేసిందీ లిఖితపూర్వకంగా ఇచ్చాడు. దీనిపై ప్రభుత్వానికి ఏసీబీ అధికారులు శుక్రవారం నివేదిక పంపగా.. పరిశీలించిన ప్రభుత్వం పోర్టు అధికారిని తప్పించింది. కాకినాడ పోర్టు అధికారిగా ఆదినారాయణ బాధ్యతలు చేపట్టి నాలుగున్నర నెలలవుతోంది. గతేడాది సెప్టెంబరులో జరిగిన గోదావరి బోటు ప్రమాదంపై ఆయన ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తనకంటే ముందున్న ఆఫీసర్ ధర్మశాస్త్ర అడ్డగోలుగా అనుమతులు ఇచ్చినట్లు ప్రభుత్వానికి నివేదిక అందించారు. అటు కొత్తబోట్లకు రద్దయిన లైసెన్సులు తిరిగి కొత్తగా మంజురు చేసే విషయంలో కొంత కఠినంగానే వ్యవహరించినట్లు తెలిసింది. ముఖ్యంగా సముద్రంలో సరుకు రవాణా చేసే బార్జిల అనుమతుల విషయంలో అధికార పార్టీ నేతల ఒత్తిడికి లొంగలేదని సమాచారం. నిబంధనలు కఠినంగా ఉన్నందున తానేం చేయలేనని చేతులెత్తేశారు. దీంతో ఏసీబీ సాకుతో తప్పించారనే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఏసీబీ నివేదిక ఇచ్చి 24 గంటలు గడవక ముందే విచారణ చేయకుండా తప్పించడం కూడా ఈ వాదనలకు బలం చేకూర్చుతోంది.

### శ్రీనివాసరెడ్డి నివాసంలో ముగిసిన ఐటీ సోదాలు

కడప, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ఇంట్లో ఐటీ సోదాలు శుక్రవారం మధ్యాహ్నం ముగిశాయి. కడప ద్వారకానగర్‌లోని శ్రీనివాసరెడ్డి నివాసంలో గురువారం ఉదయం 6గంటలకు ఐటీ అధికారుల బృందం సోదాలు ప్రారంభించింది. ఈ సమయంలో శ్రీనివాసరెడ్డి తల్లి హేమలతమ్మ ఒక్కరే ఇంట్లో ఉన్నారు. అలాగే హైదరాబాదులోని శ్రీనివాసరెడ్డి ఇంట్లో, కార్యాలయంలో కూడా సోదాలు జరిగాయి. గురువారం నుంచి ఐటీ అధికారులు కడపలోని ఇంట్లో అణువణువు వెదికి ఆంధ్రాబ్యాంకు లాకర్ కీ స్వాధీనం చేసుకున్నారు.

### ఆంధ్రప్రదేశ్.. అంధప్రదేశ్ అవుతోంది: బైరెడ్డి

కర్నూలు (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోతి చేష్టలతో ఆంధ్రప్రదేశ్.. అంధప్రదేశ్‌గా మారుతోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబుపై కక్షతో జగన్ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కర్నూలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ తాను సీఎం అనే విషయాన్ని మర్చిపోయి గ్రామస్థాయికి దిగజారి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. అసలు రాష్ట్రానికి మూడు రాజధానులు కావాలని ఎవరు అడిగారని బైరెడ్డి ప్రశ్నించారు. శాడిస్టు జగన్ నుంచి ఏపీని రక్షించాల్సి ఉందన్నారు.

### 'దిశ'లో సమయపాలన లేకుంటే చర్యలే:డీఐజీ

దివాన్‌చెరువు(రాజమహేంద్రవరం), ఫిబ్రవరి 7: దిశ చట్టం అమలులో ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సమయపాలన ఖచ్చితంగా పాటించాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని టెక్నికల్ సర్వీసెస్ డీఐజీ పాల్‌రాజ్ అన్నారు. అన్ని జిల్లాల్లోని దిశ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఒక స్టాప్ సెంటరు సిబ్బంది, డాక్టర్లు, పోలీసులు, న్యాయవాదులకు దిశ చట్టంపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఐజీ పాల్‌రాజు మాట్లాడుతూ దిశచట్టం అమలులో ఎంత గడువులోగా ఏయే పనులు పూర్తిచేయాలో టైమ్ ఫ్రేమింగ్ నిర్ణయించారని, దానిని అందరూ పాటించాలని చెప్పారు. మహిళల తక్షణ రక్షణకు సంబంధించి దిశ మొబైల్ యాప్ ఆవిష్కరించనున్నట్టు, ఇది ఎస్‌వోఎస్ మొబైల్ యాప్ అని చెప్పారు. రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్, దిశ ప్రత్యేక అధికారి కృత్తికా శుక్లా మాట్లాడుతూ దిశ చట్టానికి సంబంధించి రాష్ట్రంలోని దిశ పోలీస్‌స్టేషన్లు, ఫోర్సెనిక్, కోర్టుల కోసం రూ.87 కోట్లు బడ్జెట్ విడుదలచేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన అధికారులు తమ తమ జిల్లాల్లో ఈనెలలోనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. దిశ ప్రత్యేక అధికారి దీపిక, రాష్ట్ర మహిళా భివృద్ధి శిశు సంక్షేమశాఖ జేడీ శైలజ, ఆర్‌జేడీ టీవీ శ్రీనివాస్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుఖజీవన్‌బాబు, రాజానగరం సీడీపీవోటీ నాగమణి పాల్గొన్నారు.

## ఏమిటో వింత..!

**బాలుడి చేతి వేలి నుంచి పుల్లలుగా వస్తున్న పదార్థం**



శెట్టూరు, ఫిబ్రవరి 7 : అనంతపురం జిల్లా శెట్టూరు మండలంలోని తిప్పనపల్లికి చెందిన శ్రీ సాయి అనే పది సంవత్సరాల బాలుడి ఎడమచేతి వేలి నుంచి వింత పదార్థం బయటికి వస్తోంది. ఇది పుల్లలు పుల్లలుగా వస్తోంది. శెట్టూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బాలుడు రోజూమాదిరే గురువారం పాఠశాలకు వెళ్లాడు. చేతివేలిపై ఉన్న గాయంపై ఒత్తిడి చేసిన సమయంలో చిన్న పుల్లలాంటి పదార్థం బయటకు రావడాన్ని ఉపాధ్యాయులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించి గ్రామానికి పంపారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఇలా చేతివేలి నుంచి పుల్లలు రావడంతో భయాందోళన చెందుతున్నామని తండ్రి రమేష్ తెలిపారు. శుక్రవారం వరకు 32 పుల్లలు వచ్చాయన్నారు. చికిత్స కోసం శెట్టూరు ఆసుపత్రికి తీసుకెళ్లగా...ఇది తమకు కూడా అంతుపట్టని విషయమని, జిల్లా కేంద్రానికి వెళ్లి స్కానింగ్ చేయించాలని వైద్యాధికారిణి రంగవేణి సూచించారు. అయితే ఆర్థికస్తోమత లేక విద్యార్థి తల్లిదండ్రులు శెట్టూరు, కళ్యాణదుర్గం ఆసుపత్రుల్లో చూపించుకుని తిరిగి గ్రామానికి చేరుకున్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి

### నైపుణ్యాలతో ఎన్నో అవకాశాలు

- ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ చైర్‌పర్సన్ భువనేశ్వరి
- ఘనంగా ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 7: విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శిస్తే ఎన్నో అవకాశాలు లభిస్తాయని, అలా వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమయత్‌నగర్‌లోని ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భువనేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగం, వ్యాపారం అనే ఆలోచనను దూరంగా ఉంచి కొత్త కొత్త నైపుణ్యాలను నేర్చుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామర్థ్యాలను బట్టి లక్ష్యాలను ఎప్పటికీ మార్చుకోవద్దని సూచించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే సంకల్పంతో ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీతో పరీక్షపే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న టెన్త్ విద్యార్థినులు వర్షారెడ్డి, యోగ నందినిలతోపాటు, పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మనవడు నారా దేవాన్ష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

### పరీక్షలకు ఇబ్బంది లేకుండా ఎన్నికలు

- నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు
- కలెక్టర్లు, ఎస్పీలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్.రమేశ్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం ఆయన ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోసం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సన్నాహకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల మార్గనిర్దేశకాలు, నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి ఓట్ల లెక్కింపు వరకూ ప్రస్తుతమున్న 27 రోజుల కాలవ్యవధిని 20 రోజులకు తగ్గించనున్నందున తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా నవీకరణ(అప్‌డేషన్)- ముద్రణ, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకోవడం, పట్టణ స్థానిక సంస్థలన్నింట్లో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరుల నియామకం, మైక్రో అబ్జర్వర్ల గుర్తింపు తదితరాలపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని రమేశ్ కుమార్ సూచించారు.




అమెరికా ప్రతినిధుల సభలో అభిశంసనకు గురైన ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగువ సభ సెనేట్‌లో అభిశంసన గండం నుంచి గట్టెక్కారు. దీనితో అయిదు నెలల నుంచి కొనసాగుతూ, రాజకీయ ప్రకంపనలు సృష్టించిన అభిశంసన ప్రక్రియకు తెరపడింది. ఈ ఏడాది జరుగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆయనకు మార్గం సుగమమైనట్లే. అధికారాన్ని దుర్వినియోగ పరిచారనే అభియోగాలతో పెట్టిన ఈ అభిశంసనను తన పార్టీకి మెజార్టీ గల సెనేట్‌లో ట్రంప్ సునాయాసంగానే నెగ్గుకు రాగలరని, ఆయన పదవికి గండం లేదని ముందు నుంచీ ఊహిస్తూ వచ్చిందే. అయితే, ఈ గెలుపు ఆయన నిర్దోషిత్వం వల్లనో, సచ్ఛీలత వల్లనో లభించింది కాదు. ఈ ఏడాది నవంబర్‌లో జరగాల్సిన అధ్యక్ష ఎన్నికల ముంగిట ఆ దేశంలోని ప్రధాన పక్షాలైన రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల 'రాజకీయం' వల్ల ఆయాచితంగా లభించినదిగానే భావించాలి.

ఈ ఏడాది నవంబర్‌లో జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరఫున తనతో పోటీ పడనున్న జో బిడెన్‌ను దెబ్బతీయడానికి తన అధికారాన్ని దుర్వినియోగం చేశారన్నది ట్రంప్‌పై మోపిన అభియోగం. జో కుమారుడు హంటర్ బిడెన్‌కు ఉక్రెయిన్‌లో వ్యాపారాలున్నాయి. హంటర్‌ను కేసుల్లో ఇరికించాలంటూ ట్రంప్ ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీపై ఒత్తిడి తెచ్చారని ఆరోపణలు వచ్చాయి. ఆదేశానికి సైనిక సాయంగా ప్రకటించిన నిధులు విడుదల చేయాలంటే తాను చెప్పిన పని చేయాల్సిందేనంటూ ట్రంప్ మెలిక పెట్టాడు. ఈ మేరకు ఆయనతో పలు మార్లు జరిపిన టెలిఫోన్ సంభాషణలను అమెరికా ఇంటెలిజెన్స్ అధికారి అయిన ప్రజావేగు ఒకరు బయటపెట్టడంతో చిచ్చురేగింది, వివాదం చెలరేగింది. అవన్నీ అవాస్తవాలంటూ, ఆధారం లేని ఆరోపణలంటూ ట్రంప్‌తో పాటు, ప్రభుత్వం, ఆయన మద్దతుదారులు ఖండనమండనలు చేశారు. సాక్ష్యాలంటూ కొన్ని సృష్టించారు. ప్రతిపక్షం, ట్రంప్ వ్యతిరేకులు కూడా ఏమాత్రం తగ్గకుండా ఇది క్విడ్ ప్రోకోనే, అధికార దుర్వినియోగమే అంటూ తీవ్రంగానే ధ్వజమెత్తారు.

## ఓడి గెలిచిన ట్రంప్

ఇవిలా కొనసాగుతుండగానే అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ 2019 సెప్టెంబర్‌లో చట్టసభలో అభిశంసన ప్రక్రియ మొదలు పెట్టారు. విచారణలు, దర్యాప్తులు వంటి వన్నీ అయ్యాక డిసెంబర్‌లో ప్రతినిధుల సభలో ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగాలతో తెచ్చిన అభిశంసనపై ఓటింగు జరిగింది. ట్రంప్ అభిశంసనకు గురయ్యారు. అక్కడ నుంచి ఈ తీర్మానం ఎగువ సభ అయిన సెనేట్‌కు చేరింది. చర్చోపచర్చలు సాగిన అనంతరం ఫిబ్రవరి 5న ఓటింగు జరిగింది. సెనేట్‌లో అభిశంసన తీర్మానం వీగిపోయింది అంటే, ట్రంప్ సచ్ఛీలుడని అర్థం కాదు. ఆయన గతం కానీ, అధ్యక్ష పదవి చేపట్టిన నాటి నుంచీ ఆయన తీసుకున్న నిర్ణయాలు, వివిధాంశాలపై వ్యాఖ్యలు, ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్న తీరే ఆయన అహంభావాన్ని, దుందుడుకు తనాన్ని తెలియజేస్తున్నాయి. ఆ విధంగా ఆయన నైతికత మొదట్నుంచీ ప్రశ్నార్థకమే. సామాజిక విలువలను గానీ, ప్రజాస్వామిక విలువలను గానీ ఆయన పెద్దగా ఖాతరు చేసినట్లుగా కనిపించరు. అందుకే, అభిశంసన ప్రక్రియ కొనసాగిన ఈ ఐదు నెలల కాలంలో అమెరికా సమాజంలో జరిగిన చర్చలలో, దేశ జనాభాలో దాదాపు సగం మంది ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. ఆరోపణలు నిజమైనా, కాకపోయినా ట్రంప్‌ను పదవీచ్యుతుడిని చేయాలనే కోరారు. సర్వేల్లోనూ అత్యధికులు ఇలాంటి మనోభావాన్నే వెల్లడించారు. కాంగ్రెస్ సభ్యుల్లోనూ, సొంత పార్టీలోనూ ఇదే అభిప్రాయం ఉన్నట్టు సమాచారం. కాకపోతే, రెండు ప్రధాన పార్టీల ప్రతినిధులూ 'అభిశంసన'ను అడ్డుపెట్టుకుని తమ తమ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యూహాలు పన్నారు, అడుగులు వేశారు. ట్రంప్‌పై తమకు వ్యతిరేకత ఉన్నా కూడా, ఒక్క మిట్ రోమ్నీ తప్ప రిపబ్లికన్ పార్టీ సభ్యులు ఎవరూ 'ఓటింగు' సమయంలో దాన్ని బయట పడనీయలేదు. తమ శక్తినంతా ఒడ్డి అభిశంసనను ఓడించారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా సాక్షులను కూడా సెనేట్‌కు అనుమతించలేదు. అభిశంసనను ఓడించడం ద్వారా 'మా పార్టీలో దోషులెవరూ లేరు' అని ప్రకటించుకుని, తరువాత ఆయనను దేశాధ్యక్ష బరిలోకి దిగకుండా పార్టీలో అభిశంసించాలని వ్యూహం పన్నారట. పదవీ గండం నుంచి గట్టెక్కిన సంతోషంలో సామాజిక మాధ్యమాల ద్వారానూ, ప్రత్యక్షంగానూ తన వాచాలతను మరింత దూకుడుగా ప్రదర్శిస్తున్న ట్రంప్ ఈ వ్యతిరేకతను అధిగమించి, ఎన్నికల బరిలోకి దిగుతాడా? దిగినా... పదవీచ్యుతి గండాన్ని ఎదుర్కొన్న తొలి అధ్యక్షుడిగా మచ్చబడ్డ ఆయనను ప్రజలు ఆదరించి మరోసారి గెలిపిస్తారా? అనేదే ఇప్పుడు అమెరికాకు సంబంధించిన ఆసక్తికరమైన అంశం.

## ప్రీ ప్రైమరీ విద్య అత్యవసరం

పాఠశాల విద్య అసెస్‌మెంట్ కోసం కేంద్ర ప్రభుత్వ కోరిక మేరకు ముంబైలోని ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ 2005 నుండి 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు (అసెర్)' లు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఈసారి 2019 నివేదికను 'ఎర్లీ ఇయర్స్' పేరుతో ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ పరిస్థితిని ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. 24 రాష్ట్రాల్లోని 26 జిల్లాల్లో 30,425 కుటుంబాల్లోని 36,930 మంది 48 సం.ల వయసు గల బాలబాలికలను సర్వే చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా, తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో జ్ఞాన పరమైన అభివృద్ధి, మాటలు మాట్లాడడం, అంకెలు గుర్తించడం లెక్కించడం, సామాజిక భావోద్వేగ అభివృద్ధి అనే నాలుగు మౌలిక విషయాల పైన సర్వే చేశారు. సర్వేలో ఆధారంగా ఎర్లీ ఇయర్స్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతను, అవసరాన్ని సూచించడం దీని ముఖ్య ఉద్దేశం.

భారతదేశం పాఠశాల విద్యలో అభ్యసన సామర్థ్యాల సంక్షోభం అందరికీ తెలిసిందే. నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే 2017 ప్రకారం మూడవ తరగతి విద్యార్థుల్లో మూడో వంతు మంది పాఠాన్ని చదవలేక పోతున్నారు. సగం మంది విద్యార్థులు రోజువారీ జీవితానికి అవసరమైన లెక్కలు చెయ్యలేక పోతున్నారు. ఈ లోపం మరింత ఆందోళనకరంగా వున్నట్లు 'యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు (అసెర్) 2018' వెల్లడించింది. ఐదవ తరగతి విద్యార్థుల్లో సగం మంది పాఠ్య పుస్తకంలోని పాఠాలను సరిగా చదవలేక పోతున్నారని, 28% మంది మాత్రమే భాగహారం లెక్కలు చేయగలుగుతున్నారని పేర్కొన్నది. పై తరగతులకు పోతున్నకొద్దీ చదువు తగ్గిపోవడమే కాదు, ప్రారంభ తరగతుల్లో కూడా కనీస అభ్యసన సామర్థ్యాలు అలవడక పోవడం ఆశ్చర్యంగా వుంది.



గ్రామీణ ప్రాంతాల్లోని ఒకటవ తరగతి విద్యార్థుల్లో 42.7% మంది అక్షరాలను గుర్తించలేక పోతున్నారు, 35.7% మంది 19 అంకెలను గుర్తించలేక పోతున్నారు. ఒకటవ తరగతిలో చేరడానికి ముందే అభ్యసన సామర్థ్యాల్లో లోపం వున్నట్లు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, అసెర్ కేంద్రం 2017 లో అధ్యయనం చేసిన 'ఇండియా ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ ఇంపాక్ట్' నివేదిక తెలియజేసింది. సరైన సంసిద్ధత (ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) లేకుండానే పిల్లలను ఒకటవ తరగతిలో చేర్చడమే అసలు లోపమని తేలింది.

**నాలుగైదు సంవత్సరాల వయసు పిల్లలకు కనీసం ఒక ఏడాది కాలమైనా మంచి టీచర్లతో రోజుకి 3–4 గంటలు తగిన లెర్నింగ్ మెటీరియల్‌తో శిక్షణ ఇస్తే పాఠశాల విద్యకు సంసిద్ధం కాగలరు. ప్రీప్రైమరీ స్కూలింగ్ ఎఫెక్టివ్‌గా అమలు చేయగలిగితే ప్రైవేట్ స్కూళ్ల ఆకర్షణను అరికట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగే అవకాశం కలుగుతుంది.**

అంగన్వాడీ కేంద్రాలు ప్రీప్రైమరీ విద్యను అందించలేక పోతున్నవి, 5–6 సంవత్సరాల పిల్లల్లో నాలుగో వంతు మంది మాత్రమే అంగన్వాడీ కేంద్రాల్లో వున్నట్లు ఈ నివేదిక తేల్చింది. మిగిలిన వారిలో కొద్దిమంది ప్రైవేట్ కేజీ, నర్సరీ క్లాసుల్లో, చాలామంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో వున్నట్లు పేర్కొన్నది. కాగా అత్యధిక ప్రైవేట్ నర్సరీ కిండర్ గార్టెన్ క్లాసుల్లో ప్రీప్రైమరీ విద్య కంటే స్కూల్ కరిక్యులమ్ పాఠాలే చెబుతున్నట్లు ఆ నివేదిక చెప్పింది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన 56 సం.ల పిల్లలకూ ఒకటవ తరగతి పాఠాలే తప్ప ప్రీప్రైమరీ విద్య లేదు కదా. పునాదిగా పరిగణించే ప్రీప్రైమరీ విద్య లేకపోవడం వలన ఆ నష్టం పాఠశాల విద్యలో కొనసాగుతోంది. గత ఐదేళ్లుగా చర్చించబడుతున్న నూతన విద్యా విధానం ముసాయిదాలో మూడు సంవత్సరాల ప్రీప్రైమరీ విద్యను ప్రతిపాదించడం జరిగింది. కానీ, దాని అమలుకు సూచించిన మూడు మార్గాలు ముందుకు పోయేవి కాదు. 4–5 సంవత్సరాల వయసు పిల్లలకు కనీసం ఒక ఏడాది కాలమైనా మంచి టీచర్లతో రోజుకి 3–4 గంటలు తగిన లెర్నింగ్ మెటీరియల్‌తో శిక్షణ యిస్తే పాఠశాల విద్యకు సంసిద్ధం కాగలరు. ప్రీప్రైమరీ స్కూలింగ్ ఎఫెక్టివ్‌గా అమలు చేయగలిగితే ప్రైవేట్ స్కూళ్ల ఆకర్షణను అరికట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగే అవకాశం కలుగుతుంది కూడాను.

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ రంగంలో ప్రీప్రైమరీ స్కూలింగ్ కోసం ఏర్పాట్లు జరిగినవి. ఉదాహరణకు పూణే, చెన్నై, ముంబై కార్పొరేషన్లలో; చిన్న రాష్ట్రాలైన ఢిల్లీ, సిక్కిం, పెద్ద రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, పంజాబ్, హర్యానా, అస్సాంలలో ఒక ఏడాది ప్రీప్రైమరీ స్కూలింగ్ అమల్లో వుంది. కానీ అవి జయప్రదమైన దాఖలాలు లేవు. ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ కి తగిన కరిక్యులం గానీ, అర్హతగల ఉపాధ్యాయులు గానీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గానీ లేకపోవడం పెద్ద లోపాలు. ప్రభుత్వ విద్యాశాఖలో భాగముగా అయితేనే బాలలందరికీ ప్రీప్రైమరీ విద్య అందించడం సాధ్యమని అనుభవాల సారాంశం. అందుకు నాలుగు రకాల నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలి. మొట్టమొదటి చర్యగా సమర్థవంతమైన ఏర్పాటు చేయాలి. ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ ఎలా వుండాలి, పిల్లలను పాఠశాలకు ఎలా సంసిద్ధం చేయాలి, అందుకు పాఠశాలలు ఎలా సంసిద్ధం కావాలి అనే విషయాలపైన విస్తృతమైన చర్చలే జరిగినవి. 'నేషనల్ ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ పాలసీ 2013' లో కరిక్యులర్ ప్రిన్సిపుల్స్ పేర్కొనబడినవి. 'ఎన్సీఈఆర్టీ–2019 లో ప్రీ స్కూల్ కరిక్యులమ్, దాని అమలుకు మార్గదర్శకాలు ప్రకటించబడినవి. వాటి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. ఇక బోధనా సిబ్బంది ఎంపిక విషయానికొస్తే శిక్షణ పొందిన బాధ్యతాయుతమైన ఉపాధ్యాయులు నిర్దిష్ట సమయ సారిణితో పనిచేస్తేనే ప్రీప్రైమరీ విద్యా బోధన సాధ్యం కాగలదు. అందుకు అనువుగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రీప్రైమరీ టీచర్స్ కేడరుని సృష్టించాలి. అదే విధంగా కేంద్ర నిధుల వినియోగంపైనా ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ పైలట్ ప్రాజక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలి. గత రెండేళ్ల కాలంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్.ఎస్.ఎ నిధుల్లోంచి పెద్ద మొత్తంలో ప్రీప్రైమరీ స్కూలింగ్ కోసం వెచ్చిస్తున్నాయి. ఈ నిధుల వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా వ్యవహరించ గలిగితే ప్రీప్రైమరీ విద్యాభివృద్ధికి దోహదపడుతుందని గమనించాలి. ఒకేసారి సార్వత్రిక ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్ సాధ్యం కాకపోతే దశలవారీగా చేపట్టాలి. వచ్చే ఐదేళ్లలో క్వాలిటీ ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అందించగలిగితే పాఠశాల విద్య అభ్యసన సామర్థ్యాల్లో సంక్షోభాన్ని అధిగమించవచ్చునని నివేదిక తెలిపింది.

– నాగటి నారాయణ
చైర్మన్, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ స్టడీస్

# బడ్జెట్‌లో భావ దారిద్ర్యం!

■ పి. చిదంబరం



'పళని' పలుకు

రాబోయే ఆర్థిక సంవత్సర (2020–21) కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1 న పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. ఫిబ్రవరి 2న దేశ వ్యాప్తంగా సకల వార్తాపత్రికల పతాక శీర్షిక బడ్జెట్టే నని మరి చెప్పనవసరం లేదు. అత్యధిక పత్రికలు సంపాదకీయాలూ రాశాయి. టీవీ ఛానెల్స్ వార్తలు, వార్తా వ్యాఖ్యలలో ప్రధానాంశం బడ్జెట్టే కాక మరేమవుతుంది? ఆ మరుసటి రోజో?! ప్రింట్ మీడియా ఫ్రంట్ పేజీల నుంచి బడ్జెట్ వార్తలు దాదాపుగా అంతర్ధానమయ్యాయి. ఎలక్ట్రానిక్ మీడియాలోనూ అదే కథ. ఒక సినిమా విడుదలైన రోజునే ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ఘోరంగా విఫలమైన చందమే మోదీ సర్కార్ తాజా బడ్జెట్ పరిస్థితి కూడా!

ఎందుకిలా జరిగింది? బాధ్యులు ఎవరు? భారతీయ జనతా పార్టీ, ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి తమను తామే నిందించుకోవల్సి వుంది సుమా! ప్రధాన ఆర్థిక సలహాదారు(ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ విషయమై ఆర్థిక సర్వేలో ఆయన ప్రశస్త సలహాలనిచ్చారు)ను తప్పుపట్టలేరు. అలాగే బడ్జెట్ రూపకల్పన సన్నాహక సంప్రదింపులలో భాగంగా ప్రధానమంత్రితో సమావేశమైన ఆర్థిక వేత్తలను గానీ, పారిశ్రామిక దిగ్గజాలను గానీ ఆక్షేపించలేరు.

అభివృద్ధి సాధక, సంక్షేమ ప్రధాన బడ్జెట్ రూపకల్పనకు తోడ్పడే అనేక భావాలు, ప్రతిపాదనలు ప్రభుత్వం ముందున్నాయి. బడ్జెట్ సందర్భంగా మార్కెట్లలో సహజంలో విన్పించే వదంతులు, కన్పించే కోలాహలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రి తప్పక పరిగణనలోకి తీసుకోవల్సిన పది విషయాల గురించి జనవరి 26 న నా 'పళని పలుకు' ('మన భాగ్య మెట్లున్నదో?!') లో ప్రస్తావించాను. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రధాన ఆర్థిక సలహాదారు లేదా ఆర్థిక వేత్తల సలహాలను లక్ష్య పెట్ట లేదు; వ్యాపార రంగ దిగ్గజాల డిమాండ్లనూ అంగీకరించలేదని 2020–21 బడ్జెట్ స్పష్టం చేసింది. ఎందుకని? ఈ క్రింది కారణాల వల్లేనని నేను భావిస్తున్నాను. అవి:

(1) తాను చేసిన తప్పులను నిరాకరిస్తున్న వైఖరినే నరేంద్ర మోదీ ప్రభుత్వం కొనసాగిస్తోంది. రూ.500, రూ.1000 కరెన్సీ నోట్ల రద్దు , లోపభూయిష్ట వస్తుసేవల పన్ను మహాతప్పిదాలనే వాస్తవాన్ని అంగీకరించేందుకు పాలకులు ససేమిరా అంటున్నారు. ఆ చర్యల వల్ల చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలు అసంఖ్యాకంగా మూతబడి, సంఖ్యానేక ఉద్యోగాలు హరించుకుపోయాయనే బాధాకరమైన యథార్థాన్ని ఒప్పుకోవడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సిద్ధంగా లేరు. ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి జారిపోవడానికి ఎగుమతుల తగ్గుదల, విత్త రంగంలో అస్థిర పరిస్థితులు, పరిశ్రమల అవసరాల కనుగుణంగా పరపతి సదుపాయం లేకపోవడం, కుటుంబ పొదుపులు స్వల్పస్థాయికి పడిపోవడం, వినియోగం తగ్గిపోవడం, మైనింగ్, తయారీ రంగాలు కుదేలవ్వడం, ఆర్థిక రంగంలో ఎల్లెడలా అనిశ్చితి, భయం రాజ్యమేలుతుండడం వల్లే ఆర్థిక వ్యవస్థ పురోగతి మందగించిందనే వాస్తవాన్ని పాలకులు ఒప్పుకోవడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్న ఈ ప్రతికూలతలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించనే లేదు.

(2) ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించిన ప్రభుత్వ అంచనా అవిశ్వసనీయంగా వున్నది. చక్రీయ హెచ్చుతగ్గుల కారణంగానే ఆర్థిక వ్యవస్థ పురోగతి మందగమనంలోకి పడిపోయిందని మోదీ సర్కార్ విశ్వసిస్తోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి తాము ఇంతకు ముందు చేపట్టిన చర్యలనే అప్పులు తీసుకోవడం, ప్రస్తుతం అమలులో వున్న కార్యక్రమాలకు మరింతగా నిధులు సమకూర్చడం, కొత్త కార్యక్రమాలను ప్రకటించడం మరింత పటిష్ఠంగా, మరింత విస్తృతంగా అమలుపరచడం వల్ల దేశ ఆర్థిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పాలకులు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు. వ్యవస్థాగత కారణాల వల్ల గాక, చక్రీయ హెచ్చుతగ్గుల వల్లే (పలువురు ఆర్థిక వేత్తలు అవునని అంటున్న విషయమిది) ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి పడిపోయివున్నట్టయితే, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు తోడ్పడే ప్రత్యామ్నాయ మార్గాలు ప్రభుత్వ పరిశీలనలో వున్నాయా? మోదీ సర్కార్ అసలు ఆ వైపుగా ఆలోచించడం లేదనిచెప్పక తప్పదు.

(3) ప్రభుత్వ సైద్ధాంతిక విశ్వాసాలు, ప్రాధాన్యాలు ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు అవరోధాలవుతున్నాయి. దేశీయ పరిశ్రమల సంరక్షణ వాదం, దిగుమతి ప్రత్యామ్నాయం, 'బలమైన' రూపాయి మొదలైన కాలం చెల్లిన ఆర్థిక చింతననే ప్రభుత్వం అభిమానిస్తున్నది, అనుసరిస్తున్నది. విదేశీ వాణిజ్యాన్ని పెంపొందించుకోవడం వల్ల సమకూరే బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని ప్రభుత్వం భావించడం లేదు. ఫలితంగా ఎగుమతులను ఇతోధికంగా పెంపొందించే ప్రయత్నాలను కనీస మాత్రంగానైనా చేయడం లేదు. దిగుమతి సుంకాలను పెంపొందించడమనే తిరోగామి ఆర్థిక విధానానికే ప్రభుత్వం అంటిపెట్టుకుని వుంటోంది. రూపాయి విలువ వాస్తవిక స్థాయిలో వుండేందుకు అనుమతించడం లేదు. ఇందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతుందో అర్థం కావడం లేదు. ఇటువంటి శాస్త్రీయ ఆలోచనల వల్లే ఆర్థిక వ్యవస్థ సమస్యలకు సరైన పరిష్కారాలను కనుగొనలేకపోతోంది.




> 2020–21 కేంద్ర బడ్జెట్ రూపకల్పలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రధాన ఆర్థిక సలహాదారు, ఇతర ఆర్థిక వేత్తల సలహాలను లక్ష్య పెట్ట లేదు; వ్యాపార రంగ దిగ్గజాల డిమాండ్లనూ అంగీకరించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ విషమ సవాళ్లతో సతమతమవుతుండగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం సమస్యల పట్ల అవగాహనారాహిత్యం, పిరికితనంతో వ్యవహరించింది!

(4) ప్రభుత్వం, వ్యాపారవర్గాల మధ్య పరస్పర అపనమ్మకాన్ని అధికం చేసిన చర్యలు, నిర్ణయాలను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం విముఖంగా వున్నది. మోదీ సర్కార్ పలు ఆర్థిక చట్టాలను నేరపూరితం చేసింది. పన్ను వసూళ్ల వ్యవస్థలు, దర్యాప్తు సంస్థలలోని క్రిందిస్థాయి అధికారులకు అపరిమిత అధికారాలను కట్టబెట్టింది. పన్ను వసూలు పన్ను ఉగ్రవాదంగా మారిపోయింది (వి.జి. సిద్ధార్థ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో గుర్తుచేసుకోండి). పన్ను చెల్లింపుదారుల హక్కుల చట్టాన్ని తీసుకువస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. ఈ హామీని విశ్వసించేదెవరు? పన్ను వసూళ్ల వ్యవస్థ, దర్యాప్తు సంస్థల క్రింది స్థాయి అధికారులకు సైతం కట్టబెట్టిన అపరిమిత అధికారాలను ప్రభుత్వం ఎందుకు ఉపసంహరించుకోదు? అనేదే ఆర్థిక మంత్రి హామీకి వ్యాపార వర్గాల, ఇతర పన్ను చెల్లింపుదారుల సంశయాత్మక ప్రతిస్పందన.

(5) ఆర్థిక వ్యవస్థ వ్యవహారాలలో తానొక అసమర్థ మేనేజర్‌నని ప్రభుత్వం తననుతాను నిరూపించుకున్నది. నోట్ బందీనుంచి, వస్తుసేవల పన్ను దాకా, స్వచ్ఛ్ భారత్ మిషన్ నుంచి , ప్రతి ఇంటికీ విద్యుత్ వెలుగులు సమకూర్చడం వరకు, ఉజ్వల యోజన నుంచి ఉదయ్ దాకా ప్రతి కార్యక్రమ రూపకల్పన, అమలు రెండిటిలోనూ లోపభూయిష్టమైనదే. లొసుగుల మయమైన కార్యక్రమాలతో ప్రజాహిత లక్ష్యాలు నెరవేరతాయా? దురదృష్టవశాత్తు ప్రభుత్వం వాస్తవాలను చూడ నిరాకరిస్తోంది. అప్రియ సత్యాలను అంగీకరించడం లేదు. భజనపరుల మెచ్చుకోళ్లనే ఆమోదిస్తోంది. ప్రస్తావిత కార్యక్రమాల అమలుకు భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితాలు సంతృప్తికరంగా వుండడం లేదు. పథకాలు అమలు పద్ధతులను మెరుగుపరిచే సామర్థ్యం పాలనా యంత్రాంగానికి కొరవడింది. పథకాల అమలులో వాస్తవ ఫలితాలు ఎలా వున్నాయో ప్రభుత్వానికి నిష్పాక్షికంగా నివేదించడం లేదు.

మరి ఇటువంటి పరిస్థితులలో అభివృద్ధి సాధనకు, సంక్షేమ ప్రదానానికి దోహదం చేయని నిస్తేజ బడ్జెట్‌ను సమర్పించడానికి మాత్రమే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పరిమితమవ్వడంలో ఆశ్చర్యమేముంది? ఈ బడ్జెట్‌తో స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు పెరుగుదల నామమాత్రంగా మాత్రమే ఉంటుంది. పన్ను రాబడులపై ఆర్థిక మంత్రి ఆశాభావానికి పటిష్ఠ ప్రాతిపదికలు కన్పించడం లేదని ఆర్థిక వేత్తలు సకారణంగానే భావిస్తున్నారు. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు 10 శాతం చొప్పున పెరుగుతుందని, స్థూల పన్ను రాబడులు 12 శాతం చొప్పున పెరుగతాయనేది బడ్జెట్ అంచనా. అయితే ఇవి అసంభవాలు. సందేహాతీతమైన సత్యమది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే, అంచనా వేసిన పన్నుల రాబడులను వివిధ పథకాలకు పంపిణీ చేయవలసివుంటుంది (ఈ పథకాల సంఖ్య తక్కువేమీ కాదుకదా). ఈ దృష్ట్యా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలన్నిటికీ మరిన్ని నిధులు కేటాయించే అవకాశం లేదు. పేదలకు సత్వరమే మరింత ధనం అందుబాటులోకి రావడమనేది పగటికలే అవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాలు, కార్యక్రమాలకు కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు పెట్టనేలేదు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీ, మధ్యాహ్న భోజన పథకం, ఆహార సబ్సిడీ, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ మొదలైన వాటికి కేటాయింపులను భారీగా తగ్గించారు. మరి గ్రామీణ ఆదాయాలు/ వేతనాలు గానీ లేదా కుటుంబ వినియోగం గానీ ఎలా పెరుగుతుందో నాకు అర్థం కావడం లేదు.

వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులకు ఇచ్చిన మినహాయింపులు వాస్తవానికి పన్నుల వసూలు వ్యవస్థను మరింత సంక్లిష్టం చేసింది. ఆ మినహాయింపులు వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారులలో అయోమయాన్ని సృష్టించాయి. వాటి వల్ల రూ.40,000 కోట్ల రూపాయల మేరకు లబ్ధి సమకూరుతుందనే అంచనా ఖచ్చితమైనది కాదు. ఏమైనా దాని ప్రభావం చాలా స్వల్పంగా మాత్రమే ఉండగలదు. ప్రైవేట్ పెట్టుబడులను ఇతోధికం చేసేందుకు దోహదం చేసే ప్రోత్సాహకాలు సైతం ఈ బడట్‌లో లేవు. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ రద్దు, పన్ను చెల్లింపు భారాన్ని కంపెనీ నుంచి తొలగించి, వాటాదారులపై మోపింది. తయారీరంగ సామర్థ్యాన్ని కేవలం 70 శాతం మాత్రమే ఉపయోగించుకోగలుగుతున్న పరిస్థితుల్లో కొత్త పెట్టుబడులు రావడానికి ఆస్కారమే లేదు. తమది పటిష్ఠ, నిర్ణయాత్మకంగా వ్యవహరించే ప్రభుత్వమని మోదీ సర్కార్ తరచు గొప్పగా చెప్పుకోవడం కద్దు. ఈ ఆత్మశ్లాఘన సమర్థనీయమేనా? ఎందుకంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఇటీవలికాలంలో ఎన్నడూ లేని విధంగా విషమ సవాళ్లతో సతమతమవుతుండగా మోదీ ప్రభుత్వం సమస్యల పట్ల అవగాహనారాహిత్యం, పిరికితనంతో వ్యవహరించింది!

## జనవాక్యం

### 1946 నాటి పరిస్థితి లోకే..

పౌరసత్వ సవరణ చట్టాన్ని బూచిగా చూపి ముస్లిం ప్రజలందరినీ తమ వైపు తిప్పుకొనేందుకు కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు చేస్తున్న జాతి వ్యతిరేక విధానాలను ఈ దేశ హితం కోరేవారందరూ నిరసించాలి. ప్రజలు తమ కేమీపట్టనట్టు ఉంటే 1946 నాటి ప్రత్యక్ష చర్య లాంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది అనేది అక్షర సత్యం. ముస్లిములందరినీ రెచ్చగొట్టే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ విషయంలో ప్రజలకు వాస్తవాలను వివరించి చెప్పడంలో జాతీయ వాద సంస్థలు వెనుక బడ్డాయి. ఇప్పటికైనా జాతీయ వాదులు జాతి జనులను చైతన్యం చేసే పనిని సమర్థవంతంగా చేయాలి.

– ఝాన్సీ రాణి, కడప జిల్లా

### సకాలంలో చెల్లింపులేవి?

రైతులకు తమ పంటలకు మద్దతు ధర వచ్చేలా చూడాలని అందుకు అధికారులదే బాధ్యత అని ముఖ్యమంత్రి ఆదేశించారు. అయితే, రాష్ట్రంలో రైతులు తమ పంటల అమ్మకాలలో అడుగడుగునా నష్టపోతూనే ఉన్నారు. అంతకు మించి కొనుగోలు చేసినా, చెల్లింపులలో అనవసర తాత్సారంతో రైతులు మరింత నష్టపోతున్నారు. ఉదాహరణకు గత డిసెంబర్ మాసంలో అమ్మిన ధాన్యానికి రైతులకు ఇంతవరకు ప్రభుత్వం డబ్బు చెల్లించక పోవటంతో రైతులు బ్యాంకులు, మిల్లర్ల చుట్టూ తిరగటంతోనే సరిపోతున్నది. ఇలా అనవసర జాప్యంతో తెచ్చిన రుణాలకు వడ్డీ భారం పెరిగిపోతున్నది. ఆపైన తేమ అనీ, రవాణా ఖర్చులు అనీ, నాణ్యత పేరుతో ధరలను తెగ్గోస్తున్నారు. ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతున్నదో వాస్తవాలు తెలుసుకోకుండా అధికారులదే బాధ్యత అని చేతులు దులుపుకోవటం సబబు కాదు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీలలో రాజకీయ పెత్తనంతో రైతులకు న్యాయం జరిగే పరిస్థితి లేకుండా పోయింది. సహకార, మార్కెటింగ్ వ్యవస్థలలో రాజకీయ పెత్తనాన్ని తగ్గించి, నిజమైన రైతులను భాగస్వామ్యులను చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుంది.

– ఆర్కే, ముస్తాబాద

# భావ విప్లవోద్యమ తాత్వికుడు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో హేతువాద, మానవవాద, భావ విప్లవవాద నిర్మాణానికి జీవితాన్నే అంకితం చేసిన మేధావి, రచయిత, తత్వవేత్త రావిపూడి వెంకటాద్రి. ఆ లక్ష్య సాధనలో భాగంగానే అపూర్వమైన, అమూల్యమైన హేతువాద,మానవవాద సాహిత్యాన్ని సృష్టించారు. దాదాపు వెయ్యేండ్ల చరిత్ర గలిగిన తెలుగు సాహిత్యంలో హేతువాద శకానికి సారథ్యం వహించి చరిత్ర సృష్టించాడు.

రావిపూడి వెంకటాద్రి హేతువాద మానవవాద సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆయన విశిష్టత అవగతమవుతున్నది. ఆ విశిష్టతలోని ప్రధానాంశాలు..

1. ఒక్క తెలుగు సాహిత్యంలోనే కాదు, భారతీయ సాహిత్యంలోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనే 'హేతువాదం' అనే శీర్షికతో తాత్విక సిద్ధాంత గ్రంధాన్ని రచించిన తొలి రచయితగా చరిత్ర సృష్టించాడం.
2. హేతువాదం, నాస్తికత్వం, భౌతికవాదం, భౌతికవాస్తవిక వాదం, మానవవాదం వంటి అంశాలను స్పష్టంగా వివరించడమే గాక వాటిమధ్యనున్న సంబంధాలను, పరిధులను మొదటి సారిగా లోకానికి తెలియజేసిన మేధావిగా నిలిచిపోవడం.
3. హేతువాద లక్ష్యం మానవవాదమని నాలుగు దశాబ్దాలకు పూర్వమే మొదటి సారిగా ప్రకటించి హేతువాద మానవవాద ఉద్యమానికి దిశా నిర్దేశం చేసిన క్రాంతదర్శి.
4. హేతువాద మానవవాదాల తాత్విక భూమికను తెలుపడమే గాక వాటిని తన రచనల ద్వారా తాత్విక పరిపుష్టిని చేకూర్చి, అనితర సాధ్యమైన రీతిలో వాటిని తీర్చిదిద్దడం.
5. 1982లోనే 'హేతువాది' మాస పత్రికను నెలకొల్పి దానికి తానే సంపాదకత్వం వహించి, గత 38 సంవత్సరాలుగా నిరాటకంగా ఆ పత్రికను నడుపుతూ హేతువాద ఉద్యమానికి తోడ్పడడం.
6. సమాజంలో అన్ని రంగాలలో నెలకొనివున్న అసమానతలను, దోపిడీని, నియంతృత్వ విధానాలను వ్యతిరేకించి, స్వేచ్ఛా సమానత్వ సౌభ్రాతృత్వాలపై ఆధారపడిన నూతన సమాజ నిర్మాణం కోసం హేతువాద మానవవాద భావ విప్లవోద్యమాన్ని నిర్మించడం.

వెంకటాద్రి 1946 నుండే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. గత 74 సంవత్సరాలుగా కొనసాగుతున్న రచనా వ్యాసంగంలో దాదాపు 90 గ్రంధాల దాకా ఆయన వెలువరించారు. 99 సంవత్సరాల వయసులో ఆయన ఇప్పటికీ తన రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తుండటం అందరినీ అబ్బురపరిచే వాస్తవం.

ఆయన సాహిత్యాన్ని సమీక్షించడమంటే సముద్రాన్ని మధించడం వంటిదే. హేతువాదం, నాస్తికత్వం, భౌతికవాదం, భౌతికవాస్తవిక వాదం, మానవ వాదాల గురించి కూలంకషంగా చర్చించి సమగ్ర వివరణను అందించారు. వాటి ప్రత్యేకతల గురించి, పరిధుల గురించి, పరస్పర సంబంధాల గురించి స్పష్టంగా వివరించారు.

హేతువంటే ప్రకృతి నియమమే. అది సింపుల్ కామన్‌సెన్స్. అది సిద్ధాంతమూ కాదు, వాదమూ కాదు. అదోక ఆలోచనా విధానం. హేతు చింతన అనేది మానవుడికి ప్రకృతి పరిణామంలో ఇచ్చిన జీవ లక్షణం. మానవుడు నియమబద్ధమైన ప్రకృతి పరిణామ క్రమంలో ఆవిర్భవించడం వల్ల ప్రకృతిలోని నియమబద్ధత మానవుడిలో హేతుత్వంగా పరిణమించింది.

హేతుచింతన, జ్ఞానార్జన, సత్యాన్వేషణ, స్వేచ్ఛాపిపాస, నైతికత సంపూర్ణ మానవుడి కారక లక్షణాలు. సమాజ ప్రగతికి మూల స్తంభాలు. ఆదిమానవునికి అనంతంగా ప్రశ్న లెదురైనాయి. వాటికి సమాధానంగానే అతడు దైవాన్ని సృష్టించుకున్నాడు. తరువాత అతని పరిశీలన, అనుభవం పెరిగాయి. దైవానికి కారణమేమిటని ప్రశ్నించుకున్నాడు. దానికి సమాధానం లేదని గ్రహించి దైవభావాన్ని తిరస్కరించి నాస్తికుడైనాడు.

ఈ విధంగా ఆస్తిక నాస్తిక వాదాలకు అతనిలోని హేతుత్వమే కారణమైంది. దేవుడి జననానికీ, మరణానికీ రెంటికీ మూలం హేతుత్వమే. దేవుడు నిన్న మొన్నటి వాడు, చాల పసివాడు దేవుడి కంటే ముందే అతని తండ్రి అంటే మనిషి ఉన్నాడు. మనిషి కంటే ముందే ప్రకృతి ఉంది. దేవుడు లేకున్నా , మనిషి లేకున్నా ప్రకృతి ఉంటుంది. అది బహుళ రూపాలలో నిరంతరం పరిణమిస్తూనే ఉంటుంది.

> సమాజంలో ఏ రంగంలో మార్పు రావాలన్నా ముందుగా ఆ మార్పు మనుషుల భావాల్లో రావాలి. అందుకే మనుషుల భావాల్లో, దృక్పథంలో సమూల మార్పు తెచ్చే హేతువాద, మానవవాద భావ విప్లవాలు మాత్రమే అన్ని సమస్యలకూ పరిష్కార మార్గంగా నిలుస్తున్నాయి. మనుషులు తమ సమస్యలను తామే పరిష్కరించుకునే విధంగా తీర్చిదిద్దడమే మానవవాద లక్ష్యం. ఇటువంటి విశిష్టమైన భావాలతో కూడిన రావిపూడి వెంకటాద్రిగారి మేధో కృషి భావవిప్లవోద్యమానికి జవజీవాలను తాత్విక పుష్టిని చేకూర్చి తెలుగు సాహిత్యానికే ఆదర్శంగా నిలిచింది.


మానవుడు తన చుట్టూవున్నా పరిసరాలను జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహించడం వల్లనే ఆయా వస్తువులకు, సంఘటనలకు సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. జ్ఞానమంతా వస్తుజ్ఞానమే గాని అవస్తు జ్ఞానం కాదు. జ్ఞానమంతా భౌతికమే కాని అభౌతికం కాదు. జ్ఞానమంతా ఇంద్రియ జ్ఞానమే గాని అతీంద్రియ జ్ఞానం కాదు. ధ్యానం చేయడం ద్వారా, యోగావిద్య ద్వారా, తపస్సు చేయడం ద్వారా జ్ఞానం ఏర్పడదు.

ఒక వస్తువుకు సంబంధించిన జ్ఞానమంతా ఒకేసారి ఏర్పడదు. పరిశీలన, పరిశోధన, ప్రయోగాల ద్వారా ప్రకృతి జ్ఞానం క్రమంగా అధికంగా అభిస్తుంది. మునుపటి జ్ఞానంతో పోల్చినపుడు వర్తమానంలో లభించిన జ్ఞానం గతంలోని జ్ఞానం కంటే మెరుగైనదిగా ఉంటుంది. అందుకే జ్ఞానం సాపేక్షం అంటాం.

ఒక వస్తువుకు గాని, సంఘటనకు గాని సంబంధించిన జ్ఞానం ఏ మేరకు కలుగుతుందో ఆమేరకు అది వాటికి సంబంధించిన సత్యమవుతుంది. అందుకే సత్యమంటే జ్ఞాన విషయమే అంటున్నాం. జ్ఞానం సాపేక్షమైనందు వల్ల సత్యం కూడా సాపేక్షమవుతుంది. అందువల్ల సంపూర్ణ జ్ఞానం గాని, సంపూర్ణ సత్యం గాని ఉండవు. పరమ జ్ఞానం, పరమ సత్యం అనేవి లేవు. ఎవరూ సర్వజ్ఞుడు కాదు. సర్వజ్ఞత్వమనేదే అసంభవం. హేతువాదాన్ని దేవుడికి సంధించినపుడు నాస్తికత్వం ప్రపంచానికి సంధించినపుడు భౌతికవాదం, మనిషికి సంధించినపుడు మానవవాదం ఆవిర్భవిస్తాయని తెలుసుకోవాలి. చరిత్రలో చార్వాకులు మొదటి భౌతిక వాదులుగా నిలుస్తారు. వారినాస్తిక సిద్ధాంతం స్వభావవాదం. వేదాలను తిరస్కరించిన ప్రప్రథమ అవైనిక తాత్విక భావోద్యమం చార్వాకం. లోకంలో బాగా వ్యాపించినందువల్ల దాన్ని లోకాయతం అన్నారు. వారు హేతువును సమర్థంగా ప్రయోగించారు.

క్రీ.పూ. ఆరవ శతాబ్దంలోనే బయలుదేరిన చార్వాకోద్యమం వేద మతాన్ని చీల్చి చెండాదింది. చార్వాకం అంటే గిట్టని మతస్థులు వారి గ్రంథాలను నిశ్శేషంగా నిర్మూలించినట్లు తెలుస్తోంది. చార్వాకులను వ్యతిరేకించిన విమర్శల ఆధారంగానే మనం వాది సిద్ధాంతాలను, భావాలను తెలుసుకోవలసి వస్తుంది.

ప్రాచీన భారతీయ తాత్విక చింతనలో చార్వాక జైనబౌద్ధాలు అపూర్వమైనవి, అమూల్యమైనవి. అవన్ని ప్రపంచాన్ని భౌతికవాదపరంగా వ్యాఖ్యానించాయి. ఆనాటి సమాజంలో నెలకొనివున్న యజ్ఞయాగాద క్రతువులను, జంతుబలులను, వర్ణవ్యవస్థను, అమానతలను, మూఢ విశ్వాసాలను ఖండించి సమానత్వాన్ని ప్రతిపాదించాయి. అన్నీటికన్న ఉన్నతమైన బౌద్ధం. దేశంలోనే కాక ఆసియాలోని చాలా దేశాలకు అది విస్తరించింది. స్వేచ్ఛా సమానత్వ సౌభ్రాతృత్వాలపై ఆధారపడిన విలువలతోకూడిన ఉన్నత జీవన విధానాన్ని ప్రతిపాదించి ప్రపంచానికే ఆదర్శంగా నిలబడింది. ఆనాటి కాలానికి బుద్ధుడిని మించిన తత్వవేత్తగాని, బౌద్ధాన్ని మించిన భావవిప్లవోద్యమంగాన్ని మరోకటిలేదంటే అతిశయోక్తి కాదు. అటువంటి బౌద్ధాన్ని బ్రాహ్మణులు మారువేషాల్లలో చొరబడి నాశనం చేశారు. దేవుడు లేడన్న బుద్ధుడినే విష్ణువు అవతారంగా దశావతారాల్లో చేర్చారు.




అన్నీటికన్న ఉన్నతమైన తాత్విక విధానం మానవతావాదం. మానవవాదం (Humanitariamism) మానవవాదం (Humanism) ఒకటికాదు మనుషుల్లో సహజ సిద్ధంగా వుండే జాలి, దయ, కరుణ వంటివి మానవతా వాదానికి ప్రాతిపాదిక మానవవాదంలో మానవుడు శ్రేయస్సు, స్వేచ్ఛ ప్రథమ స్థానంలో వుంటాయి. అందుకే అది మానవ కేంద్రవాదమైంది. దాన్నే మనం వ్యక్తి వాదమంటాం. మానవుడు స్వేచ్ఛగా, హుందాగా, ఆనందంగా జీవించడమే మానవవాదంలో ప్రధానం మానవుడు తనకు తానే లక్ష్యం. మరో దానికి సాధనం కాదు.

మానవుడు అన్నిటికీ ప్రమాణం అన్న ప్రొటాగరస్ సూక్తి మానవ జాతికి మానవుడే మూలం అన్న కార్ల్ మార్క్స్ సూక్తి, మానవుడు తన భవితవ్యానికి తానే కర్త అన్నం ఎం.ఎన్. రాయ్ సూక్తి మానవవాద స్వభావాన్ని విశిష్టతను తెలియజేస్తాయి.

సమాజంలో ఏ రంగంలో మార్పు రావాలన్నా ముందుగా ఆ మార్పు మనుషుల భావాల్లో రావాలి. అందుకే మనుషుల భావాల్లో, దృక్పథంలో సమూల మార్పు తెచ్చే హేతువాద, మానవవాద భావ విప్లవాలు మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కర మార్గంగా నిలుస్తున్నాయి. మనుషులు తమ సమస్యలను తామే పరిష్కరించుకునే విధంగా తీర్చిదిద్దడమే మానవవాద లక్ష్యం. అందుకే రాడికల్ హ్యూమనిస్టులు ప్రజలకు మిత్రులుగా, తాత్వికులుగా, మార్గ దర్శకులుగా వుండి కృషి చేయాలి. ఇటువంటి విశిష్టమైన భావాలతో కూడిన రావిపూడి వెంకటాద్రి మేధో కృషి భావ విప్లవోద్యమానికి జవజీవాలను తాత్విక పుష్టిని చేకూర్చి తెలుగు సాహిత్యానికే ఆదర్శంగా నిలిచింది. ఆభావ ప్రవంతిని జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అభ్యుదయవాదుల మీద ఉంది.

■ గుమ్మా వీరన్న
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం

(ఫిబ్రవరి 8,9,10 తేదీల్లో ప్రకాశం జిల్లా ఇంకొల్లులో భారత హేతువాద సంఘం మహాసభలు–
9వ తేదీ రావిపూడి వెంకటాద్రి 99వ జన్మదినోత్సవం)



"ఆకాశంలోకి ఎగరాలి... అంతరిక్షాన్ని చుట్టి రావాలి.... ఈ కల కననివారు ఉండరు. కానీ అది అసాధ్యమైన కల. అయితే నా విషయంలో ఆ స్వప్నం నిజమైంది. అంతేకాదు అంతరిక్షంలో ఎక్కువకాలం గడిపిన మహిళగా నన్ను మరో ఎత్తులో నిలబెట్టింది. అందుకే నా ప్రయాణం ప్రతి ఒక్కరి ప్రయాణం. వారి కలలనే నేను అంతరిక్షంలోకి మోసుకువెళ్లాను" అంటున్నారు రోదసిలో దాదాపు 11 నెలలు గడిపి భూమ్మీదకు తిరిగొచ్చిన వ్యోమగామి **క్రిస్టినా కోచ్**!

న్యూస్‌మేకర్



# అంతరిక్షంలో ఆమె జయకేతనం!

"అమెరికా మిచిగాన్ రాష్ట్రంలోని గ్రాండ్ ర్యాపిడ్ నేను పుట్టిన ఊరు. పెరిగింది మాత్రం మా నాన్న డాక్టర్ రోనాల్డ్ హమ్మోక్ సొంత ఊరైన ఉత్తర కరోలినాలోని జాక్సన్‌విల్లేలో. అమ్మానాన్న ప్రోత్సాహంతో ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, భౌతిక శాస్త్రాల్లో రెండు బ్యాచిలర్ డిగ్రీలు చేశాను. గొడ్డార్డ్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ (జీఎస్ఎఫ్‌సి)లోని నాసా అకాడమీ ప్రోగ్రామ్‌లో కూడా గ్రాడ్యుయేషన్ చేశాను. ఆ తరువాత నాసా జీఎస్ఎఫ్‌సి లేబరేటరీలో ఎలక్ట్రానిక్ ఇంజనీర్‌గా చేరిపోయా. నాసా చేపట్టిన అనేక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నా. ఆ క్రమంలో యునైటెడ్ స్టేట్స్ అంటార్కిటిక్ ప్రోగ్రామ్‌లో సహాయ పరిశోధకురాలుగా మూడున్నర ఏళ్ళపాటు ఆర్కిటిక్, అంటార్కిటిక్ ఖండాల్లో క్లిష్టమైన వాతావరణాల్లో పని చేయడం నన్ను శారీరకంగానూ, మానసికంగానూ రాటుతేల్చింది. అనంతరం జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీలో, నేషనల్ ఓషనిక్ అండ్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఎఎ), అమెరికన్ సమోవా అబ్జర్వేటరీల్లో వివిధ హోదాల్లో పని చేశా. పరిశోధనలూ, ఉద్యోగ బాధ్యతల మధ్య తీరికలేకుండా ఉన్న నా జీవితం ఒక్కసారిగా కొత్త మలుపు తిరిగింది.

**ఒక్కరికే చెప్పాలన్నారు...**

నాసా 2011లో అస్ట్రోనాట్ గ్రూప్-21కు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. దాదాపు 6,300 మంది దరఖాస్తులు పంపారు. అభ్యర్థుల నేపథ్యం, అర్హతలు తదితర అంశాల మీద లోతైన పరిశీలన చేసి, తుది ఎంపిక పూర్తి చేయడానికి ఏడాదిన్నర సమయం పట్టింది. ఆ కాలమంతా ఎంతో ఉత్కంఠ అనుభవించాను. చివరికి ఒక రోజు నాసా నుంచి నేను ఎంపికయ్యానని కాల్ వచ్చింది. అయితే ఈ సంగతి ఒక్కరికి మాత్రమే చెప్పాలని షరతు విధించారు. అప్పట్లో నా స్నేహితుడు, ఆ తరువాత నా భర్త అయిన రాబర్ట్‌కు ఈ సంగతి చెప్పాను. ఆ సమయంలో అతడి ముఖంలో కనిపించి ఆశ్చర్యం, ఆనందం నేను ఎప్పటికీ మరచిపోలేను. తుది జాబితాను నాసా అధికారికంగా ప్రకటించడానికి దాదాపు రెండు వారాలు పట్టింది. ఆ లోపు నా ఉద్వేగాన్ని దాచుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

**అంత తేలిక కాదు...**

మరో విశేషం ఏమిటంటే పురుషులతో సమానంగా మహిళలు ఎక్కువగా ఎంపికైన గ్రూప్ మాదే. క్లాస్-2-13లో నలుగురు పురుషులు, నలుగురు మహిళలం ఎంపికయ్యాం. అనంతరం రెండేళ్ళ శిక్షణ మాకు చాలా విషయాలు నేర్పింది. సీనియర్ వ్యోమగాములతో కలిసి పనిచేస్తూ, వారి అనుభవాలను తెలుసుకున్నాం. అంతరిక్షంలోకి వెళ్లడానికి అవసరమైన నిర్దిష్ట ప్రమాణాలు అందుకోవడానికి శ్రమించాం. మా శిక్షణ 2015లో పూర్తయింది. ఈ శిక్షణలో నాకు బాగా నచ్చిన అంశం స్పేస్ వాక్. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం బయట ఉండే వాతావరణాన్ని ఏర్పాటు చేస్తారు. పూర్తి స్పేస్ షూట్ వేసుకొని ప్రాక్టీస్ చెయ్యడం భలేగా ఉంటుంది! అయితే అది అనుకున్నంత తేలిక కాదు. శారీరకంగా చాలా కష్టం. అలాగే అంతరిక్ష వాతావరణంలో మన శరీరంలో వచ్చే మార్పులను సమన్వయం చేసుకోవడం కూడా సవాలే!

**ఇది ఊహించలేదు!**

శిక్షణ పూర్తి చేసుకున్నాక ఎప్పుడెప్పుడు అంతరిక్షంలోకి వెళ్తానా? అని ఎదురు చూశాను. చివరకు అనుకున్న రోజు రానే వచ్చింది. చిన్నప్పటి నుంచీ నేను వ్యోమగామి కావాలనుకున్నాను. నా గదిలో స్పేస్ పోస్టర్లు అతికించుకొని రోజూ చూస్తూ ఉండేదాన్ని. ఆ కోరిక తీరబోతోందన్న సంతోషం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్ళే ఎక్స్‌పిడిషన్ 59 బృందానికి నేను ఎంపికయ్యాను. లాంఛనాలన్నీ పూర్తయ్యాక, 2019 మార్చి 14న సోయుజ్ ఎంఎస్-12 స్పేస్ క్రాఫ్ట్ నింగిలోకి ఎగిరింది. నాతోపాటు మరో ఇద్దరు ఉన్నారు. అంతరిక్ష కేంద్రంలో మాతోపాటు ఎక్స్‌పిడిషన్ 58కి చెందిన మరో ముగ్గురు కలిశారు. అంతరిక్ష కేంద్రంలో మేము అనేక ప్రయోగాలు, పరిశోధనలు చేశాం. అంతరిక్షంలో మంటల వ్యాప్తి ఎలా ఉంటుంది, అక్కడ ఆహారం, నీటిని ఎలా సంరక్షించాలి, కాయగూర మొక్కలు ఎలా పెరుగుతాయి... మైక్రోగ్రావిటీ, అంతరిక్ష ప్రయాణాల ప్రభావం మూత్రపిండాలపై ఎలా ఉంటుంది తదితర అంశాలు వీటిలో ఉన్నాయి. మాలో కొందరు గత ఏడాది జూన్‌లో భూమి మీదకు వచ్చారు. నేను ఎక్స్‌పిడిషన్ 60లో కొనసాగాను. ఎక్స్‌పిడిషన్ 61లో అంతరిక్ష కేంద్రానికి వచ్చిన మరో నాసా మహిళా వ్యోమగామి జెస్సికా మెయిర్, నేనూ కలిసి గత అక్టోబరులో స్పేస్ వాక్ చేశాం. అంతరిక్ష చరిత్రలో ఇద్దరు మహిళలు కలిసి ఒకేసారి స్పేస్ వాక్‌చేయడం అదే మొదటిసారి. మొత్తం ఆరుసార్లు- మొత్తం 42 గంటల 15 నిమిషాలపాటు స్పేస్ వాక్ చేశాను. మొదట ఆరునెలలు అనుకుంటే, దాదాపు 11 నెలలు నేను అంతరిక్షంలో ఉన్నాను. ఒకే మిషన్‌లో 328 రోజులు అంతరిక్షంలో ఉన్న తొలి మహిళ వ్యోమగామిగా నిలవడం అనేది నేను ఎన్నడూ ఊహించలేదు. దీని ద్వారా పెగ్గీ విట్సన్ రికార్డు అధిగమించడం కూడా ఆనందంగానే ఉంది. ఎందుకంటే వ్యోమగామిగా అనేక విషయాల్లో పెగ్గీ విట్సన్ నాకు మార్గదర్శి, స్ఫూర్తిప్రదాత. ఈ గురువారం (ఫిబ్రవరి 7) భూమి మీదకు అడుగు పెట్టిన తరువాత అందరూ నన్ను అభినందిస్తూ ఉంటే నోట మాట రావడం లేదు. ఇన్నాళ్ళూ భూమిని మిస్ అయినందుకు బెంగగా ఉంటే, ఇప్పుడు అంతరిక్షాన్ని మిస్ అయినందుకు వెలితిగా అనిపిస్తోంది."

### ఇదీ రికార్డు

అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి మహిళగా సోవియట్ యూనియన్‌కు చెందిన వాలెంటినా తెరెష్కోవా (1963) చరిత్రకు ఎక్కారు. ఒకే విడతలో అంతరిక్షంలో ఎక్కువకాలం గడిపిన వ్యోమగామిగా పెగ్గీ విట్సన్ (288) 2017లో నెలకొల్పిన రికార్డును 41 ఏళ్ళ క్రిస్టినా కోచ్ (328) అధిగమించారు. హైకింగ్, రాక్ క్లైంబింగ్, పెడలింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ క్రిస్టినా హాబీలు.

---

ఆహారం- ఆరోగ్యం

## కేన్సర్ రాకుండా చూసుకోవచ్చా?

కేన్సర్ వ్యాధి ఈ మధ్య బాగా పెరిగింది. ఈ వ్యాధికి చికిత్స తీసుకుంటున్నా చాలామందిలో భయం ఉంటోంది. చికిత్స సమయంలో ఎలాంటి డైట్ తీసుకోవాలి. కేన్సర్ రాకుండా జాగ్రత్త పడే అవకాశం ఉందా?

**- తరుణి,** హైదరాబాద్

ఏటా ఫిబ్రవరి 4న 'కేన్సర్ డే' నిర్వహిస్తారు. దీని ముఖ్య ఉద్దేశం కేన్సర్ వ్యాధిపై ఉన్న అపోహలు తొలగించి, అవగాహన పెంచడం. కేన్సర్ ఒక భయంకరమైన జబ్బు అని, దాని నుంచి బయట పడడం అసాధ్యం అన్న అపోహ తొలగిపోవాలని 'కేన్సర్ డే' జరుపుతారు. ప్రతి నాలుగేళ్లకి ఒక థీమ్ ఉంటుంది దాని బట్టి హాస్పిటల్స్, డైటీషియన్స్, సోషల్ కేర్ గ్రూప్స్ పలురకాల కార్యక్రమాలు చేస్తుంటాయి. ఈ ఏడాది థీమ్ "ఐయామ్ అండ్ ఐ విల్". దీని ముఖ్య



ఉద్దేశం కేన్సర్ వచ్చిన వారిలో ధైర్యాన్ని నింపడం. తద్వారా కేన్సర్ చికిత్స సవ్యంగా సాగుతుంది. త్వరగా కోలుకుంటారు కూడా. అవగాహనా ఉండటం వల్ల, బాధను తట్టుకోవడం, చికిత్సకు సహకరించడం జరగుతుంది. అనుకున్న టైమ్‌కు చికిత్స పూర్తయి, కోలుకునే అవకాశం ఉంటుంది. అవగాహన వల్ల ఎంతో మంది కేన్సర్ నుంచి బయటపడి సాధారణ జీవితం గడుపుతున్నారు.

కేన్సర్ అంటు వ్యాధి కాదు. అయితే జీన్స్ వల్ల వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. జీన్స్ ట్రిగ్గర్ అయినప్పుడే కేన్సర్ పుడుతుంది. ట్రిగ్గరింగ్ ఫ్యాక్టర్స్‌లో మనం కంట్రోల్ చేసుకునేవి కొన్ని, మన కంట్రోల్‌లో లేనివి కొన్ని ఉంటాయి.

కేన్సర్ చికిత్స సమయంలో తీసుకోవాల్సిన ఆహార నియమాలు

- హై ఎనర్జీ, హై ప్రోటీన్ అవసరం ఉంటుంది. కేన్సర్ రకం, చికిత్సన బట్టి డైట్ ప్లాన్ ఎంపిక చేసుకోవాలి. నిపుణుల సలహాలు తీసుకోవాలి.
- కీమో, రేడియో థెరపీలు జరుగుతున్నపుడు ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకోవాలి. గంజి నీళ్ళు అన్నిటికన్నా శ్రేష్ఠం. పండ్లరసాలు, సూప్స్, కొబ్బరి నీళ్లు, మజ్జిగ బాగా ఎంతో ఉపయోగపడతాయి.
- ఎక్కువ ఘాటు, కారం, మసాలా, పులుపు పడకపోవచ్చు. కాబట్టి బాగా తగ్గించాలి.
- విశ్రాంతి కోసం ప్రశాంత వాతావరణంలో గడపాలి.
- గొంతులో మంట, వాంతులు, చర్మం పొడిబారడం, ఆకలి లేకపోవడం, జుట్టు రాలి పోవడం చాలా సాధారణం. అవగాహనతో వాటిని యాక్సెప్ట్ చేసి తగిన జీవనవిధానం అలవాటు చేసుకోవాలి.

**నివారణ :**

- కేన్సర్ ఎందుకు వస్తుందో ఎవరికీ తెలియదు. రాకుండా ఉండటానికి మన వంతు ప్రయత్నం మనం చేయాలి.
- ప్రశాంత జీవనం గడపాలి. సమయానికి భోజనం చేయాలి. అలాగే వేళకు నిద్రపోవాలి. మలబద్ధకం సమస్య లేకుండా చూసుకోవాలి.
- ఒత్తిడి తగ్గించుకోవాలి. ప్రతి చిన్న విషయాన్ని బూతద్దంలో చూడటం మానేయాలి.
- సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తినాలి. ఆర్గానిక్ ఫుడ్ తీసుకుంటే మరీ మంచిది.
- వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.



● **డాక్టర్ బి.జానకి,** న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

---

వంటిల్లు

నాన్‌వెజ్ ప్రియులను పచ్చళ్లు తినమంటే పెదవి విరుస్తారు. అదే నాన్‌వెజ్‌ను పచ్చడి చేస్తే... నోట్లో నీళ్లు ఊరక మానదు. నాన్‌వెజ్ కూరలు, వేపుళ్లు, టిక్కాలు, కబాబ్‌లు... ఇలా ఎన్ని ఉన్నా, వాటితో చేసే పచ్చళ్ల రుచి పసందుగా ఉంటుందనడంలో సందేహం లేదు. చికెన్, మటన్, చేపలు, రొయ్యలు... వీటన్నింటితో కూడా మామిడి, నిమ్మ, ఉసిరి ఊరగాయాల్లాగే చేయొచ్చు. ఎక్కువ కాలం నిల్వ ఉండే ఈ పచ్చళ్లను అందరూ ఇష్టపడుతున్నారు. విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్లో రేటు ఎక్కువగా ఉండే ఈ నాన్‌వెజ్ పచ్చళ్లను ఎంచక్కా ఇంట్లోనే తయారుచేసుకొని ఇంటిల్లిపాది ఆస్వాదించొచ్చు.



### చికెన్ పచ్చడి

**కావలసినవి**

చికెన్ - పావుకేజీ, వెనిగర్ - రెండు టేబుల్‌స్పూన్లు, మెంతి పొడి - ఒక టేబుల్‌స్పూన్, కారం - ఒక కప్పు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగైదు, నూనె - తగినంత, పసుపు - రెండు టీస్పూన్లు, నిమ్మరసం - ఒక కప్పు, ఆవాలు - రెండు టీస్పూన్లు, ఆవాల పొడి - రెండు టీస్పూన్లు.

**తయారీ**

- చికెన్‌ను శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి.
- పాన్‌లో చికెన్ తీసుకుని వెనిగర్, నీళ్లు పోసి ఉడికించాలి. తరువాత ఆ చికెన్ ముక్కలను తీసి పక్కన పెట్టాలి.
- అదే పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక చికెన్ ముక్కలు వేసి డీప్ ఫ్రై చేసుకుని పక్కన పెట్టుకోవాలి.
- ఒక పాత్రలో మెంతిపొడి, ఆవాల పొడి, పసుపు, కారం, ఉప్పు, నిమ్మరసం వేసి కలిపి పక్కన పెట్టాలి.
- మరొక పాన్‌లో నూనె వేసి వేడి అయ్యాక ఆవాలు వేయాలి. తరువాత చికెన్ ముక్కలు వేయాలి. మెంతిపొడి మిశ్రమం వేయాలి. బాగా కలిపి కాసేపు చిన్నమంటపై ఉంచి దించి, తరువాత సర్వ్ చేసుకుంటే టేస్టీగా ఉంటుంది.

# నాన్‌వెజ్... పచ్చడి కావాల్సిందే!

### చేపలతో...

**కావలసినవి**

చేపలు - అరకేజీ, పసుపు - చిటికెడు, నువ్వుల నూనె - తగినంత, ఉప్పు - రుచికి సరిపడా.

**మసాలా కోసం :** ఎండుమిర్చి - 50గ్రాములు, పసుపు - పావుటీస్పూన్, జీలకర్ర - ఒక టేబుల్‌స్పూన్, ఎండుద్రాక్ష - 100గ్రాములు, గసగసాలు - రెండు టేబుల్‌స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు - రెండు, అల్లం ముక్క - కొద్దిగా, పచ్చిమిర్చి - నాలుగైదు, చింతపండు - కొద్దిగా, పంచదార - ఒక టేబుల్‌స్పూన్, ఆవాలు - రెండు టేబుల్‌స్పూన్లు.



**తయారీ**

- ముందుగా చేపలను కట్ చేసుకుని శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి.
- తరువాత చేప ముక్కలకు పసుపు, ఉప్పు పట్టించాలి.
- పాన్‌లో నూనె వేసి ఆ చేప ముక్కలు వేసి వేగించాలి.
- మిక్సీలో ఎండుమిర్చి, జీలకర్ర, పసుపు, ఎండుద్రాక్ష, గసగసాలు వేసి మసాలా పేస్టు సిద్ధం చేసుకోవాలి.
- చిన్న పాత్రలో కొన్ని నీళ్లు పోసి చింతపండు నానబెట్టాలి.
- అల్లం వెల్లుల్లిని పేస్టు చేసుకోవాలి.
- పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక అల్లం వెల్లుల్లి పేస్టు వేయాలి.
- కాసేపు వేగిన తరువాత మసాలా పేస్టు వేసి కలపాలి.
- ఇప్పుడు చింతపండు నీళ్లు పోసి, ఉప్పు, పంచదార వేసి కాసేపు ఉడికించాలి.
- పచ్చిమిర్చి, ఆవాలు వేయాలి. చిన్నమంటపై పదినిమిషాలు ఉడికించాలి.
- ఇప్పుడు వేగించి పెట్టుకున్న చేప ముక్కలు వేసి కలపి వేడి వేడిగా సర్వ్ చేసుకోవాలి.



### మటన్‌తో...

**కావలసినవి**

బోన్‌లెస్ మటన్ - అరకేజీ, ఉప్పు - తగినంత, పసుపు - ఒక టేబుల్‌స్పూన్, అల్లంవెల్లుల్లి పేస్టు - రెండు టేబుల్‌స్పూన్లు, నీళ్లు - అరకప్పు, మెంతులు - అర టీస్పూన్, జీలకర్ర - అర టీస్పూన్, ధనియాలు - అర టీస్పూన్, కారం - రెండు టేబుల్‌స్పూన్లు, నూనె - సరిపడా, నిమ్మరసం - పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగైదు.

**తయారీ**

- ముందుగా మెంతులు, జీలకర్ర, ధనియాలు వేసి వేగించుకుని, మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- మటన్‌ను శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి.
- ఒకపాత్రలో మటన్ వేసి, ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి, అర కప్పు నీళ్లు పోసి ఉడికించాలి.
- నీళ్లు పూర్తిగా పోయే వరకు ఉడికించాలి.
- తరువాత అందులోనే కొద్దిగా నూనె వేసి మటన్ ముక్కలు ఫ్రై కానివ్వాలి.
- కారం వేసి కలపాలి. పొడి చేసి పెట్టుకున్న మసాలా వేయాలి.
- నిమ్మరసం వేసి మరికాసేపు ఉడికించాలి.
- నూనె తేలే వరకు ఉడికించి దించాలి.
- మటన్ పచ్చడి అన్నం, చపాతీలోకి రుచిగా ఉంటుంది.



### రొయ్యలతో...

**కావలసినవి**

రొయ్యలు(చిన్నవి) - పావుకేజీ, ఉప్పు - తగినంత, పసుపు - ఒక టీస్పూన్, కారం - ఒక టేబుల్‌స్పూన్, నూనె - సరిపడా, అల్లం వెల్లుల్లి - 120 గ్రాములు, పచ్చిమిర్చి - ఇరవై, వెనిగర్ - అరకప్పు.

**తయారీ**

- ముందుగా రొయ్యలను శుభ్రం చేసుకొని ఉప్పు, పసుపు పట్టించి అరగంటపాటు పక్కన పెట్టాలి.
- పాన్‌లో నూనె పోసి కాస్త వేడి అయ్యాక రొయ్యలు వేసి వేగించాలి.
- కారం వేసి చిన్నమంటపై ఐదు నిమిషాల పాటు వేగించి పక్కన పెట్టుకోవాలి.
- మరొకపాన్‌లో నూనె వేసి అల్లంవెల్లుల్లి పేస్టు వేసి వేగించాలి.
- పచ్చిమిర్చి కూడా వేసి మరికాసేపు వేగనివ్వాలి.
- తరువాత రొయ్యలు, వెనిగర్, కొన్ని నీళ్లు పోసి ఉడికించాలి.
- వెనిగర్ ఒకేసారి మొత్తం వేయకుండా ముందుగా పావు కప్పు వేయాలి. ఒకవేళ అవసరమనుకుంటే మరికాస్త వేయాలి.
- చిన్నమంటపై ఐదు నిమిషాల ఉడికించాలి.
- రొయ్యల ఉడికిన తరువాత నూనె పైకి తేలుతుంది.
- ఇప్పుడు స్టవ్ ఆర్పేసి, దించాలి. చల్లారిన తరువాత జాడీలో భద్రపరచుకోవాలి.
- ఫ్రిజ్‌లో పెట్టుకుంటే నెలరోజుల పాటు పాడవకుండా ఉంటుంది.

---

గుడ్‌ఫుడ్

## తేగలతో బరువు తగ్గొచ్చు!

వేసవి వస్తోందంటే చాలు తాటి ముంజలతో పాటు తాటి తేగలు గుర్తుకొస్తాయి. తోపుడు బండ్ల మీద, రోడ్డు పక్కన చిరువ్యాపారుల బుట్టల్లో వీటిని చూడగానే నోరూరుతుంది వీటిని తాటి గేగులు అని పిలుస్తారు కూడా. పీచు, పిండి పదార్థాలతో నిండిన ఇవి ఆరోగ్యానికి అన్నివిధాలా మంచివి. తక్కువ ధరకే లభించే వీటిని తీసుకుంటే కలిగే లాభాలివి...

- పీచుపదార్థం మెండుగా ఉన్నందున తేగలు తింటే జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేస్తుంది. ముఖ్యంగా గర్భిణులు వీటిని తింటే జీర్ణ పరమైన ఇబ్బందులు తొలగుతాయి.
- వీటిలోని ఫోలేట్, విటమిన్లు, ఐరన్, జింక్, కాల్షియం, మెగ్నీషియం వంటి లవణాలు శరీరానికి పోషణనిస్తాయి.
- క్యాలరీలతో పాటు కొవ్వు, కొలెస్ట్రాల్ కూడా తక్కువగా ఉండే ఇవి ఎంతో ఆరోగ్యదాయకం.
- తేగలు తింటే కడుపు నిండినట్టుగా



అనిపిస్తుంది. తొందరగా ఆకలివేయదు. బరువు తగ్గాలనుకునే వారి వీటిని డైట్‌లో చేర్చుకుంటే ఫలితం ఉంటుంది.

- వీటిలోని ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు మధుమేహం, గుండె సంబంధ జబ్బుల ముప్పును చాలా వరకు తగ్గిస్తాయి.
- తేగల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. వీటిని తింటే ఇన్సులిన్ ఉత్పత్తి పెరిగి మధుమేహం సమస్య తగ్గుతుంది.




వినోదాల వీచిక... నైపుణ్యానికి వేదిక... యూట్యూబ్. భారత్‌లో 460 మిలియన్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులుంటే... అందులో 260 మిలియన్ల మందికి పైగా యూట్యూబ్‌ను వీక్షిస్తున్నారు. అన్నింటికీ మించి నాలుగేళ్లుగా యూట్యూబ్‌లో తెలుగు వారి హవా ఓ రేంజ్‌లో పెరిగిందట! తెలుగులో ఉన్నంత వైవిధ్యం, సమతూకం మరెందులో లేకపోవడమే దీనికి కారణమంటారు 'యూట్యూబ్ ఇండియా' కంటెంట్ పార్ట్‌నర్‌షిప్ డైరెక్టర్ సత్యరాఘవేంద్ర...

# మనోళ్లు దుమ్ములేపుతున్నారు

ప్రపంచంలో అత్యధికంగా ఇంటర్నెట్ ఉపయోగించే దేశాల్లో భారత్‌ది రెండో స్థానం. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు, తక్కువ మొత్తానికే మొబైల్ డేటా అందుబాటులోకి వచ్చాక ఇంటర్నెట్ వినియోగం విపరీతంగా పెరిగింది. యూట్యూబ్‌లో ఆన్‌లైన్ వీడియోలు చూసేవారిలో 75 శాతం మొబైల్ నుంచేనన్నది నమ్మలేని నిజం. గృహిణులకు వంటలు, కుర్రకారుకు లేటెస్ట్ అప్‌డేట్స్, ఎవరైనా మెచ్చే ఎంటర్‌టైన్‌మెంట్... అది ఇది అని తేడా లేకుండా ఏ వయసు వారికి ఏది కావాలంటే అది ఒక్క క్లిక్‌లో చూసే వెసులుబాటు యూట్యూబ్ కల్పించింది. సాధారణంగా ఆన్‌లైన్ అనగానే కంటెంట్ అధిక భాగం ఇంగ్లీష్‌లో ఉంటుందనుకుంటాం. కానీ మనవాళ్లు వీక్షించే ఆన్‌లైన్ వీడియోల్లో 95 శాతం భారతీయ భాషల్లోనివే!

## గ్రామీణ భారతం...

2014 ముందు వరకు సాంప్రదాయ ఛానల్స్ మాత్రమే ఉండేవి. అయితే ఆ తరువాత నుంచి విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ఎక్కువగా ముంబయ్, ఢిల్లీ వంటి మహానగరాల నుంచే కంటెంట్ ప్రొవైడర్లు ఉండేవారు. ఇప్పుడు ఆ ట్రెండ్ మారింది. అత్యధిక కంటెంట్ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తోంది. యూట్యూబ్ 'వాచ్ టైమ్'లో 60 శాతం... ఆరు ప్రధాన మెట్రో నగరాల వెలుపలే! 2022 నాటికి భారతీయ భాషల కంటెంట్‌ను బ్రౌజ్ చేసే ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 536 మిలియన్లకు చేరుతుందని అంచనా. దేశ జనాభాలో ఇంగ్లీష్ భాషతో పరిచయం గలవారు 20 శాతం కన్నా తక్కువ. ఈ లెక్కన రాబోయే రోజుల్లో ఆన్‌లైన్‌లో ప్రాంతీయ భాషల హవానే కొనసాగుతుందనడంలో సందేహం లేదనేది సత్యరాఘవేంద్ర అంచనా.

## తెలుగు జిలుగు...

ఇతర దేశాలతో పోలిస్తే యూట్యూబ్ చూసేవారి సంఖ్య భారత్‌లో అత్యంత వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం సగటున నెలకు 265 మిలియన్ల మంది వీడియోలు బ్రౌజ్ చేస్తున్నారు. ఐదేళ్ల కిందట పది లక్షలకు మించి సబ్‌స్క్రైబర్స్ గల కంటెంట్ క్రియేటర్లు భారత్‌లో ఇద్దరే ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య 1,200 మందికి చేరింది. హాస్యం, క్రీడలు, వార్తలు, విద్య, అందం, ఆరోగ్యం, వెబ్‌సిరీస్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంది. రోజు రోజుకూ వీటి వీక్షకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఉత్తర భారత దేశంతో పోలిస్తే దక్షిణ భారత్‌లో కంటెంట్ క్రియేటర్లు అధికమయ్యారు. నాలుగైదేళ్ల కిందటి పరిస్థితికి ఇప్పుడు పూర్తి భిన్నం. ఈ కాలంలో తెలుగు భాషలో వీడియోలు 60 శాతం పెరిగాయంటే... వాటికి ఏ స్థాయిలో ఆదరణ వస్తుందో అర్థమవుతుంది. ఇతర భాషలతో పోలిస్తే తెలుగులో కంటెంట్ వైవిధ్యంగానూ, అదే సమయంలో సమతూకంగా కూడా ఉంటుంది. ఎలాగంటే ఒకవైపు టీవీ, సినిమా ఛానల్స్... మరోవైపు 'మహాతల్లి', 'వైవా', 'మై విలేజ్ షో' తదితర సాధారణ ప్రజలు నిర్వహిస్తున్న వీడియోలు కనిపిస్తాయి.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే యూట్యూబ్‌లో మొదట వచ్చిన తెలుగు కంటెంట్ అత్యధికంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోని గ్రామీణ ప్రాంతాలవారు అప్‌లోడ్ చేసింది. ఇందులో చిన్న... పెద్ద తేడా లేదు. అన్ని వయసులవారూ ఉన్నారు. మహిళా కంటెంట్ క్రియేటర్ల సంఖ్య కూడా అనూహ్యంగా పెరగడం మరో ఆసక్తికర పరిణామం. అదే సమయంలో చాలామంది యువకులు, గృహిణులు వీటి ద్వారా ఉపాధి పొందుతున్నారు. కొందరైతే యూట్యూబ్‌ను ప్రధాన సంపాదన మార్గంగా మలుచుకున్నారు.

● హనుమా

### తెలుగులో టాప్ 10 ఛానల్స్ (సబ్‌స్క్రైబర్స్ మిలియన్లలో)

| ఛానల్ | అంశం |
|---|---|
| గ్రాండ్‌పా కిచెన్ | పల్లెటూరి రుచులు |
| కంట్రీ ఫుడ్స్ | పల్లెటూరి రుచులు |
| మహాతల్లి | వినోదం |
| వైవా | వినోదం |
| ఈజీ రంగోలీ | అభిరుచులు |
| తెలుగు టెక్‌ట్యూట్స్ | టెక్నాలజీ |
| మై విలేజ్ షో | గ్రామీణ జీవితం |
| మైనా స్ట్రీట్ ఫుడ్ | పల్లెటూరి రుచులు |
| ప్రియా వంటలు | ఆహారం |
| క్రియేటివ్ థింక్స్ | పల్లెటూరి జీవితం |

### ఐదు నుంచి పది లక్షలు...



"తెలుగులో ఇప్పుడు 80కి పైగా ఛానల్స్‌కు ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. 785కి పైగా ఛానల్స్‌కు లక్ష మంది, 80 ఛానల్స్‌కు పది లక్షల ప్లస్ ఖాతాదారులున్నారు. తెలుగులో కంటెంట్ క్రియేటర్లు ఎంత వేగంగా పెరుగుతున్నారో ఈ లెక్కలు చెబుతాయి. సమీప భవిష్యత్‌లో యూట్యూబ్ వీక్షకుల సంఖ్య దీనికి రెట్టింపయ్యే అవకాశం ఉంది" - సత్యరాఘవేంద్ర

**టెక్ సందేహాలు**

## ఆ యాప్‌లో ఎందుకలా?

**ఐఆర్‌సీటీసీ అప్లికేషన్ వల్ల నాకు చాలా ఇబ్బంది అవుతోంది. లాగిన్ అయ్యాక ఓపెన్ అవ్వదు. వాలిడేటింగ్ అంటూ అలాగే ఉండిపోతుంది. లేదంటే వైట్ స్క్రీన్ వచ్చి మళ్లీ అప్లికేషన్ వచ్చేస్తుంది. ఎలా సాల్వ్ చేసుకోవాలో చెప్పండి?**

**- డా. ప్రసాద్**




ఐఆర్‌సీటీసీ అప్లికేషన్ సర్వర్ మీద ఎక్కువగా లోడ్ ఉన్నప్పుడు మీరు ఎంటర్ చేసిన క్రెడెన్షియల్స్‌ని సర్వర్‌లో వాలిడేట్ చేసుకునే సమయంలో ఇలాంటి ఇబ్బంది ఏర్పడుతుంది. ముఖ్యంగా తత్కాల్ టికెట్ బుక్ చేసేటప్పుడు ఈ సమస్యను చాలామంది ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం ఐఆర్‌సీటీసీ సంస్థ సర్వర్ సామర్థ్యాన్ని పెంచింది. అయినప్పటికీ ఎక్కువ లోడ్‌ను హ్యాండిల్ చేసే విషయంలో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అయితే సర్వర్ పరంగా ఉండే సాంకేతికమైన ఇబ్బందులకు మీరు చేయగలిగింది ఏమీ లేదు. ఆ సంస్థ ఇలాంటి ఇబ్బందులపై దృష్టి పెట్టాలి.

## ఫేస్‌బుక్‌లో ఆ అవకాశం ఉందా?

**ఫేస్‌బుక్‌లో మనల్ని ఎవరు అన్‌ఫ్రెండ్ చేశారో తెలుసుకునే అవకాశం ఉంటుందా?**

**- వైశాలి**




ఫేస్‌బుక్ అధికారికంగా అలాంటి సదుపాయం అందించడం లేదు. అయితే గూగుల్ ప్లే స్టోర్‌లో దీనికోసం కొన్ని అప్లికేషన్స్ లభిస్తున్నాయి. గూగుల్ క్రోమ్ వెబ్ బ్రౌజర్ వాడుతున్న వారి కోసం కొన్ని ఎక్స్‌టెన్షన్ కూడా లభిస్తున్నాయి. అయితే ఇవన్నీ కూడా మీ ఫ్రెండ్ లిస్టు మొత్తాన్ని తెలుసుకునేందుకు అనుమతి తీసుకొని, దానిని ఎప్పటికప్పుడు బ్యాక్‌గ్రౌండ్‌లో విశ్లేషించడం ద్వారా ఎవరైనా మిమ్మల్ని అన్‌ఫ్రెండ్ చేస్తే ఆ విషయాన్ని మీకు నోటిఫై చేయడానికి ప్రయత్నిస్తాయి. ఇలాంటి అప్లికేషన్లు మీ ప్రైవసీకి భంగం కలిగిస్తాయి. కాబట్టి వాటికి వీలైనంత వరకు దూరంగా ఉండడమే మంచిది.

## వైరస్ ఉన్నట్లు చూపిస్తోంది... ఎందుకని?

**నా కంప్యూటర్‌లో ఉన్న ఒక జెన్యూన్ అప్లికేషన్‌లో వైరస్ ఉన్నట్లు చూపిస్తోంది. దీనికి కారణం ఏంటి?**

**- రాజేంద్రకుమార్**

అనేక యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్లు ఫాల్స్ పాజిటివ్స్ చూపిస్తుంటాయి. మన కంప్యూటర్లో ఉన్న అన్ని ఫైళ్లకి సంబంధించిన హెడర్‌ని విశ్లేషించడం ద్వారా, ఆయా ఫైళ్లు కంప్యూటర్‌లో చేసే పనులను పరిశీలించటం ద్వారా నిజంగానే అవి మాల్‌వేర్ ఉన్న ఫైళ్లు కాకపోయినప్పటికీ తప్పుడు ఫలితాలను చూపించే ప్రమాదం ఉంటుంది. కాబట్టి యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్లు చూపించే వైరల్ అలర్ట్‌లను ఎల్లప్పుడూ నమ్మాల్సిన అవసరం లేదు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం: navya@andhrajyothy.com

**టెక్ గురు**





# టెక్నాలజీకి కరోనా ముప్పు!

*యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ టెక్నాలజీ రంగం మీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తికి ప్రధాన కేంద్రమైన చైనాలో ఈ వైరస్ విజృంభిస్తుండడంతో స్మార్ట్‌ఫోన్ల నుంచి అనేక ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకాలపైన ప్రభావం పడుతోంది. అదే సమయంలో కరోనా వైరస్ గురించి జాగ్రత్తల పేరుతో ఫిషింగ్ దాడులు మొదలయ్యాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా డేటా మొత్తం హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.*

స్మార్ట్‌ఫోన్లు, ఇతర డివైజ్‌లలో స్టోరేజ్ కోసం నాండ్ మెమరీ చిప్‌లను ఉపయోగిస్తుంటారు. వీటి తయారీలో శాంసంగ్, హైనిక్స్ వంటి సంస్థలదే ఎక్కువ మార్కెట్ వాటా. ఆయా స్టోరేజ్ చిప్‌ల ఉత్పత్తి కేంద్రాలు చైనాలో ఉన్నాయి. కరోనా వైరస్ విస్తరించిన వూహాన్ నగరానికి అవి కేవలం 800 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీనివల్ల కొన్ని నెలలపాటు స్టోరేజ్ డివైజ్‌లు, స్మార్ట్‌ఫోన్ల ధరలపై ప్రభావం ఉంటుందని ప్రముఖ మార్కెట్ పరిశోధనా సంస్థ ట్రెండ్ ఫోర్స్ భావిస్తోంది. మెమరీ కార్డులు, హార్డ్ డిస్కులు, ఇతర స్టోరేజ్ డివైజ్‌ల ధరలపై కూడా ప్రభావం ఉండబోతోంది. కొన్నిచోట్ల మెకానికల్‌గా ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, రవాణా ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడం కూడా ఇబ్బందికరంగా మారింది. మరోవైపు యాపిల్ ఐఫోన్‌లను చైనాలో తయారుచేసే ఫాక్స్‌కాన్ సంస్థ రెండు వారాలపాటు అక్కడ పనిచేసే ఉద్యోగులను క్వారంటైన్ చేయటం వల్ల కూడా యాపిల్ ఐఫోన్‌ల తయారీ బాగా తగ్గనుంది.

> కరోనా వైరస్ తాజా సమాచారం తెలుసుకోవాలంటే ఈ లింక్‌ని క్లిక్ చేయండి అంటూ కొంతమంది వాట్సాప్‌లో కొన్ని లింకులను షేర్ చేస్తున్నారు. వాటిని క్లిక్ చేస్తే బాధితుల వ్యక్తిగత సమాచారం తస్కరణకు గురవుతోంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో అలాంటి లింక్‌లను క్లిక్ చేయకండి, ఇతరులకు షేర్ చేయకండి. యూట్యూబ్‌లో కూడా హైదరాబాద్, వరంగల్, విజయవాడ, వైజాగ్ వంటి నగరాల్లో కరోనా వైరస్ కేసులు నమోదయ్యాయని జనాలను భయపెట్టే విధంగా కొందరు వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఆరోగ్యశాఖ, అధికారులు అధికారికంగా ప్రకటన చేసేంత వరకు ఇలాంటి వదంతులను ఎట్టి పరిస్థితిల్లోనూ నమ్మకండి.

### ఫిషింగ్ దాడులు

కరోనా వైరస్ గురించి ప్రజల్లో నెలకొన్న ఆందోళనను సొమ్ము చేసుకునేందుకు పలురకాల ఫిషింగ్ ఇ-మెయిల్స్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఇన్ బాక్స్‌లకు వస్తున్నాయి. కరోనా వైరస్ గురించి కొన్ని జాగ్రత్తలు అంటూ ఒక మైక్రోసాఫ్ట్ వర్డ్ డాక్యుమెంట్‌ని అటాచ్ చేసి పంపిస్తున్నారు. దాన్ని డౌన్‌లోడ్ చేసి ఓపెన్ చేస్తే, అందులో రహస్యంగా ఒక మాక్రో దాగి ఉండి కంప్యూటర్‌ని ఇన్‌ఫెక్ట్ చేస్తుంది. ఆ తర్వాత కంప్యూటర్‌లో ఉండే సమాచారం మొత్తం హ్యాకర్‌కి చేరవేయడంతో పాటు, ఎల్లప్పుడూ కమాండ్ కంట్రోల్ సర్వర్‌కి కనెక్ట్ అయి మన కంప్యూటర్‌ను పూర్తిగా కంట్రోల్‌లోకి తీసుకునే ప్రమాదం ఉంది. ఫిషింగ్ లింకులను క్లిక్ చేస్తే యూజర్లకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని డేటా మైనింగ్ చేసే వీలుంది. కరోనా వైరస్ పేరిట ఒక ఎగ్జిక్యూటబుల్ ఫైల్ కూడా సర్క్యులేట్ అవుతోంది. దీన్ని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకున్న యూజర్లకు ఎమోటెంట్ అనే ట్రోజాన్ కంప్యూటర్‌లోకి వస్తోంది.

### ఫోన్లకి అతుక్కుపోతున్నారు

గత నెల రోజులుగా చైనాలో అధిక శాతం మంది టిక్‌టాక్ వంటి షార్ట్ వీడియో అప్లికేషన్లు చూస్తూ, గేమ్స్ ఆడుతూ ఇంట్లోనే సమయం గడుపుతున్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. ప్రజలు గ్యాడ్జెట్స్‌తో గడుపుతున్నట్లు నిరూపితమైంది. కచ్చితంగా టెక్నాలజీ రాకముందు ఇలాంటి ఉపద్రవం వచ్చినప్పుడు ఉన్న పరిస్థితులకు, ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉందనే చెప్పాలి. చైనా మాత్రమే కాదు, ఇండియాలో కూడా ఇటీవల కొన్ని రోజులుగా ఎలాంటి అవసరం లేకపోతే ప్రజలు బయటకు వెళ్లడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. అధిక సమయం గ్యాడ్జెట్స్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్‌లో వీడియోలు చూస్తూ గడుపుతున్నారు.

### మెషిన్ లెర్నింగ్‌కి పని!

మరోవైపు మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ ఆధారంగా కరోనా వైరస్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతమందికి విస్తరించే అవకాశం ఉందో అంచనా వేస్తున్నారు. ఈ వైరస్ ఎలా విస్తరిస్తోందో తెలుసుకునేందుకు భారీ మొత్తంలో డేటా సెట్స్ ఆధారంగా విశ్లేషించే ప్రయత్నాలు చేస్తున్నారు. టెక్నాలజీ సాయంతో ప్రజలను అప్రమత్తం చేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం చాలా ఉంది.

### మాస్క్‌ల తప్పుడు ప్రచారం నమ్మొద్దు


వాట్సాప్‌లో గత కొన్ని రోజులుగా 'కరోనా వైరస్ నుంచి రక్షణ పొందాలంటే, ఎన్ 95 మాస్కులను ఇలా వాడాలి' అంటూ ఒక వార్త సర్క్యులేట్ అవుతోంది. 'అసలు డాక్టర్లకు కూడా మాస్క్ ఎలా ధరించాలో తెలియదు' అని ఉన్న ఈ తప్పుడు సమాచారం యూజర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. వ్యాధి సోకిన వ్యక్తులు అది ఇతరులకు విస్తరించకుండా ఉండాలంటే మాస్క్ లోపలి భాగం బయటకు కనిపించే విధంగా ధరించాలని, అయితే వ్యాధి సోకని వ్యక్తులు ఎప్పటిలాగే మాస్కుని కలర్ భాగం లోపలికి ఉండే విధంగా ధరించాలని ఆ ఫేక్ మెసేజ్ చెబుతోంది. ఇది పూర్తిగా అవాస్తవం. సహజంగా మార్కెట్లో దొరికే ఎన్95 మాస్క్‌లో ఒక ఫిల్టర్ ఉంటుంది. అయితే లోపలి భాగం బయటకు కనిపించేలా ధరించడం వల్ల ముక్కు చుట్టూ ఖాళీ ఏర్పడి వైరస్ విస్తరించే ప్రమాదం ఉంది.





నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

**చుక్కలు కలిపి రంగులు వేయండి**



**ఏది భిన్నం?**



**ఫన్**

**5 తేడాలు గుర్తించండి**



**పట్టికలో పదాలు గుర్తించండి**

letter S

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| S | S | A | G | S | A | W | T | O | R | P |
| T | G | S | H | R | A | K | I | S | H | S |
| R | J | E | T | S | R | S | C | U | E | T |
| A | I | A | A | H | K | P | T | B | A | R |
| W | N | H | A | O | L | O | K | M | R | I |
| B | A | O | P | R | E | O | R | A | E | N |
| E | S | R | W | T | C | N | A | R | E | G |
| R | T | S | H | S | K | E | U | I | T | S |
| R | I | E | S | R | A | C | C | N | O | N |
| Y | I | O | L | E | N | G | I | E | H | E |
| N | E | S | N | O | W | P | J | A | I | N |




### డైలీ సుడోకు -273

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | | | | 5 | | | | |
| | 7 | | | 9 | | 2 | | |
| 9 | | 1 | | | 6 | | | |
| | | | 8 | | 5 | | 1 | |
| 1 | | 7 | | | | 3 | | 2 |
| | 2 | | 7 | | 1 | | | |
| | | | 6 | | | 9 | | 4 |
| | | 9 | | 7 | | | 5 | |
| | | | | 4 | | | | 1 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 272 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 1 | 3 | 7 | 5 | 8 | 6 | 4 | 2 |
| 8 | 4 | 2 | 3 | 1 | 6 | 9 | 7 | 5 |
| 7 | 5 | 6 | 4 | 2 | 9 | 1 | 3 | 8 |
| 6 | 8 | 9 | 5 | 3 | 4 | 7 | 2 | 1 |
| 1 | 3 | 7 | 8 | 9 | 2 | 4 | 5 | 6 |
| 4 | 2 | 5 | 1 | 6 | 7 | 8 | 9 | 3 |
| 3 | 6 | 1 | 9 | 7 | 5 | 2 | 8 | 4 |
| 5 | 9 | 8 | 2 | 4 | 1 | 3 | 6 | 7 |
| 2 | 7 | 4 | 6 | 8 | 3 | 5 | 1 | 9 |


అజయ్ దేవగణ్, రాజమౌళి

# ఫ్రీగా చేస్తున్నారట!

'**ఆర్**ఆర్ఆర్'లో హిందీ హీరో అజయ్ దేవగణ్ అతిథి పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల వికారాబాద్ అడవుల్లో ఆయన పాల్గొనగా... ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. హిందీ చిత్రసీమ సమాచారం ప్రకారం... ఈ సినిమాకు అజయ్ దేవగణ్ డబ్బులు తీసుకోవడం లేదట! దర్శకుడు రాజమౌళితో స్నేహం కారణంగా ఫ్రీగా చేస్తున్నారట! 'ఈగ' హిందీ వెర్షన్‌కు ఆయన వాయిస్ ఓవర్ ఇచ్చారు. అప్పట్నుంచి రాజమౌళి, అజయ్ దేవగణ్ మధ్య మంచి స్నేహం ఉంది. అందుకని, 'ఆర్ఆర్ఆర్'లో అతిథి పాత్ర చేయమని అడగ్గానే అంగీకరించారు. హిందీలో అజయ్ దేవగణ్‌కు మంచి మార్కెట్ ఉంది. అందుకు తగ్గట్టు నిర్మాత డీవీవీ దానయ్య పారితోషికం ఇవ్వబోగా... సున్నితంగా తిరస్కరించారట. తెలుగులో అజయ్ దేవగణ్ నటిస్తున్న తొలి చిత్రమిది. ఆయనకు జోడీగా శ్రియ కనిపించనున్నారు. చిన్న ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా... ఒలీవియా మోరిస్, అలియా భట్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఫైటర్ బన్‌గయా 'లైగర్'?


విజయ్ దేవరకొండ

**వి**జయ్ దేవరకొండ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియన్ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం తదితర భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఛార్మీ కౌర్, కరణ్ జోహార్‌తో కలిసి పూరి నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్ మారిందని టాక్. ఈ చిత్రానికి తొలుత 'ఫైటర్' టైటిల్ ఖాయం చేశారు. రెండు భాషల్లో ఈ టైటిల్ దొరకలేదట. ఏవో సమస్యలు ఉన్నాయట! అందుకని, సినిమాలో హీరో పేరు 'లైగర్'ను టైటిల్‌గా ఖరారు చేశారట. 'ఫైటర్' బన్‌గయా 'లైగర్' (మగ సింహానికి, ఆడ పులికి పుట్టిన బిడ్డను లైగర్ అంటారు)! ఈ సినిమాలో విజయ్ దేవరకొండ యాక్షన్ రోల్ చేస్తున్నారు. పాత్ర కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ కూడా తీసుకున్నారు.

# నా గుర్తింపు ఎందుకు కోల్పోవాలి?

కేథరిన్



**"కెరీర్ బిగినింగ్ నుంచి నేను సెలక్టివ్‌గా సినిమాలు చేస్తున్నా. నచ్చిన కథల్నే అంగీకరిస్తున్నా. చేసిన పాత్రను మళ్లీ చేయడం నాకు నచ్చదు. మధ్యలో కొంతగ్యాప్ రావడానికి నాకు నచ్చిన కథలు రాకపోవడం కారణం. అర్థం లేని సినిమాలు చేసి నా గుర్తింపును ఎందుకు పోగొట్టుకోవాలి" అని కేథరిన్ అన్నారు. విజయ్ దేవరకొండ సరసన ఆమె నటించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో కె. వల్లభ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలకానుంది. ఈ సందర్భంగా కేథరిన్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు.**

**క్రాం**తిమాధవ్ నెరేషన్ ఇచ్చాక ఆయన దర్శకత్వం వహించిన 'ఓనమాలు', 'మళ్లీమళ్లీ ఇదిరాని రోజు' చిత్రాలు చూశా. ఆయనొక గొప్ప రచయిత అనీ, రచన ఆయన బలం అని అర్థమైంది. ఈ సినిమాకు ఆ కథ, ఆయన క్రియేట్ చేసిన పాత్రలు బలం అని తెలిసింది. ఇందులో నలుగురు హీరోయిన్‌లతోపాటు చాలామంది ఆర్టిస్టులు నటించారు. కొన్ని సందర్భాల్లో అన్ని పాత్రలకు ఇంపార్టెన్స్ ఉండకపోవచ్చు. ఇందులో ప్రతి పాత్రలో ఓ ప్రత్యేకత కనిపిస్తుంది.

## నీలా ఉంటే చాలన్నారు...

కథ వినగానే దర్శకుణ్ణి కొన్ని రొటీన్ ప్రశ్నలు అడగడం నాకు అలవాటు. క్రాంతిని కూడా అలాగే అడిగా. ఈ పాత్ర కోసం నేనేమన్నా ప్రత్యేకంగా తయారు కావాలా? కొత్తగా ఏమన్నా ట్రై చేయాలా అని అడిగాను. 'ఏం అవసరం లేదు. మీరు ఎలా ఉంటారో అలా ఉంటే చాలు' అన్నారు. ఇందులో నా క్యారెక్టర్ పేరు స్మిత. మోడ్రన్‌గా, మెచ్యూర్డ్‌గా ఉండే అమ్మాయి. మిగిలిన ముగ్గురు హీరోయిన్‌లతో నాకు కాంబినేషన్ సీన్స్ లేవు. విజయ్‌తో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ బావుంది. ఈ సినిమాకు మెయిన్ ఎట్రాక్షన్ కథే. మేమంతా జస్ట్ క్యారెక్టర్స్ అంతే! నిడివితో సంబంధం లేకుండా స్మిత పాత్రకు మంచి పేరొస్తుందనే నమ్మకం ఉంది. నిజజీవితంలో అయినా, సినిమాలో అయినా ఒకరితో బంధం కొనసాగించడం, ప్రేమించడం అనేది చాలా కష్టమని నా అభిప్రాయం. ఇందులో నాకూ, విజయ్‌కు మధ్య అలాంటి సన్నివేశాలు ఉన్నాయి. ప్రతి సీన్ ఆకట్టుకుంటుంది.

## సినిమాకు బలం కావాలి!

నేనొక సినిమా చేశానంటే నా నటన సినిమాకు బలం కావాలి. కానీ తగ్గించేలా ఉండకూడదు. నా వల్ల ఫలానా సీన్ చెడిపోయిందని నా చెవిన పడితే అసలు తట్టుకోలేను. ఇప్పటి వరకూ ఐతే అలాంటి సిచ్చువేషన్ ఎదురుకాలేదు. ఏ రంగంలోనైనా మనకు ఒక రూపాయి వస్తుందంటే అది మనం చేసే పనిని బట్టే కదా! ఆ విలువను నేను నిలబెట్టుకుంటా. బాక్సాఫీస్ లెక్కలతో సంబంధం లేకుండా 'కేథరిన్ బాగా నటించింది, తన పాత్ర సినిమాకు ఉపయోగపడింది' అన్న పేరు తెచ్చుకోవడం కోసమే తపన పడుతుంటా.

## ప్రేమ మీద గౌరవముంది...

ప్రేమ మీద నాకు మంచి అభిప్రాయముంది. అదొక ఎమోషన్. అమ్మాయి, అబ్బాయి మధ్య ఉన్నదే ప్రేమ కాదు. స్నేహితులు, కుటుంబ సభ్యులు అందరి మధ్య ప్రేమ ఉంటుంది. నేను ఆ ప్రేమను గౌరవిస్తాను. సహజీవనం అనేది అందరికీ సరిపడదు. ఓ మనిషిని అర్థం చేసుకొని, పెళ్లి చేసుకోవాలనే ఆలోచన ఉంటే అది కరెక్టే. పెళ్లి అనేది ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగే జీవితకాల ఒప్పందం. ఆ ప్రేమ, పెళ్లి వ్యవహారాన్ని గౌరవిస్తా.

## అది నిర్మాతే చెప్పాలి...

అర్థవంతమైన సినిమాలు చేయాలన్నదే నా లక్ష్యం. నాకు కామిక్ సినిమాలంటే చాలా ఇష్టం. కానీ అలాంటి పాత్రలు చేసే అవకాశం ఇంకా రాలేదు. ప్రస్తుతం తమిళంలో ఓ మంచి కథ చేస్తున్నా. బోయపాటి- బాలకృష్ణ సినిమాలో నేను ఉన్నానా లేదా అన్నది ప్రొడక్షన్ హౌస్ చెప్పాలి.

# రెండు పాత్రల్లో...


మహేశ్‌బాబు

**మ**హేశ్‌బాబు... తన తదుపరి చిత్రంతో డ్యూయల్ రోల్ చేస్తున్నారా? అంటే అవుననే అంటున్నాయి. టాలీవుడ్ వర్గాలు. చిన్నతనంలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా 'కొడుకు దిద్దిన కాపురం'లో ఆయన ద్విపాత్రాభినయం చేశారు. ఆ తర్వాత 2004లో ఎస్.ఏ రాజ్‌కుమార్ దర్శకత్వం వహించిన 'నాని' క్లైమాక్స్ సీన్‌లో తండ్రీ కొడుకులుగా డ్యూయల్ రోల్ చేసి మెప్పించారు. అయితే స్టార్‌డమ్ వచ్చాక మహేశ్ డ్యూయల్ రోల్ చేసింది లేదు. ఇప్పుడు ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నారనే వార్త ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతోంది. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాతగా మహేశ్ ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే! 'మహర్షి' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. ఇందులో మహేశ్ రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపిస్తారట. అయితే ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించలేదు. మహేశ్ అమెరికా ట్రిప్ పూర్తి చేసుకుని ఇండియాకు వచ్చాక ఈ చిత్రం షూటింగ్ మొదలవుతుంది.

# 'నర్తనశాల' లాంటి సినిమాలు చేయను

**- నాగశౌర్య**


రమణ తేజ, శంకర్ ప్రసాద్, ఉష, నాగశౌర్య

"**శౌ**ర్య కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా 'అశ్వథ్థామ' నిలిచినందుకు ఆనందంగా ఉంది. తన రచనా శైలి, నటన, ఫైట్లు ఆకట్టుకున్నాయని అందరూ చెబుతున్నారు. మున్ముందు ఐరా క్రియేషన్స్‌లో ఇలాంటి మంచి చిత్రాలను తీసుకొస్తాం" అని ఉషా ముల్పూరి అన్నారు. నాగశౌర్య, మెహరీన్ జంటగా రమణ తేజ దర్శకత్వంలో ఉషా ముల్పూరి నిర్మించిన చిత్రం 'అశ్వథ్థామ'. శుక్రవారం ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ మీట్ జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ "సినిమాకు మా టీమ్ బలం. అందరి కృషి వల్లే సినిమా విజయం సాధించింది. నాగశౌర్య నటనకు మంచి మార్కులు పడ్డాయి" అని అన్నారు. "సినిమాల ఎంపికలో జాగ్రత్త వహిస్తున్నా. నేను బాగా నమ్మి చేసిన సినిమా ఇది. ఇలాంటి కథను ప్రొడ్యూస్ చేసిన అమ్మకు థ్యాంక్స్. మరోసారి 'నర్తనశాల' లాంటి సినిమా చెయ్యను. రమణతేజకు సినిమా అంటే ప్రాణం. నా నమ్మకాన్ని తను నిలబెట్టాడు" అని నాగశౌర్య తెలిపారు. "విజువల్ ట్రీట్‌లాంటి సినిమా ఇది. నేను పనిచేసిన మంచి సినిమాల్లో ఇదొకటి" అని ప్రిన్స్ అన్నారు. "శౌర్య రాసిన కథలో ఇంటెన్స్ బావుంది. సెన్సిటివ్ సబ్జెక్ట్‌ను దర్శకుడు చక్కగా తెరకెక్కించారు. స్క్రీన్‌ప్లే అమేజింగ్‌గా ఉంది. ఈ సినిమాతో శౌర్య యాక్షన్‌స్టార్‌గా గుర్తింపు పొందాడు" అని శరత్ మరార్ అన్నారు. నందినీరెడ్డి, బీవీఎస్ రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఐదుగురు ఈగోయిస్ట్‌లతో...


మధుసూధన్, వైభవీ జోషి, శ్రీజిత్ ఘోష్

**మ**ధుసూధన్, వైభవీ జోషి, శ్రీజిత్ ఘోష్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'www.మీనాబజార్'. రానా సునీల్ కుమార్ సింగ్ దర్శకత్వంలో నాగేంద్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్రం పాటల్ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. నవీన్ యాదవ్, దివ్యవాణి, హేమ ఆడియో సీడీలను ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రతి మనిషిలో ఈగో ఉంటుంది. అలా ఈగో ఉన్న ఐదుగురు వ్యక్తులు కలిస్తే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి అన్నది ఈ సినిమా. కద్రి మణికాంత్ చక్కని సంగీతం అందించారు" అని చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత వెల్లడించారు.






| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 41,141.85 | 12,098.35 | 40,666 | 46,230 | 71.40 | 54.84 |
| 164.18 ↓ | 39.60 ↓ | 168 ↑ | 75 ↑ | (22 పైసలు) ↓ | ↓ |
| | | ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) | | | |

# విశ్వాసం సన్నగిల్లుతోంది

### జనవరిలో 83.7 స్థాయికి కన్స్యూమర్ కాన్ఫిడెన్స్.. ఐదేళ్ల కనిష్ఠ స్థాయి.. ఆర్‌బీఐ తాజా సర్వేలో వెల్లడి

ఆర్థిక మందగమనం నేపథ్యంలో దేశంలోని వినియోగదారుల విశ్వాసం మరింతగా క్షీణించింది. భారత రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) విడుదల చేసిన తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ ఏడాది జనవరిలో వినియోగదారుల విశ్వాసం 83.7 స్థాయికి తగ్గింది. ఇది ఐదేళ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఇంతకు ముందు 2015 మార్చిలో ఈ స్థాయిలో వినియోగదారుల విశ్వాసం ఉంది. గత నవంబరులో వినియోగదారుల విశ్వాస సూచీ 85.7గా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఉపాధి, ధరల స్థాయి, ఆదాయం, వ్యయాలు వంటి అంశాల ఆధారంగా ఈ సూచీని రూపొందించారు. అయితే భవిష్యత్ అంచనాలకు సంబంధించి సూచీ మాత్రం సానుకూలంగా ఉంది. ప్రస్తుత అవగాహన ప్రకారం.. సాధారణ ఆర్థిక పరిస్థితి, ధర స్థాయిలు, కుటుంబ



ఆదాయం వంటివి గత సర్వేతో పోల్చితే బలహీనంగా ఉన్నాయి. అయితే ఉద్యోగాలకు సంబంధించి ఏడాది ముందు అంచనాలు మాత్రం ఆశావాహంగా ఉన్నట్టు సర్వే వెల్లడించింది. గత ఏడాది కాలంలో ధరలతోపాటు ఖర్చులు పెరిగాయని అధిక శాతం కుటుంబాలు అభిప్రాయ పడుతున్నాయి. వచ్చే ఏడాది కాలంలో ఇవి మరింతగా పెరిగేందుకు ఆస్కారం ఉన్నట్టు భావిస్తున్నారు. ఏడాది క్రితంతో పోల్చితే దేశంలోని కుటుంబాలు అత్యవసరం కాని ఉత్పత్తులపై ఖర్చులను తగ్గించుకున్నట్టు సర్వే పేర్కొంది. ఆర్‌బీఐ దేశంలోని 13 ప్రధాన నగరాల్లో సర్వే చేపట్టింది. వీటిలో అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, చెన్నై, ఢిల్లీ, గువహతి, హైదరాబాద్, జైపూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, పట్నా, తిరువనంతపురం ఉన్నాయి. సాధారణ ఆర్థిక పరిస్థితి, ఉద్యోగాలు, ధరల పరిస్థితి, సొంత ఆదాయం, వ్యయాలకు సంబంధించి ప్రస్తుత అవగాహన, అంచనాలపై నిర్వహించిన సర్వేలో 5,389 కుటుంబాల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు.



### తగ్గిన ఉత్పత్తి సామర్థ్య వినియోగం

దేశంలో వినియోగదారులు ఖర్చు చేసే మొత్తం తగ్గిన నేపథ్యంలో కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించుకుంటున్నాయి. గత ఏడాది ఏప్రిల్-జూన్ (మొదటి త్రైమాసికం)లో కంపెనీల ఉత్పత్తి సామర్థ్య వినియోగం 73.6 శాతంగా ఉన్నట్టు ఆర్‌బీఐ మరో నివేదిక తెలిపింది. రెండో త్రైమాసికంలో ఇది 69.1 శాతానికి తగ్గిపోయింది. ఈ సర్వేలో 866 మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు పాల్గొన్నాయి. ఆర్థిక మందగమనం నేపథ్యంలో వినియోగదారులు ఏ వస్తుసేవలను కొనుగోలు చేయాలన్న ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీని ప్రభావమే కంపెనీల ఉత్పత్తిపై కనిపిస్తోంది.

## ఎస్‌బీఐ రుణం మరింత చౌక

ముంబై: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) వడ్డీ రేట్లను మరింత తగ్గించింది. దీంతో బ్యాంక్ రుణాలు మరింత చౌకగా లభించనున్నాయి. అయితే, ఎస్‌బీఐలో నిర్దిష్ట కాలపరిమితికి డిపాజిట్ చేసే సొమ్ముపైన లభించే వడ్డీ రాబడికి మాత్రం కోతపడనుంది. నిధుల సేకరణ వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్ఆర్)ను మరో 0.05 శాతం తగ్గిస్తున్నట్లు శుక్రవారం ఎస్‌బీఐ ప్రకటించింది. ఈ నెల 10 (సోమవారం) నుంచి ఇది అమల్లోకి రానుంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ ఎంసీఎల్ఆర్‌ను తగ్గించడం వరుసగా ఇది 9వ నెల. దీంతో ఏడాది కాలపరిమితి రుణాలకు వర్తించే ఎంసీఎల్ఆర్ 7.90 శాతం నుంచి 7.85 శాతానికి తగ్గనుంది.

### డిపాజిట్ రేట్లలో కోత

వ్యవస్థలో ద్రవ్య లభ్యత అవసరానికి మించి అందుబాటులో ఉన్న నేపథ్యంలో టర్మ్ డిపాజిట్లపై చెల్లించే వడ్డీకి ఎస్‌బీఐ మరింత కోత పెట్టింది. సోమవారం నుంచి ఇది అమల్లోకి రానుంది. రిటైల్ టర్మ్ డిపాజిట్ల (రూ.2 కోట్లలోపు)పై కాలపరిమితిని బట్టి వడ్డీ రేటును 0.10-0.50 శాతం మేర తగ్గించింది. బల్క్ డిపాజిట్ల (రూ.2 కోట్లు, అంతకు మించి)పై వడ్డీ రేట్లలో 0.25-0.50 శాతం మేర కోత పెట్టింది.

# ప్రీమియం ఆదాయంలో ఎల్ఐసీ కొత్త రికార్డు

### రూ.1.5 లక్షల కోట్లు దాటిన న్యూ బిజినెస్ ప్రీమియం
### రూ.32.25 లక్షల కోట్ల ఆస్తులు: ఎల్ఐసీ చైర్మన్ ఎంఆర్ కుమార్



ముంబై: ప్రైవేటు కంపెనీల నుంచి తీవ్ర పోటీ ఉన్నా ఐపీఓకు రానున్న ఎల్ఐసీ, వ్యాపారంలో దూసుకుపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 10 నెలల్లో (2019 ఏప్రిల్- 2020 జనవరి).. సంస్థ కొత్త వ్యాపార ప్రీమియం వసూళ్లు రూ.1.5 లక్షల కోట్లు మించిపోయాయి. కొత్త వ్యాపార ప్రీమియం వసూళ్లు రూ.1.5 లక్షల కోట్లు దాటడం ఇదే మొదటిసారి. ఇందులో ఎక్కువ భాగం తొలిసారిగా వ్యక్తిగత పాలసీలు తీసుకున్న వారు చెల్లించిన ప్రీమియం ద్వారా సమకూరిందని ఎల్ఐసీ చైర్మన్ ఎంఆర్ కుమార్ చెప్పారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ప్రీమియం 17.48 శాతం పెరిగింది. అమ్మిన పాలసీల సంఖ్య కూడా 29.42 శాతం పెరిగాయి. ఈ పాలసీల ద్వారా ఎల్ఐసీకి రూ.45,199 కోట్ల కొత్త ప్రీమియం సమకూరింది. దీంతో ప్రీమియం వసూళ్లలో మార్కెట్ వాటా 66.26% నుంచి 70.02 శాతానికి పెరిగింది. పాలసీలపరంగా చూసినా మార్కెట్ వాటా 73.54% నుంచి 77.61 శాతానికి చేరింది.

### కలిసొచ్చిన పెన్షన్, గ్రూప్ పథకాలు

గత 10 నెలల్లో పెన్షన్, గ్రూప్ పథకాల ద్వారానే ఎల్ఐసీ రూ.1.05 లక్షల కోట్ల కొత్త వ్యాపార ప్రీమియం వసూలు చేసింది. వివిధ సామాజిక బీమా పథకాల కింద ఎల్ఐసీ గత పది నెలల్లో 2.45 కోట్ల మందికి బీమా సదుపాయం కల్పించింది.

### ఆదాయం రూ.2.97 లక్షల కోట్లు

2018 సెప్టెంబరుతో పోలిస్తే గత ఏడాది సెప్టెంబరు నాటికి ఎల్ఐసీ స్థూల ఆదాయం 17.79 శాతం వృద్ధి రేటుతో రూ.2,97,017 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.29.89 లక్షల కోట్ల నుంచి రూ.32.25 లక్షల కోట్లకు చేరినట్టు ఎల్ఐసీ చైర్మన్ ఎంఆర్ కుమార్ చెప్పారు.

### సమయం చూసి ఐడీబీఐ బ్యాంక్‌పై నిర్ణయం

ఐడీబీఐ బ్యాంక్‌లో ఎల్ఐసీకి ఉన్న 51 శాతం వాటా విక్రయంపై సమయం చూసి నిర్ణయం తీసుకుంటామని కుమార్ చెప్పారు. ఐఆర్‌డీఏఐ నిబంధనల ప్రకారం ఏ బీమా కంపెనీ.. ఒక కంపెనీ ఈక్విటీలో 15 శాతానికి మించి వాటా ఉండకూడదు. ప్రత్యేక కేసు కింద ఆర్‌బీఐ.. ఎల్ఐసీకి 12 ఏళ్ల గడువు ఇచ్చింది. అయితే అంతకంటే ముందే ఐడీబీఐ బ్యాంక్ ఈక్విటీలో వాటా తగ్గించుకునే విషయం పరిశీలిస్తామని కుమార్ చెప్పారు.

## మళ్లీ ఎఫ్ఆర్‌డీఏ బిల్లు



ముంబై: వివాదాస్పద ఫైనాన్షియల్ రిసొల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లుపై ఆర్థిక మంత్రిత్వ శాఖ మళ్లీ కసరత్తు చేస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయం వెల్లడించారు. అయితే ఎప్పుడు ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతారనే విషయం మాత్రం చెప్పలేనన్నారు. ఈ బిల్లు చట్టంగా మారితే బ్యాంక్ డిపాజిటర్ల డిపాజిట్ల చెల్లింపులకు రక్షణ ఉండదని గతంలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. దాంతో ప్రభుత్వం అప్పట్లో ఈ బిల్లును వెనక్కి తీసుకుంది. మొన్నటి బడ్జెట్‌లో బ్యాంకు డిపాజిట్ల బీమా పరిమితిని రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచారు. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి మళ్లీ ఈ బిల్లు ప్రస్తావన తీసుకురావడం విశేషం.

## పీఎన్‌బీ, ఓబీసీ విలీన బ్యాంక్‌కు త్వరలో కొత్త పేరు, లోగో

కోల్‌కతా: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)లు విలీనమవుతున్న విషయం తెలిసిందే. వీటి విలీనం ద్వారా ఏర్పాటయ్యే కొత్త బ్యాంకు పేరు దాని లోగోను త్వరలోనే కేంద్రం ఆవిష్కరించనున్నట్టు ఓ అధికారి తెలిపారు. ఈ బ్యాంక్ దేశంలోనే రెండో అతిపెద్ద బ్యాంక్‌గా ఆవిర్భవించనుంది. దీని వ్యాపార పరిమాణం రూ.18 లక్షల కోట్లు ఉండనుంది. కొత్త బ్యాంకు 2020 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కార్యకలాపాలు సాగించనుంది.

## టెక్నో యూనిక్ ఇన్‌ఫ్రాతో మాకెలాంటి సంబంధం లేదు

- స్పష్టం చేసిన గీతం యూనివర్సిటీ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): టెక్నో యూనిక్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) నోటీసులు జారీ చేసింది. కంపెనీ తీసుకున్న రుణం చెల్లించకపోవటంతో దానికి హామీదారులుగా ఉన్న మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి, ఆయన ఇద్దరు కుమారులు, మరికొందరికి.. కరూర్ వైశ్యా బ్యాంక్ (అబిడ్స్, హైదరాబాద్ శాఖ) పత్రికా ప్రకటన ద్వారా ఈ నోటీసులు జారీ చేసింది. చెల్లించాల్సిన మొత్తం రూ.124.39 కోట్లుగా ఉందని పేర్కొంది. దీనిపై 'గీతం' కు బ్యాంక్ నోటీసులు అంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో గీతం చైర్మన్ శ్రీభరత్ స్పందించారు. ఈ రుణంతో గీతం యూనివర్సిటీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన తాత (ఎంవీఎస్ఆర్ మూర్తి)కు ఆ కంపెనీతో లావాదేవీలు ఉండేవని, ప్రస్తుతం తన బాబాయ్ ఆ వ్యవహారాలు చూసుకుంటున్నారని శ్రీభరత్ వివరించారు.

## హైదరాబాద్‌లో టెక్నో పెయింట్స్ కొత్త యూనిట్

- రూ.25 కోట్ల పెట్టుబడి
- మార్కెట్లోకి కొత్త శ్రేణి రంగులు



కొత్త పెయింట్స్‌ను విడుదల చేస్తున్న శ్రీనివాస రెడ్డి, తదితరులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో ఐదు తయారీ యూనిట్లు కలిగిన టెక్నో పెయింట్స్ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో మరో యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం ఏడాదికి 42 వేల టన్నుల పెయింట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని.. 40 వేల టన్నులతో కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నామని టెక్నో పెయింట్స్ బ్రాండ్‌తో పెయింట్లను ఉత్పత్తి చేస్తున్న ఫార్చ్యూన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రూ.25 కోట్లతో 3 ఎకరాల్లో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాణిజ్య, నివాస, పారిశ్రామిక విభాగాల్లో కొత్త శ్రేణి రంగులను కంపెనీ ప్రవేశపెట్టింది. యాంటీ బ్యాక్టీరియల్, ఐఆర్ రిఫ్లెక్షన్ సహా వాటర్ బేస్డ్ ఎమల్షన్స్‌ను 1,800 కొత్త రంగుల్లో విడుదల చేసింది. నేచురల్ స్టోన్ స్ట్రక్చర్ వంటి స్పెషాలిటీ రంగులను త్వరలో కంపెనీ ప్రవేశపెట్టనుంది. 2019-20 ఏడాదికి అమ్మకాలు రూ.85-90 కోట్లకు, 2022-23 నాటికి టర్నోవర్ రూ.250 కోట్లకు చేరగలదని అంచనా వేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. విదేశీ విస్తరణలో భాగంగా దక్షిణాఫ్రికాలోని స్థానిక కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు.

## షాపర్స్ స్టాప్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాఫ్ట్‌వేర్ నిపుణులు, యువతను ఆకర్షించడానికి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో షాపర్స్ స్టాప్ కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఇది 6వ స్టోర్ అని షాపర్స్ స్టాప్ కస్టమర్ కేర్ అసోసియేట్, ఎండీ, సీఈఓ రాజీవ్ సూరి తెలిపారు. దీంతో దేశవ్యాప్తంగా కంపెనీ స్టోర్లు 90కి చేరాయి.

## బీదర్-బెంగళూరు మధ్య ట్రూజెట్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ట్రూజెట్ బీదర్-బెంగళూరుల మధ్య విమాన సేవలను ప్రారంభించింది. ఉడాన్ పథకం కింద సేవలు అందిస్తున్న పట్టణాల నెట్‌వర్క్‌లో తాజాగా బీదర్ చేరిందని టర్బో మేఘా ఎయిర్‌వేస్ డైరెక్టర్ కేఈ ప్రదీప్ తెలిపారు. విమానం బెంగళూరులో ఉదయం 11.25 గంటలకు బయలుదేరి బీదర్‌కు మధ్యాహ్నం 1.05 గంటలకు చేరుతుంది. బీదర్‌లో 1.35 గంటలకు బయలుదేరి బెంగళూరుకు సాయంత్రం 3.15 గంటలకు చేరుతుంది. స్ప్రింగ్ సీజన్‌ను పురస్కరించుకుని 4 రోజుల పాటు అన్ని గమ్యస్థానాలకు బేసిక్ చార్జీని రూ.699గా నిర్ణయించింది.

## ఎన్‌సీసీ లాభంలో 39% క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన ఎన్‌సీసీ రూ.102.5 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం లాభం రూ.167.57 కోట్లతో పోలిస్తే 38.83 శాతం తగ్గింది. టర్నోవరు రూ.3,416 కోట్ల నుంచి రూ.2,283 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. షేరుకు ఆర్జన (ఈపీఎస్) కూడా రూ.2.76 నుంచి రూ.1.73కు పరిమితమైంది.

## 4 రోజుల ర్యాలీకి బ్రేక్

- సెన్సెక్స్‌కు 164 పాయింట్ల నష్టం

ముంబై: ఈ వారంలో స్టాక్ మార్కెట్ సూచీలు తొలి నష్టాన్ని నమోదు చేసుకున్నాయి. దాంతో నాలుగు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడింది. శుక్రవారం బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 164.18 పాయింట్ల నష్టంతో 41,141.85 వద్దకు జారుకుంది. నిఫ్టీ 39.60 పాయింట్లు తగ్గి 12,098.35 వద్ద స్థిరపడింది. కరోనా వైరస్ వ్యాప్తిపై అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న భయాందోళలతో దలాల్‌స్ట్రీట్‌లోనూ ట్రేడింగ్ సెంటిమెంట్ ప్రతికూలంగా మారింది. దాంతో, వరుస కొనుగోళ్లు జరుపుతూ వచ్చిన ట్రేడర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.



## బీఎస్-6 పెట్రోల్ ఇంజన్‌తో ఇగ్నిస్

మారుతీ సుజుకీ సరికొత్త కాంపాక్ట్ ఎస్‌యూవీ ఇగ్నిస్‌ను ఆటో షోలో ఆవిష్కరించింది. ఇందులో 1.2 లీటర్ బీఎస్-6 పెట్రోల్ ఇంజన్ ఉంది. ఈ కారు బుకింగ్స్‌ను కూడా ప్రారంభించింది. ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌లాంప్స్, 17.78 సెంటీమీటర్ల స్మార్ట్ ప్లే స్టూడియో, సరికొత్త ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్‌తోపాటు లైవ్ ట్రాఫిక్, వాయిస్ రికగ్నిషన్, డ్రైవర్ సేఫ్టీ అలర్ట్స్, వెహికిల్ ఇన్ఫర్మేషన్ తదితర ఫీచర్లు ఈ కారులో ఉన్నట్టు కంపెనీ తెలిపింది.

## నా ఆస్తి సున్నా!

- అప్పట్లో శ్రీమంతుడినే.. కానీ ఇప్పుడేం లేదు
- బ్రిటన్ కోర్టుకు వెల్లడించిన అనిల్ అంబానీ



లండన్: ఆసియాలో అత్యంత ధనవంతుడైన ముకేశ్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ మాత్రం ఆర్థికంగా అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వ్యాపారాల్లో ఎంతగా దివాలా తీశాడంటే, తన దగ్గరిక చెల్లించడానికేం లేదని చేతులెత్తేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో అనిల్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్).. చైనాకు చెందిన మూడు బ్యాంకుల నుంచి 2012లో 92.5 కోట్ల డాలర్ల రుణం తీసుకుంది. దివాలా తీసిన ఆర్‌కామ్.. చైనా బ్యాంకులకు రుణాన్ని పూర్తిగా చెల్లించడంలో విఫలమైంది. తమకు రావాల్సిన 68 కోట్ల డాలర్ల బకాయిల కోసం ఆ బ్యాంకులు లండన్‌లోని అంతర్జాతీయ కోర్టును ఆశ్రయించాయి. ఈ రుణానికి అనిల్ వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చారని, ఆయన ఆస్తుల విక్రయం ద్వారా బకాయిల రికవరీకి అవకాశం కల్పించాలని బ్యాంకులు వాదిస్తున్నాయి. కాగా, విధిగా పాటించాల్సిన హామీ మాత్రం ఇవ్వలేదని అనిల్ అంటున్నారు. "తన పెట్టుబడుల విలువ పూర్తిగా పతనమైంది. గ్రూపు కంపెనీల్లోని తన ఈక్విటీ వాటా విలువ దాదాపు 8.24 కోట్ల డాలర్లకు క్షీణించింది. తాను చెల్లించాల్సిన అప్పులను కూడా పరిగణలోకి తీసుకుంటే ఇప్పుడాయన ఆస్తి సున్నా. అప్పట్లో శ్రీమంతుడే, కానీ ఇప్పుడాయన దగ్గరేం లేదు" అని అనిల్ తరపు న్యాయవాది రాబర్ట్ హోవే కోర్టుకు విన్నవించారు. అయితే, అంబానీ వాదనలను బ్యాంకుల తరపు న్యాయవాద కౌన్సిల్ ప్రశ్నించింది. ఆ సందర్భంగా అనిల్ విలాస జీవన వైభోగం గురించి ప్రస్తావించింది. అనిల్‌కు 11 లగ్జరీ కార్లు, సొంత నౌక, ప్రైవేట్ జెట్‌తో పాటు దక్షిణ ముంబైలో సీవిండ్ పెంట్‌హౌజ్ కూడా ఉందని కోర్టుకు నివేదించింది. ఈ కేసులో అనిల్ తరపు కౌన్సిల్ వాదనలతో సంతృప్తి చెందని కోర్టు ధర్మాసనం.. ఆరు వారాల్లో 10 కోట్ల డాలర్లు డిపాజిట్ చేయాలని అంబానీని ఆదేశించింది.

## కొత్త శ్లాబులకే ఐటీ చెల్లింపుదారుల మొగ్గు

ముంబై : బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన కొత్త ఆదాయ పన్ను (ఐటీ) విధానానికి పన్ను చెల్లింపుదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. వ్యక్తిగత ఐటీ చెల్లింపుదార్లలో 80 శాతం మంది, పన్ను మినహాయింపులు, తగ్గింపులు లేని కొత్త విధానానికి మారే అవకాశం ఉందని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే చెప్పారు. పెట్టుబడుల మినహాయింపులు, తగ్గింపులు లేకపోయినా... కొత్త విధానంలో పన్ను పోటు తక్కువగా ఉంటుందన్నారు. పేపర్ వర్క్ కూడా పెద్దగా ఉండదన్నారు. దీంతో ఎక్కువ మంది కొత్త శ్లాబుల విధానానికి మారే అవకాశం ఉందన్నారు. కొత్త విదానంతో దేశంలో ఆదాయ పన్ను చెల్లిస్తున్న 5.78 కోట్ల మందిలో 69 శాతం మందికి పన్నుల భారం తగ్గుతుందని తమ పరిశీలనలో తేలినట్టు చెప్పారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

| | | | |
|---|---|---|---|
| 7వ తేదీకి.. | | విజయవాడ | 325 |
| హైదరాబాద్ | 315 | విశాఖపట్నం | 375 |
| 8వ తేదీకి.. | | వరంగల్ | 318 |
| చిత్తూరు | 373 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 325 | | |



### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 72 | విజయవాడ | 77 |
| వరంగల్ | 72 | గుంటూరు | 77 |
| మహబూబ్‌నగర్ | 72 | ఒంగోలు | 79 |
| కరీంనగర్ | 73 | చిత్తూరు | 67 |
| కర్నూలు | 72 | నెల్లూరు | 67 |
| విశాఖపట్నం | 65 | అనంతపురం | 68 |
| గోదావరి | 71 | | |



### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 40,330 | 40,950 | 41,920 | 40,800 | 40,660 |
| క్రితం ముగింపు | 40,460 | --- | 41,750 | 40,650 | 40,550 |
| 22 క్యారెట్లు | 38,450 | 37,900 | 38,560 | 37,740 | 38,730 |
| క్రితం ముగింపు | 38,510 | --- | 38,410 | 37,600 | 38,620 |
| వెండి (కిలో) | 46,200 | 47,600 | 47,600 | 47,500 | 50,100 |
| క్రితం ముగింపు | 45,900 | --- | 47,500 | 47,300 | 49,800 |

# 'కారు'కు కరోనా కాటు!

## ప్రపంచంలో అతిపెద్ద కార్ల ప్లాంట్ మూత

### చైనా నుంచి నిలిచిన విడిభాగాల సరఫరా.. తయారీకి విఘాతం



సియోల్: చైనాలో కరోనా వైరస్ వ్యాప్తితో ప్రపంచంలోని అతిపెద్ద కార్ల తయారీ కేంద్రం తాత్కాలికంగా మూతపడింది. మొత్తం 14 లక్షల యూనిట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కూడిన ఈ ఐదు ప్లాంట్ల కేంద్రం దక్షిణ కొరియా ఆటో దిగ్గజం హ్యుండయ్‌కి చెందినది. ఈ ప్లాంట్లు కూడా దక్షిణ కొరియాలోని ఉల్సాన్ ప్రాంతంలోనే ఉన్నాయి. మరి చైనాలో వైరస్ వ్యాప్తికి, దక్షిణ కొరియాలోని ఈ ప్లాంట్లలో ఉత్పత్తి నిలిచిపోవడానికి కారణమేంటంటారా..? ఈ ప్లాంట్లలో కార్ల తయారీకి అవసరమైన కొన్ని విడిభాగాలు చైనా నుంచే రావాలి మరి. కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా చైనా ప్రభుత్వం తన దేశంలోని పలు పారిశ్రామిక కేంద్రాల్లో ఉత్పత్తి నిలివేతకు ఆదేశాలు జారీ చేసింది. దాంతో చైనాలోని హ్యుండయ్ ప్లాంట్‌లో విడిభాగాల ఉత్పత్తి నిలిచిపోయింది. హ్యుండయ్ తన చైనా ప్లాంట్‌లో వాహన ఎలక్ట్రానిక్స్ వ్యవస్థను అనుసంధానించే 'వైరింగ్ హార్నెస్'లను తయారు చేస్తోంది. ఈ హార్నెస్‌ల ఉత్పత్తితో పాటు సరఫరా నిలిచిపోవడంతో స్వదేశంలోని తన ఐదు ప్లాంట్లలో కార్ల ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చింది. తత్ఫలితంగా వీటిలో పని చేసే 25,000కు పైగా కార్మికులకు పని లేకుండా పోయింది. ఐదు రోజులపాటు ఈ కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేతతో హ్యుండయ్ ఆదాయానికి 50 కోట్ల డాలర్ల (రూ.3,550 కోట్లు) మేర గండిపడవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

హ్యుండయ్ ఒక్కటే కాదు.. కరోనా బాధిత ఆటో కంపెనీలు చాలానే ఉన్నాయి. హ్యుండయ్ అనుబంధ విభాగమైన కియా సైతం దక్షిణ కొరియాలోని తన మూడు ప్లాంట్లలో సోమవారం ఉత్పత్తిని నిలిపివేయనుంది. ఫ్రెంచ్ కార్ల దిగ్గజం రెనో సైతం దక్షిణ కొరియా, బుసాన్ నగరంలోని ఫ్యాక్టరీని వచ్చే వారం తాత్కాలికంగా మూసేయనుంది. కరోనా దెబ్బకు యూరప్‌లోని తమ యూనిట్లను కొన్ని రోజులపాటు మూసేయాల్సి రావచ్చని ఫియట్ క్రిస్లర్ సీఈఓ మైక్ తెలిపారు. చాలా వరకు ఆటో కంపెనీలు తమ కార్ల విడిభాగాలు, ఇతర పరికరాల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతుండటం ఇందుకు కారణం.

### ఫ్రాన్స్, జర్మనీలో పారిశ్రామిక అనిశ్చితి

వాణిజ్య యుద్ధ ఆందోళనల నేపథ్యంలో గత ఏడాది చివరి త్రైమాసికానికి యూరప్ దిగ్గజాలు జర్మనీ, ఫ్రాన్స్‌లో పారిశ్రామికోత్పత్తి మందగించింది. ఈ ఏడాది ఉత్పత్తి పునరుద్ధరణ అవకాశాలకు కరోనా వైరస్ గండికొట్టిందని ఆర్థిక విశ్లేషకులంటున్నారు.

### హాంకాంగ్ ఎయిర్‌లైన్స్‌లో 400 మంది తొలగింపు

ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న హాంకాంగ్ ఎయిర్‌లైన్స్‌కు కరోనా వైరస్ వ్యాప్తితో మూలిగే నక్కపై తాటి పండు పడినట్లయింది. హాంకాంగ్-చైనా మధ్య సర్వీసులను రద్దు చేయాల్సి రావడంతో ఆర్థిక సమస్య తీవ్రతరమైంది. దాంతో 400 మంది ఉద్యోగులను తొలగించిన ఎయిర్‌లైన్స్.. మిగతా సిబ్బందిని కూడా వేతనం లేని సెలవులపై ఇంటికి పంపింది.

### సార్స్ కంటే అధిక ప్రభావం

2003లో విజృంభించిన సార్స్ వైరస్ కంటే కరోనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అధిక ప్రభావం చూపవచ్చని ఐహెచ్ఎస్ మార్కిట్ హెచ్చరించింది. 2003లో చైనా ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ప్రపంచ జీడీపీలో కేవలం 4.2 శాతం వాటానే కలిగి ఉండేది. గడిచిన కొన్నేళ్లలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన చైనా.. ప్రపంచ జీడీపీలో 16.3 శాతం వాటా కలిగి ఉంది. కాబట్టి, చైనా ఆర్థిక మందగమనం ప్రపంచాన్నంతటినీ ప్రభావితం చేయనుందని ఐహెచ్ఎస్ మార్కిట్ తాజా నివేదికలో పేర్కొంది.

## టిక్‌టాక్ పిచ్చితో వ్యక్తి ఆత్మహత్య!





బెంగళూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): టిక్‌టాక్ యాప్‌కు బానిసైన ఓ వ్యక్తి ఏకంగా ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కర్ణాటక రాష్ట్రం దావణగెరె జిల్లా మాగనహళ్లిలో చోటుచేసుకుంది. టిక్‌టాక్ ద్వారానే చివరి వీడియోను పోస్ట్ చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. మాగనహళ్లికి చెందిన నాగరాజు అలియాస్ రాజు(34) టిక్‌టాక్‌కు బానిసగా మారాడు. ఇదే విషయమ్మై మొదటి భార్య వదిలివెళ్లిపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. నిత్యం టిక్‌టాక్ ధ్యాసలో ఉండడంతో రెండో భార్యతో కూడా గొడవలు తలెత్తాయి. కొన్నాళ్ల క్రితం ఆమె కూడా వదిలేసి వెళ్లిపోయింది.. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారిన రాజు మూడు రోజుల కిందట ఆత్మహత్య చేసుకుంటున్నట్లు టిక్‌టాక్‌లో పోస్టింగ్ పెట్టాడు. ఆ తర్వాత ఉరివేసుకుని అఘాయిత్యానికి పాల్పడాడు.

## 'నిర్భయ' తాజా డెత్ వారెంట్‌కు కోర్టు నో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: నిర్భయ హత్యాచార దోషుల ఉరితీతకు సంబంధించి కేంద్రానికి, ఢిల్లీ ప్రభుత్వానికి కోర్టుల్లో ఎదురుదెబ్బలు తగిలాయి. తాజాగా డెత్ వారెంట్ జారీ చేయాలని కోరుతూ ఢిల్లీ సర్కార్ తరఫున తిహాడ్ జైలు అధికారులు పెట్టుకున్న పిటిషన్‌ను పటియాలా హౌస్‌లోని ట్రయల్ కోర్టు కొట్టేసింది. వారం రోజుల్లోగా న్యాయపరమైన అన్ని ప్రత్యామ్నాయాలనూ ప్రయత్నించుకోవాల్సిందిగా దోషులకు ఢిల్లీ హైకోర్టు ఫిబ్రవరి 5న ఆదేశాలిచ్చిన విషయాన్ని ప్రత్యేక కోర్టు ప్రస్తావించింది. 'వారు బతకడానికి ఉన్నత న్యాయస్థానం ఓ అవకాశాన్ని కల్పించినపుడు దాన్ని అడ్డుకోవడం నేరం, పాపం. ఈ పిటిషన్ పరిశీలనార్హమైనది కాదు, యోగ్యత లేదు' అని పటియాలా కోర్టు జడ్జి ధర్మేంద్ర రాణా పేర్కొన్నారు. అటు ఫిబ్రవరి 5న హైకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను సవాల్ చేస్తూ కేంద్రం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విషయంలోనూ చుక్కెదురైంది. 'దోషులకు హైకోర్టు వారం రోజుల గడువిచ్చింది. ఆ గడువులోగా వారేం చేస్తారన్నది చూడాలి. అదీగాక- అవకాశాలు వినియోగించుకోవాలంటూ ఏ దోషినీ తొందరపెట్టరాదు" అని బెంచ్ పేర్కొంది.

## 'అల్ ఖైదా' అల్-రిమిని మట్టుబెట్టిన అమెరికా



వాషింగ్టన్, ఫిబ్రవరి 7: ఉగ్రవాద సంస్థ అల్ ఖైదా అరేబియా ద్వీపకల్ప విభాగం నాయకుడు ఖాసీం అల్-రిమీని అమెరికా హతమార్చింది. యెమెన్‌లో తమ బలగాలు చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో అతన్ని మట్టుబెట్టినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే ఈ ఆపరేషన్ ఎప్పుడు, ఎలా జరిగిందో వెల్లడించలేదు. అమెరికా సైనిక స్థావరాలపై దాడులు, దౌత్య అధికారి హత్యకు కుట్రలో రిమి హస్తం ఉంది. గత ఏడాది డిసెంబరులో ఫ్లోరిడాలోని నేవీ స్థావరంపై దాడి అతని పథకమే.

## మోసపూరిత ప్రకటనలిస్తే భారీ జరిమానా, జైలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: తమ ఉత్పత్తులు వాడితే ఆయా సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయంటూ వివిధ కంపెనీలు ప్రకటనలు ఇస్తుంటాయి. అయితే ఈ ప్రకటనల్ని నమ్మినవారు వాటిని వాడి.. ఎటువంటి ప్రయోజనం లేదని మొర పెట్టుకుంటే మాత్రం ఆయా కంపెనీలు తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలను ఇలాంటి మోసపూరిత ప్రకటనల నుంచి కాపాడేందుకు డ్రగ్స్ అండ్ మేజిక్ రెమెడీస్ (అభ్యంతరం చెప్పదగిన ప్రకటనల) చట్టం-1954ను కఠినతరం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ చట్టానికి సవరణలు చేస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ముసాయిదాను ప్రవేశపెట్టనుంది. దీని ప్రకారం.. మోసపూరిత ప్రకటనలు ఇచ్చే కంపెనీలపై తొలిసారి అయితే రూ.10 లక్షల జరిమానా విధించడంతోపాటు రెండేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. అదే కంపెనీ మరోసారి ఇలాంటి ప్రకటన ఇస్తే జరిమానా రూ.50 లక్షల వరకు పెంచడంతోపాటు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తారు.

## మందు, మహిళ, వయాగ్రా!.. దవీందర్ లీలలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఉగ్రవాదులకు సాయం చేస్తూ పట్టుబడిన కశ్మీర్ డీఎస్పీ దవీందర్ సింగ్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దవీందర్ అరెస్టు సందర్భంగా ఎన్ఐఏకు ఉత్తర, దక్షిణ కశ్మీర్‌లో లభించిన ఆధారాలు, రికార్డులు, సీజ్ చేసిన వస్తువుల ద్వారా బయట పడిన ఈ పోలీసు ఉగ్రవాది నిర్వాకాలు దిగ్భ్రాంతి గొలుపుతున్నాయి. అతడు ఎవరి మాటా వినేవాడు కాదని, ఏ ఇంటెలిజెన్స్ సంస్థకూ పని చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించే వాడని తెలిసింది. ఎన్ఐఏ అధికారులు ఓ ప్రైవేటు టీవీ చానెల్‌కు తెలిపిన వివరాల ప్రకారం.. 12 మంది మహిళలతో లైంగిక సంబంధాల కోసం దవీందర్ విచ్చలవిడిగా ఖర్చు చేసేవాడు. సెక్స్‌కు బానిస అయిన అతడు వయాగ్రా కూడా వినియోగించేవాడు. తన ప్లేబాయ్ లైఫ్ స్టయిల్‌ను కొనసాగించేందుకు డబ్బును మంచి నీళ్లలా ఖర్చు చేసేవాడు. సింగ్ ఫోన్ మెసేజ్‌లు, హిజ్బుల్ కమాండర్ నవీద్ బాబు, అతడి ఇద్దరు అనుచరులకు సాయం చేశాడని ఇప్పటి వరకు తేలింది. అయితే, దేశ వ్యతిరేక కార్యకలాపాలతో దవీందర్‌కు ఏమైనా సంబంధాలున్నాయా? అనే విషయాన్ని ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది.

## ముఫ్తి, ఒమర్ అక్రమ నిర్బంధం నీచం: చిద్దూ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఎలాంటి అభియోగాలు దాఖలు చేయకుండా అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్యంలో చాలా నీచమైన పని అని కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం అన్నారు. జమ్మూకశ్మీరు మాజీ ముఖ్యమంత్రులు మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాను పౌర భద్రతా చట్టం(పీఎస్ఏ) కింద నిర్బంధించడాన్ని ఆయన తప్పుబట్టారు.

## కేజ్రీవాల్ పాలన భేష్: శివసేన ప్రశంసలు

ముంబై, ఫిబ్రవరి 7: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ పాలనపై శివసేన ప్రశంసల వర్షం కురిపించింది. గత ఐదేళ్లుగా ఆయన బ్రహ్మాండమైన పాలన అందించారని పొగిడింది. ఎంతో ఆదర్శవంతంగా పనిచేస్తున్న కేజ్రీవాల్ అభివృద్ధి నమూనాను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించాలని శివసేన అభిప్రాయపడింది. సేన పార్టీ పత్రిక 'సామనా'లో రాసిన సంపాదకీయంలో కేజ్రీవాల్‌పై ప్రశంసల జల్లు కురిపించింది. అదే సమయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాని దుయ్యబట్టింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో గెలిచేందుకు హిందువులు-ముస్లింల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించే పనిలో కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు ఉన్నారని శివసేన ఆరోపించింది.



## 'నాసా' రమ్మన్నా.. ససేమిరా!

**బిహార్ యువ ఆవిష్కర్త దేశభక్తి**

పట్నా, ఫిబ్రవరి 7: అతడి పేరు గోపాల్ జి (19). బిహార్ రాష్ట్రం భాగల్పూర్ జిల్లా ధ్రువ్‌గంజ్ వాసి. నిరుపేద కుటుంబం. చదివింది ప్రభుత్వ బడి. అయినా, తన మేధో వికాసానికి అవేమీ అడ్డంకులు కాలేదు. టీనేజీ దాటకుండానే రెండు ఆవిష్కరణల (అరటితో ప్రయోగాలు, పేపర్ బయో సెల్స్)కు పేటెంట్లు సాధించాడు. పదో తరగతిలో ఉండగా ఇన్‌స్పైర్ పురస్కారం పొందాడు. తర్వాత అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ప్రోత్సాహంతో మరో మూడు, నాలుగు ఆవిష్కరణలు సృష్టించాడు. దీంతో గోపాల్‌ను అమెరికా శాస్త్రవేత్తలు సంప్రదించారు. 'నాసా' ఆఫర్ ఇచ్చింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. కానీ, తన సేవలు భారత్‌కే సొంతమంటూ తిరస్కరించాడు. మోటివేషనల్ స్పీకర్‌గా, డిజిటల్ ఎడ్యుకేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్నాడు. గోపాల్.. డెహ్రాడూన్‌లో బీటెక్ చదువుతున్నాడు.

## 'బుల్లెట్'.. హెల్మెట్




ఇది అత్యాధునిక సైనిక హెల్మెట్. ఏకే-47 బుల్లెట్ 10 మీటర్ల దూరంలో ఉండగానే సైనికులు స్పష్టంగా చూడగలిగేలా దీన్ని కాలేజ్ ఆఫ్ మిలటరీ ఇంజనీరింగ్ అభివృద్ధి చేసింది. లఖ్‌నవూలో జరుగుతున్న 11వ డిఫెన్స్ ఎక్స్‌పోలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

- లఖ్‌నవూ(యూపీ)

# ఢిల్లీ ఓటరు ఎటు?



శనివారం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలో ఈవీఎం యంత్రాలతో పోలింగ్ సిబ్బంది

- సంక్షేమమా? భావోద్వేగమా?
- నేడే పోలింగ్.. ఆప్ వైపే సర్వేల మొగ్గు!
- పౌరసత్వ చట్టానికి ఇది రెఫరెండం?
- కాంగ్రెస్ పోటీ నామమాత్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. శనివారం ఉదయం 7 గంటలకు ఓటింగ్ మొదలవుతుంది. మొత్తం 70 సీట్లకు జరిగే ఎన్నికల్లో 672 మంది అభ్యర్థుల భవితను 1.47 కోట్ల మంది ఓటర్లు తేల్చనున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఢిల్లీని చేజారనివ్వరాదని మోదీ, అమిత్ షా భావిస్తుండడంతో ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. కేజ్రీవాల్ పూర్తిగా తన పరిపాలన, సంక్షేమ పథకాలపైనే ఆధారపడితే మోదీ, అమిత్ షా పూర్తిగా భావోద్వేగ అంశాలపైనే ఆధారపడి ప్రచారం చేశారు. తొలుత కేంద్రంలోని తమ పాలన, విజయాలను ఏకరువు పెట్టిన బీజేపీ... తరువాత పంథా మార్చి సీఏఏను ప్రధాన ప్రచారాంశం చేసింది. అమిత్ షా అన్ని సభల్లోనూ పౌరసత్వ చట్టం, షాహీన్ బాఘ్ లో జరుగుతున్న నిరసన ప్రదర్శనల గురించే మాట్లాడారు. దీంతో ఈ ఎన్నికలు సీఏఏపై రెఫరెండమా... అన్న చర్చ జరుగుతోంది. దీనికి తోడు- బీజేపీ తన సీఎం అభ్యర్థి ఎవరన్నది ప్రకటించకపోవడం కేజ్రీవాల్ పదే పదే సవాల్ విసరడానికి తావిచ్చింది. పేరుకు ముక్కోణపు పోటీ అయినప్పటికీ కాంగ్రెస్ కేవలం నామ్ కే వాస్తేగా బరిలో నిలిచింది తప్ప పెద్దగా ప్రచారం జరిపింది లేదు. సర్వేల తీరు చూస్తే ఆమ్ ఆద్మీ పార్టీయే మళ్లీ జయకేతనం ఎగురవేయవచ్చని స్పష్టమవుతోంది. ఇప్పటికప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఓటేస్తారని ప్రశ్నించినపుడు 45.4 శాతం మంది ఆప్ వైపే మొగ్గు చూపినట్లు ఐఏఎన్ఎస్-సీఓటర్ సర్వే వెల్లడించింది. కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని మార్చాలా అన్న ప్రశ్నకు అవసరం లేదని 58.1 శాతం మంది, మార్చాలని 39.2 శాతం మంది ఓటేశారు. సీఎంగా కేజ్రీవాలే ఉండాలని 60.2 శాతం మంది కోరుకొనగా, బీజేపీ తరపు అభ్యర్థికి కేవలం 27.9 శాతం మంది ఓటేశారు. కాగా.. ఈశాన్య ఢిల్లీలోని జాఫ్రాబాద్‌లో సీఏఏ వ్యతిరేక వేదిక సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు తుపాకీతో గాల్లో కాల్పులు జరిపి కలకలం సృష్టించారు.

### కోవెలకెళ్లిన కేజ్రీకి ఈసీ నోటీసు

కాగా, పోలింగ్ జరగడానికి ఇంకా 24 గంటలుండగా అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం నాడు భార్య సునీతతో కలిసి కన్నాట్ ప్లేస్‌లోని ఓ హనుమాన్ దేవాలయానికి వెళ్లి పూజలు చేశారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ ఆయనకు నోటీసిచ్చింది. కోడ్ ప్రకారం.. ఎన్నికల ప్రచార సమయంలో గానీ, ముగిశాక గానీ కులం, మతం పేరిట ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష విజ్ఞప్తులూ చేయరాదు. దాని ఆధారంగా ఈ నోటీసిచ్చింది. కాగా, బీజేపీ నేత కూడా కోవెలకు వెళ్లి పూజలు చేశారు.

### సిసోడియా ఓఎస్డీ అరెస్టు

ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) గోపాల్‌కృష్ణ మాధవ్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. మాధవ్ తరఫున ధీరజ్ గుప్తా అనే మధ్యవర్తి.. రవాణాదారుల నుంచి రూ.2.26 లక్షలను లంచం రూపంలో స్వీకరిస్తున్నాడని సమాచారం అందడంతో మాధవ్‌ను అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. గుప్తాను అధికారులు ప్రశ్నించగా మాధవ్, ఇతర జీఎస్టీ అధికారుల కోసం లంచం స్వీకరించానని చెప్పాడు. సిసోడియా స్పందిస్తూ.. మాధవ్‌కు కఠినశిక్ష విధించాలని ట్వీట్ చేశారు. సిసోడియాకు తెలియకుండా మాధవ్ లంచం స్వీకరించడం సాధ్యం కాదని బీజేపీ ఆరోపించింది.

## లోక్‌సభలో ఉద్రిక్తత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: లోక్‌సభలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు కొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. వైద్య కళాశాలల ఏర్పాటు గురించి రాహుల్‌గాంధీ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు లేచిన హర్షవర్ధన్.. ముందుగా తానొక ప్రకటన చేయాలనుకుంటున్నానన్నారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ చేసిన విపరీతమైన వ్యాఖ్యలను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నానంటూ ఆ ప్రకటన చదవడం ప్రారంభించారు. స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని.. చెప్పాల్సిన సమాధానానికే పరిమితం కావాలని సూచించారు. అయినా మంత్రి తన ప్రకటనను చదవడం కొనసాగించారు. రాహుల్ గాంధీ తండ్రి రాజీవ్‌గాంధీ కూడా ప్రధానిగా వ్యవహరించారని.. ఎలాంటి పరిస్థితుల్లోనూ తమ పార్టీ నేతలు ఈ తరహా వ్యక్తిగత, విపరీత వ్యాఖ్యలు రాజీవ్‌పై చేయలేదని, కర్రలతో కొడతామని, దేశం నుంచి తరిమేస్తామని అనలేదని పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ ఎంపీ మాణికం టాగూర్... హర్షవర్ధన్ వైపు దూసుకెళ్లారు. యూపీకి చెందిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ టాగూర్ చేతిని గట్టిగా పట్టుకుని ఆపేశారు. దీంతో కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ హిబి ఈడెన్ జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఉద్రిక్తంగా మారుతుండడంతో ఇరు వర్గాల ఎంపీలు.. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీతో సహా అక్కడికి చేరుకుని వారిని వారించారు. పరిస్థితి శ్రుతిమించడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ మొదలయ్యాక.. హర్షవర్ధన్‌పై కాంగ్రెస్ సభ్యులు దాడికి యత్నించడాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఖండించారు. కాగా, రాహుల్, అధిర్ రంజన్ చౌధరి, ప్రహ్లాద్ జోషి, హర్షవర్ధన్ వేర్వేరుగా స్పీకర్‌ను కలిశారు. మోదీ తనను ఉద్దేశించి చేసిన 'ట్యూబ్‌లైట్' వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని పదవికి ఒక స్థాయి, వ్యవహరించే పద్ధతి ఉంటాయని.. వాటికి తగినట్లుగా మోదీ వ్యవహరించట్లేదని విమర్శించారు.

### మోదీ వ్యాఖ్యలను తొలగించిన వెంకయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అభ్యంతరకర పదాలు వాడితే ప్రధాని ప్రసంగంలోంచి కూడా అలాంటి పదాలను తొలగించేందుకు సిద్ధమేనని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు నిరూపించారు. రాజ్యసభలో ప్రధాని మోదీ, కాంగ్రెస్ పక్ష నేత ఆజాద్, కాంగ్రెస్ నేత హరిప్రసాద్ వాడిన కొన్ని పదాలను రికార్డుల నుంచి తొలగించాలని వెంకయ్య నాయుడు శుక్రవారం ఆదేశించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై గురువారం మోదీ, ఆజాద్ చేసిన ప్రసంగాల్లో వాడిన పదాలను రికార్డుల నుంచి తొలగించారు. హరిప్రసాద్ ప్రసంగంలోంచి ఒక పదాన్ని తొలగించారు.



## బోడో ఒప్పందంతో అసోంలో నవోదయం

**ప్రధాని మోదీ**

కోక్రాఝార్ (అసోం), ఫిబ్రవరి 7: బోడో శాంతి ఒప్పందంతో అసోంలో నవోదయం జరిగిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రజల మద్దతు వల్లే ఈ ఒప్పందం కుదిరిందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి, అభివృద్ధి కోసం కలిసి పనిచేయాల్సిన సమయమిది అని సూచించారు. ఇక హింసను అనుమతించబోమని స్పష్టం చేశారు. జనవరి 27న బోడో తిరుగుబాటుదారులతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. దాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోక్రాఝార్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. బోడో తిరుగుబాటుదారుల నుంచి ఈశాన్య ప్రాంతంలోని తీవ్రవాదులు, జమ్మూ కశ్మీరులోని మిలిటెంట్లు, మావోయిస్టులు స్ఫూర్తి పొందాలని, జన స్రవంతిలో కలవాలని మోదీ సూచించారు. "తాజా ఒప్పందం సమాజంలో అన్ని వర్గాల ప్రజల విజయం. దీని వల్ల ఎవరూ నష్టపోరు. ఒప్పందం తర్వాత ఏ డిమాండ్ మిగల్లేదు" అని అన్నారు.

## దిగువ కోర్టుల్లో జడ్జిలకు వేతనాలు భారీగా పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దిగువ కోర్టుల్లోని జడ్జిలు, న్యాయాధికారులకు శుభవార్త. వారి వేతనాలు గణనీయంగా పెరగనున్నాయి. జాతీయ జ్యుడీషియల్ వేతన కమిషన్ తన రెండో నివేదికను ఇటీవల సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి సమర్పించింది. సవరించిన వేతనభత్యాల ప్రకారం ప్రస్తుతం రూ.27,700 ప్రారంభ జీతం ఉన్న జూనియర్ సివిల్ జడ్జి/ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్‌కు ఇక 77,840 లభిస్తుంది. సీనియర్ సివిల్ జడ్జికి ప్రారంభ వేతనం రూ.1,11,000, జిల్లా జడ్జికి 1,44,840 లభిస్తుంది. జిల్లా జడ్జి గరిష్ఠ వేతనం రూ.2,24,100గా నిర్ణయించారు. సవరించిన వేతన, పెన్షన్‌ను 2016 జనవరి 1 నుంచి వర్తింపచేస్తారు. తాత్కాలిక భృతిని సర్దుబాటు చేశాక ఈ ఏడాదిలోనే వేతన బకాయిలు చెల్లిస్తారు. ఈ వేతన సవరణ కమిషన్‌కు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పి. వెంకట్రామరెడ్డి చైర్మన్‌గా ఉన్నారు.

## కశ్మీర్‌లో ఆర్నెళ్లలో 200 పైగా పనులు

జమ్ము, ఫిబ్రవరి 7: కశ్మీర్‌లో అభివృద్ధి పనులు చకచకా పూర్తవుతున్నాయి. ఆర్టికల్ 370 రద్దయిన ఈ ఆరు నెలల్లో జమ్ము కశ్మీర్ మౌలిక వసతుల అభివృద్ధి నిధుల సంస్థ (జేకేఐడీఎఫ్‌సీ) ఆధ్వర్యంలో 200 పనులు పైనే పూర్తవగా.. రాబోయే రెండు నెలల్లో వెయ్యి వరకు అందుబాటులోకి రానున్నాయి. వీటి విలువ దాదాపు రూ.2,250 కోట్లు కావడం విశేషం. మొత్తమ్మీద జేకేఐడీఎఫ్‌సీ.. రూ.5,963 కోట్లతో రోడ్లు, తాగునీటి పథకాలు, విద్యుత్ లైన్లు, క్రీడా మైదానాలు నిర్మిస్తోంది.

## భారత్‌లో 'మిక్స్‌డ్ మోడ్' విస్తరణ: గూగుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లాలనుకుంటే ప్రస్తుతం ప్రజలు ఎక్కువగా ఆధారపడుతున్నది 'గూగుల్ మ్యాప్స్' పైనే. ఆ మ్యాప్స్ ఇప్పటివరకు గమ్యం చేరుకునేందుకు ఉన్న వీలైనన్ని మార్గాలనే చూపుతున్నాయి. ఇకపై మిగతా మార్గాల్లోనూ ఏమేం రవాణా సౌకర్యాలున్నాయి? ఆటోలో వెళ్తే ఎంత సమయం పడుతుంది? ఇతర రవాణా ఎంచుకుంటే ఎంతసేపు అవుతుంది? రానుపోనుకు ఏ స్టేషన్‌లో మనం వాహనాన్ని తీసుకోవచ్చు? అనే విషయాలు సూచిస్తుంది. ఈ మేరకు ఢిల్లీ, బెంగళూరులో అందుబాటులో ఉన్న 'మిక్స్ మోడ్ కమ్యూట్' ఆప్షన్‌ను భారత్‌లోని మిగతా నగరాలకూ విస్తరించనున్నట్లు 'గూగుల్ మ్యాప్స్' 15వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ ఉపాధ్యక్షుడు ఫిట్జ్ ప్యాట్రిక్ తెలిపారు. ప్రస్తుతానికి ఇది ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులకే అందుబాటులోకి రానుంది. కాగా.. గూగుల్ మ్యాప్స్‌లోని 14 ఫీచర్లలో 8 భారత్‌లోనే ప్రారంభించామని ఫిట్జ్ పేర్కొన్నారు.

## వూహాన్‌లో 80 మంది విద్యార్థులు

న్యూఢిల్లీ, బీజింగ్, ఫిబ్రవరి 7: కరోనా వైరస్‌కు కేంద్రస్థానమైన వూహాన్‌లో ఇంకా 80 మంది దాకా భారతీయ విద్యార్థులున్నారని విదేశాంగ మంత్రి జైశంకర్ రాజ్యసభలో ప్రకటించారు. ప్రభుత్వం తరలింపు ఆపరేషన్ చేపట్టినప్పుడు.. వారిలో 70 మంది అక్కడే ఉండడానికి ఇష్టపడ్డారని వివరించారు. మిగతా పది మందీ భారత్‌కు తిరిగి వచ్చేయడానికి సిద్ధపడ్డా.. అక్కడ విమానాశ్రయంలో జరిపిన స్ర్కీనింగ్ పరీక్షల్లో విఫలమవడంతో రాలేకపోయారని వెల్లడించారు. చైనాలో ఉన్న భారత రాయబారకార్యాలయం ఈ 80 మందితోనూ ఎప్పటికప్పుడు మాట్లాడుతోందని మంత్రి చెప్పారు. అటు జపాన్‌లో క్వారంటైన్‌గా మార్చిన 'డైమండ్ ప్రిన్సెస్' నౌక సిబ్బందితో పాటు నౌకలోనూ భారతీయులు ఉన్నారని జైశంకర్ తెలిపారు. టోక్యోలోని భారతీయ రాయబార కార్యాలయం నుంచి ఇప్పటిదాకా వచ్చిన సమాచారం మేరకు వారెవరికీ వైరస్ సోకలేదని వివరించారు. తమ పౌరులను చైనా నుంచి తరలించాల్సిందిగా పాకిస్థాన్ ఏమైనా కోరిందా అని బీజేపీ నామినేటెడ్ ఎంపీ రూపా గంగూలీ వేసిన ప్రశ్నకు మంత్రి జవాబు చెప్పారు. "ఇక్కడి నుంచి రెండు ఎయిరిండియా విమానాలు బయల్దేరే ముందు.. భారతీయ విద్యార్థులనే కాక మన పొరుగుదేశాలకు చెందిన విద్యార్థులందరినీ తీసుకొస్తామని చెప్పాం. కానీ మాల్దీవులు మాత్రమే ఆ ఆఫర్‌ను వినియోగించుకుంది" అని వివరించారు. కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ కూడా కరోనా వైరస్‌పై శుక్రవారం రాజ్యసభలో సుమోటోగా ఒక ప్రకటన చేశారు. జనవరి 18 నుంచి ఇప్పటిదాకా 1275 విమానాల్లో వచ్చిన 1,39,539 మంది పేషెంట్లకు థర్మల్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించామని చెప్పారు. చైనా నుంచి భారత్‌కు వస్తున్న విదేశీయులందరి వీసాలనూ ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే.. విదేశాల నుంచి వచ్చేవారందరికీ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, క్వారంటైన్ వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలని దేశంలోని 12 ప్రధాన పోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో ఇప్పటిదాకా 1232 మంది కరోనా పరీక్షలు నిర్వహించగా.. 1199 మందికి నెగెటివ్ అని తేలిందని, ముగ్గురికి పాజిటివ్ రాగా, మరో ముప్ఫై నమూనాలకు పరీక్షలు నిర్వహిస్తున్నారని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. మరోవైపు.. ఢిల్లీ నుంచి పుణెకు వెళ్తున్న విమానంలో ఒక చైనీయుడు వాంతులు చేసుకోవడంతో అతణ్ని క్వారంటైన్‌కు తరలించి పరీక్షలు చేస్తున్నారు. కాగా.. కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ తయారుచేసే ప్రయత్నంలో ఉన్న 'కామన్వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఆస్ట్రేలియా) శాస్త్రజ్ఞుల బృందానికి ఎస్.ఎస్.వాసన్ అనే భారతీయుడు నాయకత్వం వహిస్తున్నారు.

### 6000 జంటలు ఒక్కటైన వేళ

అసలే కరోనా వైరస్ ముప్పు! ఎక్కువ మంది ఒక చోట చేరితే ఏమవుతుందో అన్న భయం!! అలాంటి భయాలన్నింటినీ అధిగమించి దక్షిణకొరియాలో 6 వేల జంటలు ఇలా వివాహ బంధంతో ఒక్కటయ్యాయి. నిర్వాహకులు జంటలన్నింటికీ మాస్కులు ఇచ్చినా.. తీరా పెళ్లి జరిగే సమయానికి చాలా మంది మాస్కులు తీసేశారు. కొన్ని జంటలు మాత్రం మాస్కుల ధరించే ఉంగరాలు మార్చుకున్నాయి.



### ప్రజాయుద్ధం

కరోనా వైరస్ మృతుల సంఖ్య 637కు చేరింది. ఒక్క గురువారంనాడే 73 మంది మరణించారని చైనా జాతీయ హెల్త్ కమిషన్ తెలిపింది. ఇక, ఈ వైరస్ గురించి ముందే హెచ్చరించి.. ఆ వైరస్‌కే బలైపోయిన వైద్యుడు లీ వెన్‌లియాంగ్ మృతికి చైనా సంతాపం తెలిపింది. ఆయన కుటుంబసభ్యులకు దాదాపు రూ.83 లక్షలు పరిహారంగా ప్రకటించింది. వైరస్‌పై పోరుకు ప్రజాయుద్ధాన్ని ప్రారంభించింది.

# అసలుకే ఎసరు!

(మొదటి పేజీ తరువాయి)

అందించారు. అంతేకాక రంజాన్ పర్వదినం ముందు మసీదులకు రంగులు వేసుకునేందుకు ప్రతి మసీదుకు రూ.6 వేల చొప్పున సాయం అందించేవారు. రంజాన్ తోఫా కింద ఆరు రకాల సరుకులను రేషన్ దుకాణాల నుంచి తెల్ల కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి అందించారు. దుకాణ్ ఔర్ మకాన్ పథకం కింద పేద ముస్లింలకు లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం కల్పించారు. దుల్హన్ పథకం కింద పేద ముస్లిం నవవధువులకు రూ. లక్ష వరకు సాయం చేశారు. విదేశీ విద్య కింద పేద ముస్లిం విద్యార్థులకు రూ.10 లక్షల వరకు సాయం అందించేవారు. అయితే, కొత్తగా ఏర్పడిన జగన్ సర్కార్ ఈ పథకాలన్నింటికీ మంగళం పాడింది. ఇమామ్, మౌజన్‌లకు ఆరేడు మాసాలుగా గౌరవ వేతనాలు అందడం లేదు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడు మాసాలుగా ఏ ఒక్కరికీ గౌరవ వేతనం విడుదల కాలేదని పలువురు ఇమామ్‌లు, మౌజన్‌లు ఆవేదన చెందుతున్నారు. రోజూ బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాలను పరిశీలించుకొని, వేతనాలు పడకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. నాలుగేళ్లపాటు టీడీపీ ప్రభుత్వం తమకు గౌరవవేతనాలు అందించిందని, ఇప్పుడు వైసీపీ సర్కార్ తమను నిర్లక్ష్యం చేస్తోందని వారు వాపోతున్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో 11 మసీదుల ఇమామ్‌లు, మౌజన్లకు టీడీపీ హయాంలో రూ.31.36 లక్షలు. మచిలీపట్నంలోని 23 మసీదుల ఇమామ్‌లు, మౌజన్లకు సుమారు రూ.68.48 లక్షలు గౌరవవేతనంగా అందించారు. అయితే ఏడు నెలలుగా ఒక్క పైసా రాలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ జామియా మసీద్ అసోసియేషన్‌కు ఇమామ్, మౌజన్ల గౌరవవేతనం నిమిత్తం ప్రతినెలా రూ.8వేలు అసోసియేషన్ అకౌంట్‌కు జమ అయ్యేది. 2019 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 10 నెలల కాలానికి పాత విధానంలో రూ.80,000 జమ కావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.48,000 మాత్రమే జమయింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు జీతాలు చెల్లించేందుకు అసోసియేషన్ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పెంచిన గౌరవ వేతనాలు అవసరం లేదని, పాత విధానంలోనే సక్రమంగా చెల్లింపులు చేయాలని ఇమామ్‌లు, మౌజన్లు కోరుతున్నారు.

### అన్నీ ఆపేశారు

గత ప్రభుత్వం ముస్లింలకు వర్తింపజేసిన అన్ని సంక్షేమ పథకాలను వైసీపీ సర్కార్ నిలిపివేసింది. ఇమామ్, మౌజన్లకు గౌరవవేతనం రెట్టింపు చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అసలుకే ఎసరు పెట్టారు. గొల్లపూడిలో షాదీఖానా నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.17 కోట్లు మంజూరు చేసి భూమి పూజ కూడా చేసింది. ప్రస్తుతం ఆ పనులు నిలిపివేశారు. మైనారిటీలంటే ఈ సర్కార్‌కు చిన్నచూపు అని వారి పనుల బట్టే అర్థమవుతోంది.

- షేక్ చక్రబాబు(ఖాసిం), గొల్లపూడి, కృష్ణాజిల్లా

### ముస్లింలకు చేసింది శూన్యం

వైసీపీ ప్రభుత్వం ఏడు నెలల కాలంలో ముస్లింలకు చేసింది శూన్యం. మైనారిటీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామన్న జగన్, గత ప్రభుత్వం అమలు చేసిన అన్ని పథకాలను రద్దు చేయడం విడ్డూరంగా ఉంది. రంజాన్ తోఫానే ఇవ్వలేని ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం నిధులు ఇస్తుందంటే నమ్మశక్యంగా లేదు.

- షేక్ సుభాని, మైలవరం, కృష్ణాజిల్లా

### నిధులు విడుదల చేయాలి

వైసీపీ ప్రభుత్వం ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇంత వరకు విడుదల చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వం నెలనెలా ఇచ్చేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఇప్పటికీ గౌరవ వేతనాల ఊసే లేదు. వెంటనే గౌరవ వేతనాలు విడుదల చేయాలి.

-అబ్దుల్ వహీద్, జామా మసీదు ఇమామ్, మచిలీపట్నం

# వద్దన్నా.. ముందుకే!



- యూనిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై పురపాలక శాఖ ధోరణి
- మీరైనా ఆపాలని సీఎంకు ఉపాధ్యాయుల అభ్యర్థన
- రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు శ్రీకారం

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల్లో ఒకటి రెండు తప్ప మిగిలినవన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ మున్సిపల్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ నిబంధనల(యూనిఫైడ్ సర్వీస్ రూల్స్)ను అమల్లోకి తెచ్చేందుకే పురపాలక శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొద్ది రోజుల కింద దీనికి సంబంధించిన ఫైలు ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరిందని, అతి త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయన్న సమాచారంతో మున్సిపల్ ఉపాధ్యాయులు నిరసన బాట పట్టారు. విశాఖపట్నం, గుంటూరు, ఏలూరు, విజయనగరం తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ పట్టణ స్థానిక సంస్థల్లో ఈ అంశంపై పోరాడేందుకు సంయుక్త కార్యాచరణ సమితి(జేఏసీ)లను ఏర్పాటు చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ పాఠశాలల్లో ఈ నెల 10, 11 తేదీల్లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలుపాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనను తీవ్రతరం చేయనున్నట్లు ఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ తెలిపారు.

### దుష్ఫలితాలపై హెచ్చరిక

ఈ నిబంధనలపై పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఇటీవల నిర్వహించిన సమావేశంలో మొత్తం 23 ఉపాధ్యాయ సంఘాల్లో ఏకంగా 21 సంఘాలు రూల్స్‌పై ఆక్షేపణ వ్యక్తం చేశాయి. వాటి వల్ల తలెత్తబోయే విపరిణామాలను వివరించాయి. ఉపాధ్యాయులకే కాకుండా మున్సిపల్ విద్యారంగానికి కూడా తీవ్ర నష్టం తప్పదని నేతలు చెప్పారు. ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోకుండా అన్ని వర్గాలకూ చేటు చేసే ఈ రూల్స్‌ను అమలులోకి తెచ్చేందుకు మాత్రం ఉన్నతాధికారులు దుందుడుకు ధోరణితో ముందుకు వెళ్తుండడం సమంజసం కాదని చెప్పారు. ఈ నిబంధనల అమలుతో వేలాదిమంది ఉపాధ్యాయులు సీనియారిటీని కోల్పోవడంతోపాటు ఇతర కష్టనష్టాలకు గురవుతారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో వందలాదిమంది మున్సిపల్ ఉపాధ్యాయులు తాము కోరుకున్న చోట్లకు బదిలీలు పొంది, అక్కడే స్థిరపడే ప్రయత్నాల్లో ఉన్నారని పేర్కొన్నారు. పైగా మున్సిపాలిటీల్లో పని చేసే అధికారులు, ఉద్యోగులెవరికీ వర్తింపజేయకుండా కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే నిబంధనలను అమలు పరచాలనుకోవడంలో హేతుబద్ధత లేదని తెలిపారు.

### కార్పొరేట్ హస్తంపై సందేహాలు

ఉన్నతాధికారుల తీరు వెనుక ఏదన్నా కుతంత్రం ఉందేమోనన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ విద్యారంగాన్ని దెబ్బ తీయడం ద్వారా తాము ప్రయోజనం పొందాలన్న కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు, కొందరు వ్యక్తులు దీని వెనుక ఉండవచ్చునని సందేహిస్తున్నారు. సీఎం జగన్ అయినా వాస్తవాలను గ్రహించి, ఉత్తర్వుల ప్రక్రియను అడ్డుకోవాలని సంఘాలు కోరుతున్నాయి.

# 3 ఒక రాష్ట్రం రాజధానులు

## 'అమరావతి' తరలింపును అడ్డుకోండి

▸▸ కేంద్ర మంత్రి గడ్కరీతో ఎంపీలు జయదేవ్, నాని భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): "అమరావతి రాజధాని తరలింపును అడ్డుకోవాలని, కొత్తగా ఏర్పడిన అమరావతిని మూడు ముక్కలు చేస్తూ ఏపీ ప్రజల జీవితాలతో సీఎం జగన్ ఆటాడుకుంటున్నారు" అని టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నాని అన్నారు. శుక్రవారం కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ వారు అయ్యారు. ఈ సందర్భంగా అమరావతి తరలింపు నిర్ణయం తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. జగన్మోహన్‌రెడ్డి తొందరపాటు నిర్ణయాలవల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోందన్నారు. అన్యాయంగా విభజించబడుతున్న అమరావతి రాజధాని పట్ల రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన రైతులు కూడ మద్దతిస్తున్నట్లు మంత్రికి తెలిపారు. అమరావతి రాజధాని కావాలన్న ఉద్దేశంతోనే ప్రధాని మోదీ ఆనాడు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాజధాని మార్పును అడ్డుకోకపోతే 29,174 మంది చిన్న, సన్నకారు రైతుల జీవితాలను, జీవనోపాధిని కోల్పోనున్నారని మంత్రికి తెలియజేశారు.


మందడం నుంచి వెలగపూడికి ర్యాలీగా వెళుతున్న మహిళలు


తాళ్లాయపాలెం వద్ద కృష్ణమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు


కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న అమరావతి జేఏసీ నాయకులు

# సీఎం మనసు మారాలి

**మసీదులో రైతుల ప్రార్థనలు.. రాయపూడి గ్రామ దేవతకు ముస్లిం మహిళల పొంగళ్లు.. కృష్ణమ్మకు సారె సమర్పణ**

▸▸ 52వ రోజు కొనసాగిన ఆందోళనలు

గుంటూరు, తుళ్లూరు, మంగళగిరి, తాడికొండ, ఫిబ్రవరి 7: "రాజధాని కోసం బంగారం పండే భూములు త్యాగం చేశాం.. ప్రతిపక్షనేతగా జగన్ కూడా 30వేల ఎకరాలు కావాలని చేసిన ప్రకటన తరువాత ఎంతోమంది భూములు ప్రభుత్వానికి అప్పగించారు. నేడు మీరంటున్న మూడు రాజధానుల వల్ల ఆర్థికభారం తప్ప ఎవరికి ప్రయోజనం" అంటూ అమరావతి ప్రాంత రైతులు నిలదీశారు. అమరాతినే కొనసాగించాలని కోరుతూ 52వ రోజు ఆందోళనలు కొనసాగించారు. తుళ్లూరు, మందడంలో మహాధర్నా నిర్వహించగా, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. సీఎం జగన్ మనసు మార్చాలంటూ తుళ్లూరు రైతులు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాయపూడి ముస్లిం మహిళలు బొడ్డురాయికి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామదేవత పోలేరమ్మకు దళిత, ముస్లిం మహిళలు పొంగళ్లు పెట్టి, పూజలు నిర్వహించారు. రాయపూడి కృష్ణా ఘాట్‌లో వెలగపూడి రైతులు జలదీక్ష నిర్వహించారు. కృష్ణమ్మకు చీరె, సారె సమర్పించి, హారతులు ఇచ్చారు. పెదపరిమిలో పెద్దసంఖ్యలో రైతులు, మహిళలు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని మౌనంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. వెలగపూడి దీక్షా శిబిరంలో యువరైతులు తాడికొండ శ్రీకర్, బొర్ర రవిచంద్ర చేపట్టిన 151 గంటల నిరాహార దీక్ష ముగిసింది. విద్యార్థి జేఏసీ అధ్యర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఫిలించాంబర్ ఎదురుగా నిరసన తెలపనున్నారు. మందడంలో మహిళలు, రైతులు చేస్తున్న దీక్షకు మాజీమంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు సంఘీభావం తెలిపారు. మందడంలో 3వ తరగతి విద్యార్థి ఎర్రమనేని వరుణ్‌సాయి 24గంటల నిరాహార దీక్ష చేశారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట జేఏసీ నేతలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 41వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను టీడీపీ నేత మాకినేని పెదరత్తయ్య ప్రారంభించారు. పెనుమాకలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు 52వ రోజుకు, తాడికొండ అడ్డరోడ్డులో రైతులు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు 35వ రోజుకు చేరుకున్నాయి. నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు, పెదవడ్లపూడి గ్రామాల్లో రిలే నిరసన దీక్షలు శుక్రవారంతో 52వ రోజుకు చేరాయి. అఖిల పక్ష జేఏసీ ఆధ్వర్యంలో మంగళగిరి పాతబస్టాండు వద్ద రిలే దీక్షలు కొనసాగాయి. కాగా, రాజధాని సమస్యపై సీఎంతో భేటీకి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణరెడ్డి నకిలీ రైతులను, వైసీపీ కార్యకర్తలను తీసుకువెళ్లారని టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బ్రహ్మంచౌదరి ఆరోపించారు. రాయచోటి ప్రజలు అమరావతి కోసం బైక్ ర్యాలీ ఎందుకు చేశారని ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అమరావతి ముద్దు.. వికేంద్రీకరణ వద్దు అంటూ అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో నిర్వహించిన ర్యాలీలో 4వేల మందికి పైగా మహిళలు, యువకులు పాల్గొన్నారు. విద్యాధరపురం నుంచి కబేళా వరకు జరిగిన ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, జేఏసీ నేతలు గద్దె తిరుపతిరావు, సుంకర పద్మశ్రీ, పోతిన వెంకట మహేశ్, బొమ్మసాని సుబ్బారావు, పి.దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.


రాయపూడి గ్రామ దేవతకు పొంగళ్లు తీసుకెళ్తున్న ముస్లింలు

## స్వరూపానందకు రాజధాని సెగ

గుంటూరు, ఫిబ్రవరి 7: విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామీజీకి అమరావతి నిరసన సెగ తగిలింది. వెంకటేశ్వర రిలీజియన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవస్థానం 18వ వార్షికోత్సవంలో అతిథిగా పాల్గొనేందుకు ఆయన శుక్రవారం గుంటూరు విచ్చేశారు. గుడి నుంచి బయటకు వస్తున్న ఆయనకు అమరావతి జేఏసీ మహిళలు వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించారు. 'జగన్ సీఎం కావాలని మీరు ఏడాది పాటు మీ ఆశ్రమంలో యాగం చేశారుగా.. అమరావతే రాజధానిగా ఉండాలని యాగం చేయండి' అని స్వరూపానందకు విజ్ఞప్తి చేశారు. ఆయన మౌనంగా కారెక్కి కూర్చున్నప్పటికీ మహిళలు పదేపదే విజ్ఞప్తి చేశారు.



## మేడారం జాతరకు..

తుళ్లూరు, ఫిబ్రవరి 7: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతినే కొనసాగేలా చూడాలని తెలంగాణ అమ్మవార్లు సమ్మక్క, సారలమ్మలను కోరేందుకు రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలు మేడారం జాతరకు పయనమయ్యారు. మేడారం జాతర నేపథ్యంలో సమక్క, సారలమ్మలను దర్శించుకుని మొక్కు చెల్లించుకుంటామని చెబుతున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేలా అనుగ్రహించిన సమ్మక్క, సారలమ్మ మహిమగల దేవతలని.. అందుకే అమరావతినే రాజధానిగా కొనసాగేలా చూడమని వారిని మొక్కుకునేందుకు వెళ్తున్నామని మేడారం బయల్దేరిన అనుమోలు అమ్మాజీ అనే మహిళా రైతు తెలిపారు. ఇక్కడి నుంచి బస్సుల్లో 40 మంది మేడారం జాతరకు వెళ్తున్నట్టు పేర్కొన్నారు. సమ్మక్క, సారలమ్మలు కచ్చితంగా తమ కోరిక నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


అనుమోలు అమ్మాజీ

## ఆగిన మరో గుండె

మంగళగిరి క్రైమ్, ఫిబ్రవరి 7: రాజధాని అమరావతి కోసం మరో రైతు గుండె ఆగింది. రాజధాని తరలిపోతుందనే ఆ వేదనతో గుంటూరు జిల్లా మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన చింతా చంద్రశేఖర్(65) గుండెపోటుతో మృతిచెందారు. రాజధాని కోసం చంద్రశేఖర్ తనకున్న 1.55 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారు. కాగా.. సీఎం జగన్ 3 రాజధానుల ప్రకటన చేసినప్పటి నుంచి ఆయన తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రోజూ రిలే నిరసన దీక్షల్లో పాల్గొంటూ అమరావతి కోసం ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గుండెపోటుకు గురయ్యారు. మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు.


చింతా చంద్రశేఖర్

## రాజధాని రైతులూ..
# ప్రాణత్యాగాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అర్థమవుతున్నాయి, మీ విజ్ఞాపన పత్రం పరిశీలించి తగు విధంగా స్పందిస్తా' అని అన్నారు. ఆందోళన చేస్తున్న రైతులకు ధైర్యం చెప్పాలని జేఏసీ నేతలకు సూచించారు. మహిళా రైతులు గత 52 రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నట్లు రైతు ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకురాగా.. 'ఇన్నాళ్లుగా మహిళలు ఉద్యమిస్తున్నారా' అని రాష్ట్రపతి అన్నట్లు జేఏసీ వర్గాలు తెలిపాయి.

### ఇప్పటికే పది వేల కోట్ల ఖర్చు..

రాజధాని అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలను భూసమీకరణ కింద ఇచ్చారని.. వారికి అభివృద్ధి చేసిన నివాస, వాణిజ్య స్థలాలిచ్చేందుకు ప్రభుత్వం ఒప్పందాలు కూడా కుదుర్చుకుందని గల్లా జయదేవ్ రాష్ట్రపతికి తెలిపారు. 'ప్రధాని మోదీ రాజధానికి శంకుస్థాపన చేశారు. దానిని రాజధానిగా నోటిఫై కూడా చేశారు. కేంద్రం కూడా భారత చిత్రపటంలో ఆంధ్ర రాజధానిగా దానిని పొందుపరచింది. ఇప్పటికి దాదాపు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశారు' అని ఆయన, రైతు, జేఏసీ ప్రతినిధులు శివారెడ్డి, శ్రీనివాసరావు, ఆర్‌వీ స్వామి, మెహతా ప్రభృతులు వివరించినట్లు సమాచారం. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం అమరావతిని 3 రాజధానుల పేరుతో విశాఖపట్నం తరలించాలని నిర్ణయం తీసుకుందని.. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత వస్తోందని తెలిపారు. నిరసనలు, ర్యాలీలు, ఆందోళనలు జరుగుతున్నాయని తెలియజేసినట్లు తెలిసింది. 'ప్రధానంగా అమరావతి ప్రాంతంలో రైతులు, మహిళలు, పిల్లలు కుటుంబాలతో రోడ్లపైకి వచ్చి శాంతియుతంగా నిరసనలు, ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం పోలీసులను ఉసిగొలిపి ఆందోళనకారులపై దాడులు చేయిస్తోంది. అరెస్టులు చేస్తున్నారు. రాజధాని మార్పు నిర్ణయం వల్ల తీవ్ర మానసిక ఒత్తిళ్లకు లోనై ఇప్పటివరకు 30 మంది రైతులు మృతి చెందారు' అని వెల్లడించారు. ఆ సందర్భంలో రాష్ట్రపతి జోక్యం చేసుకుని.. 'ధైర్యంతో ఉండాలని రైతులకు చెప్పండి' అని సూచించినట్లు తెలిపారు. ఉద్యమకారులపై పోలీసుల లాఠీచార్జీలకు సంబంధించిన ఫొటోలను చూపించారు.

### మా వేదనంతా రాష్ట్రపతి విన్నారు

'మా వేదనంతా రాష్ట్రపతి సానుకూలంగా విన్నారు. దాదాపు 20 నిమిషాలపాటు సమయం కేటాయించి.. రాజధాని సమస్యపై ఆసక్తిని చూపారు. తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు' అని పరిరక్షణ సమితి నేతలు శివారెడ్డి, శ్రీనివాసరావు, జీవీ స్వామి మీడియాకు తెలిపారు. ఈ సమావేశం సంతృప్తి కలిగించిందన్నారు. భూములిచ్చిన రైతులు, రాజధాని తరలిపోతుందన్న బాధతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి లోనై గుండెపోటుతో 25 మంది మరణించిన విషయంపై ఆయన తన సానుభూతిని తెలిపారని చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో ప్రధాని మోదీ, హోం మంత్రి షాను కూడా కలుస్తామన్నారు. ఆర్‌వీ స్వామి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడు తూ.. పోలీసుల దాడుల ఫొటోలు చూసి రాష్ట్రపతి ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు.

### 'అమరావతి' తరలింపును అడ్డుకోండి

రాజధాని తరలింపును అడ్డుకోవాలని, రాజధానిని 3 ముక్కలు చేస్తూ రాష్ట్ర ప్రజల జీవితాలతో సీఎం జగన్ ఆడుకుంటున్నారని టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్, కేశినేని నాని అన్నారు. జేఏసీ నేతలతో కలిసి వారిద్దరూ శుక్రవారం కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు. అమరావతి తరలింపును అడ్డుకోవాలని కోరారు. సీఎం నిర్ణయం తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఆయనకు నివేదించారు. అమరావతిని కాపాడడంతోపాటు శాసనమండలి రద్దు నిర్ణయం విషయంలో కూడా కేంద్రం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. అమరావతి పరిరక్షణ సమతి నేతలు, రైతు ప్రతినిధులు గడ్కరీకి వినతి పత్రం సమర్పించారు. కేంద్రంతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు.

## బిల్లు పెట్టినప్పుడే వికేంద్రీకరణ మొదలైంది

▸▸ తరలింపుపై కోర్టు ఆదేశాలను గౌరవిస్తాం

▸▸ తొలగించిన పెన్షన్లపై రీసర్వే: మంత్రి బొత్స



అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడే వికేంద్రీకరణ ప్రక్రియ మొదలైందని, ఎప్పటికి ముగుస్తుందో ఇప్పుడే చెప్పలేనని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. సచివాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇది తమ ప్రభుత్వ విధానమని, పరిపాలన సౌలభ్యం కోసం వికేంద్రీకరణ జీవోలు జారీ చేస్తుంటామని చెప్పారు. చట్టాలకు లోబడి కోర్టులు పనిచేస్తాయని, తాము కోర్టుకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. తరలింపు అంశంలో కోర్టు ఆదేశాలను గౌరవిస్తామన్నారు. నిబంధనల ప్రకారమే పనులు జరుగుతాయన్నారు. విజిలెన్స్ కమిషన్ ఫలానా చోటే ఉండాలని ఏ చట్టంలో ఉందని మంత్రి ప్రశ్నించారు. కార్యాలయాలు ఎక్కడ పెట్టాలనేది ప్రభుత్వ ఇష్టమన్నారు. శ్రీబాగ్ ఒప్పందాన్ని అప్పటి పెద్దలు అమలు చేయలేదు కాబట్టే ఇప్పుడు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. భూమికి బదులు భూమి ఇవ్వమని రాజధాని రైతులు కోరగా, పరిశీలిస్తామని సీఎం చెప్పినట్టు వివరించారు. రాష్ట్రంలో అనర్హులుగా గుర్తించిన 4,16,034 మంది పెన్షనర్లను అర్హులుగా నిర్ధారణ అయితే వారికి కూడా పించన్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్టు బొత్స తెలిపారు. ఉమ్మడి కుటుంబాలు, జాయింట్ కరెంటు మీటర్లు లాంటి కారణాలను తిరిగి పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్రం నుంచి కియ, ఇతర పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరు దుష్ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి అసత్య వార్తలు, అవాస్తవ కథనాలు రాస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

## మిలీనియంలో సచివాలయం నిబంధనలకు విరుద్ధం

▸▸ డీ నోటిపై చేయాలి... కేంద్ర అనుమతీ ఉండాలి

▸▸ బీజేపీ నేతలు విశ్వనాథరాజు, రవీంద్ర విమర్శ



విశాఖపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): "విశాఖపట్నంలో సచివాలయం కోసం ఎంపిక చేసిన మిలీనియం టవర్‌లో నిబంధనలకు విరుద్ధంగా పను లు జరుగుతున్నాయి. మిలీనియం టవర్ రుషికొండ ఐటీ సెజ్‌లో ఉంది. అ క్కడ ఐటీయేతర కార్యక్రమాలు నిర్వహించాలంటే... ఆ ప్రాంతాన్ని డీ నోటిఫై చేయాల్సి ఉంది. దీనికి కేంద్రం అనుమతి ఉండాలి" అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశీ విశ్వనాథరాజు, నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆ సెజ్ కోసం కేంద్రం ఇప్పటివరకు ఇచ్చిన రాయితీలు, ఇతర నిధులు అన్నీ వెనక్కి తిరిగి చెల్లిస్తేనే డీ నోటిఫికేషన్‌కు అనుమతి వస్తుందన్నారు. ఆ ప్రక్రియ ఏదీ పూర్తికాకుండా ఐటీ పార్కులో సచివాలయం ఏర్పాటు పనులు చేయడం నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. విశాఖపట్నంలో పేదలకు ఇళ్ల స్థలం అంటూ ల్యాండ్ పూలింగ్ చేస్తున్నారని, స్థలం ఇస్తే... అందులో ఇళ్లు ఎవరు నిర్మిస్తారని ప్రశ్నించారు. వివిధ పథకాల పేరిట పేద ప్రజలకు ఎంగిలి మెతుకుల్లా నిధులు వెదజల్లుతున్నారని ఆరోపించారు. మద్యం ధరలను పెంచేసి కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆ మొత్తమే నెలకు రూ.500 కోట్ల వరకు అందుతోందని తెలిపారు. తాజాగా సిమెంట్ ధర బస్తాకు రూ.230 నుంచి రూ.330కి పెంచేశారన్నారు. వీటిలోనూ వైసీపీ నేతలకు వాటాలు అందుతున్నాయని ఆరోపించారు.

## ద్వారకా తిరుమలకు మహిళల పాదయాత్ర



చింతలపూడి, ఫిబ్రవరి 7: 'ఒకే రాజధాని కావాలి. అది అమరావతే అవ్వాలి' అంటూ పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం అంకులే కొత్తగూడేనికి చెందిన మహిళలు ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లారు.

# దారితోచని కేంద్ర సంస్థలు!

▸▸ మూడుతో ముక్కలైన అంచనాలు

▸▸ కింకర్తవ్యమంటూ లోలోన వేదన

▸▸ అమరావతి బ్రాండ్ మెచ్చి వచ్చిన మిగిలిన సంస్థలదీ ఇదే దుస్థితి

▸▸ శ్రీవారి ఆలయం పనులు బంద్

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అమరావతి బ్రహ్మాండమైన బ్రాండ్ అనేది నిర్మాణాలు పూర్తి చేసుకోకముందే ప్రపంచం గుర్తించింది. ఇలాంటి అంచనాలతోనే ప్రతిష్ఠాత్మకమైన ఎన్నో సంస్థలు రాజధానిలో తమ శాఖలు, విభాగాలను ప్రారంభించేందుకు ముందుకొచ్చాయి. భూమి రేటు ఎక్కువా తక్కువా అనేది కాకుండా తమ కార్యాలయాలు రాజధానిలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆసక్తి ప్రదర్శించాయి. అప్పటి ప్రభుత్వం నుంచి 130 కేంద్ర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు 1293 ఎకరాలు తీసుకొన్నాయి. వాటిలో కొన్ని సంస్థలు నిర్మాణాలను కొనసాగిస్తున్నాయి. మరికొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. మంగళగిరి ఎయిమ్స్ రెండేళ్ల క్రితమే ప్రారంభమయి..తాజాగా అత్యాధునిక వైద్య యంత్రాలను కూడా సమకూర్చుకొంది. ఇంకొన్ని కీలక సంస్థలు తాము పొందిన భూముల్లో నిర్మించబోయే భవంతులకు సంబంధించిన ప్లాన్లకు ఉన్నతాధికారులు, సంబంధిత సంస్థల నుంచి అనుమతులు పొందాయి. మూడు చోట్ల రాజధానుల్లో భాగంగా అమరావతి రాజధానిని విశాఖకు తరలించాలన్న జగన్ ప్రభుత్వం నిర్ణయం భూములిచ్చిన రైతులను నట్టేట ముంచితే.. గంపెడు అంచనాలతో అడుగుపెట్టిన ఈ సంస్థలనూ అగమ్యగోచర పరిస్థితికి గురిచేస్తోంది. ఇలాంటి పరిస్థితంటూ ఒకటి వస్తుందని తాము కలలో సైతం అనుకోలేదని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు, బాధ్యులు ప్రైవేట్ సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు దేశంలోని పలు ఇతర రాష్ట్రాలు కూడా విడిపోయి, కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అయితే వాటిల్లో ఒక్కదానిలో కూడా రాజధాని విషయంలో అమరావతి మాదిరి విచిత్ర పరిస్థితి తలెత్తలేదని వారు పేర్కొంటున్నారు. ముందటి ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వారు తిరగదోడకుండా, వాటికే కట్టుబడి ఉండడంతో ఆయా రాజధానుల్లో ఎక్కడా తమ కార్యాలయాలు, శాఖలను ఏర్పాటు చేయడంలో ఎటువంటి ఇబ్బందులు గానీ, సందిగ్ధతను గానీ ఎదుర్కొనలేదని గుర్తు చేస్తున్నారు. అయితే అమరావతిలో అందుకు పూర్తిగా భిన్నమైన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇతర రాష్ట్రాల రాజధానుల మాదిరిగా కాకుండా అమరావతి పూర్తి గ్రీన్ ఫీల్డ్ సిటీగా, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమవుతుందన్న నమ్మకంతో తదనుగుణంగానే అందులో తమ కార్యాలయాలు, సిబ్బంది నివాస సముదాయాలను నిర్మించేందుకు ప్రణాళికలను రచించుకున్నామంటున్నారు. ఏదో తమ కార్యాలయం ప్రారంభించామంటే ప్రారంభించామని కాకుండా, అమరావతి స్థాయికి తగినట్లుగా రూపొందించేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమై, భూములను కేటాయించాల్సిందిగా కోరగా, గత టీడీపీ ప్రభుత్వం స్పందించిందని చెబుతున్నారు.

### బ్యాంకుల నుంచి భక్తి దాకా..

ఎకరాకు రూ.25 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు చెల్లించి.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వరకు పలు సంస్థలు ఇక్కడ భూములు కొనుగోలు చేశాయి. ఇలా మొత్తంమీద సుమారు రూ.450 కోట్లకు పైగా సంస్థలు వెచ్చించాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, సీపీడబ్ల్యూడీ, ఎస్డీపీవో, బీఐఎస్, తపాలా, నావికాదళం, ఎఫ్‌సీఐ, ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నాబార్డ్, కాగ్, రైట్స్, ఫోరెన్సిక్, ఎన్ఐఏసీ, హెచ్‌పీసీఎల్, సిండికేట్ బ్యాంక్, ఏపీఎన్నార్టీ, ఆప్కాబ్, హెచ్‌సీఎల్.. వంటి ఎన్నో సంస్థలు భూములను కొనుగోలు చేశాయి. వీటిలో అత్యధికం ఆయా భూముల్లో తమ కార్యాలయ భవనాలను నిర్మించేందుకు అనువైన ప్లాన్లను సైతం సిద్ధం చేసుకుని, సంబంధిత అనుమతులను కూడా పొందాయి. బయో డైవర్సిటీ మ్యూజియం, ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మ్యూజియం వంటి ప్రదర్శనశాలల ఏర్పాటుకు కూడా చంద్రబాబు ప్రభుత్వం భూములను కేటాయించింది.

### శ్రీవారి ఆలయం: అంతా అనిశ్చితే

తిరుమలలోని శ్రీవారి ఆలయం తరహాలో అమరావతిలో కోవెలను నిర్మించేందుకు టీటీడీకి అప్పటి ప్రభుత్వం 25 ఎకరాలు ఇచ్చింది. కొన్ని నెలల కిందట పనులను కూడా ప్రారంభించారు. అయితే వైసీపీ ప్రభుత్వ ప్రాధాన్యతలు మారిన దృష్ట్యా ఈ పనులు ఆగిపోయాయి. దీంతో అసలు శ్రీవారి ఆలయ నిర్మాణం జరుగుతుందా? లేదా? అని శ్రీవారి భక్తులు ఆవేదన చెందుతున్నారు.

### ఆతిథ్యం: ఇక అంతేనా!

అమరావతికి భవిష్యత్తులో సందర్శకులు, పర్యాటకుల సందడి గణనీయంగా పెరుగుతుందన్న అంచనాతో దేశ, విదేశాలకు చెందిన ఎన్నో ప్రముఖ హోటల్ గ్రూపులు రాజధానిలో హోటళ్ల నిర్మాణానికి భూములను పొందాయి. ఈ సంస్థల్లో కొన్ని ఇప్పటికే తమకు కేటాయించిన భూములను నిర్మాణానికి అనువుగా చదును, మెరక చేయించడమే కాకుండా నిర్మాణాలకు అవసరమైన సాయిల్ టెస్ట్‌లను సైతం చేయించాయి. అయితే, ఇప్పుడు తలలు పట్టుకుంటున్నాయి.

### ఎయిమ్స్: ఏమయ్యేనో!

ప్రత్యక్షంగా అమరావతిలో లేనప్పటికీ దానికి అత్యంత చేరువలో ఉన్న మంగళగిరి వద్ద కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మితమవుతున్న ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్). ఈ సంస్థ పరిస్థితి కూడా డోలాయమానంలో పడనుంది. వందలాది కోట్ల రూపాయలతో రాష్ట్రానికే మణిమకుటంగా రూపొందుతున్న ఈ జాతీయస్థాయి వైద్య సంస్థ రాష్ట్రంలోని మధ్యభాగాన ఉన్నందున దాని సేవలను అన్ని ప్రాంతాల వారూ సులభంగా పొందగలుగుతారని భావించారు. రాజధాని నగరానికి కొద్ది కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్న దీని ద్వారా భవిష్యత్తులో అమరావతి, విజయవాడ, గుంటూరులలో భారీఎత్తున పెరగబోయే జనాభాకు అత్యంత నాణ్యమైన వైద్యసేవలందగలవని అనుకున్నారు. రాజధాని ముక్కలైనట్లయితే సహజంగానే రాష్ట్ర ప్రజలు పూర్తిస్థాయిలో ఎయిమ్స్ సేవలు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడవచ్చునన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

### విద్యారంగం: ఏదీ దారి!

రాజధాని నగరంలో పలు ప్రఖ్యాత ప్రైవేట్ విద్యాసంస్థలు స్థలాలు పొందాయి. వాటిల్లో ఎస్ఆర్ఎం, విట్ వంటివి ఇప్పటికే భవనాలను నిర్మించి, గత మూడేళ్లుగా తరగతులను సైతం నిర్వహిస్తున్నాయి. ఈ రెండింట్లో కలిపి 10,000 మందికిపైగా పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అమృత, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్(ఎన్ఐడీ) తదితరాలు నిర్మాణాలను చురుగ్గా కొనసాగిస్తున్నాయి. సీఐటీడీ, ఏపీహెచ్చార్డీసీ, బీఆర్ శెట్టి, నిఫ్ట్, రెండు కేంద్రీయ విద్యాలయాలు, జేవియర్, ఎల్వీపీఈఐ, హెరిటేజ్, ఓక్‌రిడ్జ్ తదితర సంస్థలు నిర్మాణాలను చేపట్టేందుకు సమాయత్తమయ్యాయి. ఇలాంటివి ఇంకా మరెన్నో ఉన్నాయి.



## వైసీపీ ర్యాలీలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు

శృంగవరపుకోట ఫిబ్రవరి 7: విశాఖ రాజధానికి మద్దతుగా విజయనగరం జిల్లా ఎస్.కోటలో వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. హాజరైన వారిలో ఎక్కువ మంది మండల పరిషత్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లే ఉన్నారు. మండల పరిషత్ పరిపాలన అధికారి రమాదేవి ముందుండి నడిపించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశాల మేరకే హాజరైనట్టు అధికారులు, ఉద్యోగులు చెబుతున్నారు. కాగా ఓ పార్టీ చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది.

## రాజధాని నుంచి
# ఐదు గ్రామాలు ఔట్

**ఉండవల్లి, పెనుమాక, ఎర్రబాలెం, నవులూరు, బేతపూడి తొలగింపు**

▸▸ మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీల్లో విలీనం

▸▸ 'అమరావతి' రైతుల్లో చీలిక తెచ్చే ఎత్తు

▸▸ హైకోర్టును ఆశ్రయించనున్న రైతులు!

అమరావతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నగర పరిధి నుంచి ఐదు గ్రామాలు.. ఉండవల్లి, పెనుమాక, ఎర్రబాలెం, నవులూరు, బేతపూడిలను రాష్ట్రప్రభుత్వం తొలగించింది. వాటిని తాడేపల్లి, మంగళగిరి పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఈ చర్య వెనుక కుట్ర దాగి ఉందని ఆయా గ్రా మాల ప్రజలు మండిపడుతున్నారు. రాజధాని తరలింపును తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. 8 వారాలుగా ఉద్ధృతంగా సాగుతున్న ఆందోళనలను దెబ్బతీసే దురుద్దేశంతోనే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని విమర్శిస్తున్నారు. ఈ గ్రామాల సత్వర అభివృద్ధి కోసమే రాజధాని పరిధి నుంచి తొలగించి మున్సిపాలిటీల్లో చేర్చామని పురపాలక అధికారులు చె బుతున్నా.. అందులో ఏ మాత్రం వాస్తవం లేదని గ్రామస్థులు స్పష్టంచేస్తున్నారు. రాజధాని నగర పరిధిలోని 29 గ్రామాలకు మరో 3 పంచాయతీలను కలిపి.. అమరావతి కేపిటల్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్ (ఏసీసీఎంసీ) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెబుతూ.. వాటిలో 5 గ్రామాలను ఆకస్మికంగా తొలగించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తమవుతోంది. అమరావతిని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఈ పనిచేశారన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి.

### రాజధానిలో ఆ గ్రామాలు 30%

రాజధాని అమరావతి నగర పరిధిలోని 29 గ్రామాల్లో జనాభా, విస్తీర్ణ పరంగా చూస్తే ఉండవల్లి, పెనుమాక, ఎర్రబాలెం, నవులూరు, బేతపూడి గ్రామాల వాటా సుమారు 30 శాతం ఉంటుంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాజధాని నిర్మాణానికి భూసమీకరణ ప్రక్రియను వ్యతిరేకించిన రైతుల్లో అత్యధికులు ఈ గ్రామాలకు చెందిన వారే. అయినప్పటికీ రాజధానిని అమరావతి నుంచి తరలించాలన్న జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గత 55 రోజులుగా జరుగుతున్న ఆందోళనల్లో వీరు కూడా క్రియాశీలంగా పాల్గొంటున్నారు. ఉద్యమకారుల్లో చీలికలు తెచ్చి.. నిరసనల తీవ్రతను తగ్గించేందుకు వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పటి వరకూ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పైగా 3 ముక్కల రాజధానిని వ్యతిరేకిస్తూ అమరావతి పరిధితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింతగా విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆందోళనలకు కేంద్రస్థానంగా ఉన్న రాజధాని గ్రామాల్లోనే వాటిని దెబ్బతీస్తే, రాష్ట్రంలోనూ తగ్గుముఖం పడతాయని ప్రభుత్వం తలపోస్తోందని అంటున్నారు. అందులో భాగంగానే పెనుమాక, ఉండవల్లిని తాడేపల్లి మున్సిపాలిటీలో.. బేతపూడి, ఎర్రబాలెం, నవులూరులను మంగళగిరి పురపాలక సంఘంలో చేర్చిందని సమాచారం! ఈ నిర్ణయంతో ఆయా గ్రామాల ప్రజలను అమరావతి నగరం నుంచి విడదీస్తే.. అమరావతి పరిరక్షణోద్యమాన్ని దెబ్బ తీయడం సులభమని అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఎత్తుగడలో భాగంగానే.. ఇటీవల మంగళగిరి, తాడికొండ వైసీపీ ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఉండవల్లి శ్రీదేవి రాజధాని రైతుల పేరిట కొందరు వైసీపీ కార్యకర్తలను ముఖ్యమంత్రి జగన్ వద్దకు తీసుకెళ్లారు. వారితో ఈ 5 గ్రామాలను అమరావతి నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేయించారు. అమరావతి మనుగడే ప్రశ్నార్థకంగా మారినందున తమ గ్రామాలను దాని పరిధి నుంచి తొలగించాలని వారే స్వచ్ఛందంగా అడిగినట్లుగా చూపించి.. ఆ మేరకు వాటిని తప్పించేలా చేశారు. కాగా.. ప్రభుత్వ పన్నాగంపై హైకోర్టులో సవాల్ చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.

epaper.andhrajyothy.com

| పాకిస్థాన్ x బంగ్లాదేశ్ |
|---|
| తొలి టెస్ట్-రెండో రోజు |
| ఉ.10.30 నుంచి |
| సోనీ-ఈఎస్‌పీఎన్‌లో... |

| భారత్ x ఆస్ట్రేలియా |
|---|
| మహిళల టీ-20 |
| ఉ. 6.40 నుంచి |
| సోనీ సిక్స్, సోనీ టెన్-3ల్లో... |



# ఫైనల్లో వారియర్స్

## పీబీఎల్ సెమీస్‌లో చెన్నైపై గెలుపు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్ జట్టు తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మొదటి సెమీస్‌లో నార్త్ ఈస్ట్రన్ వారియర్స్ 3-(-1)తో చెన్నై సూపర్‌స్టార్స్‌ను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో లి యంగ్ డే-కిమ్ హ న జంట 15-12, 9-15, 15-14తో సుమీత్ రెడ్డి-జెస్సికా పగ్ జంటపై గెలిచి వారియర్స్‌కు శుభారంభం అందించింది. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌లో లి చక్ యు 15-12, 15-12తో టామీ సుగియార్తోపై నెగ్గి వారియర్స్‌ను 2-0 ఆధిక్యంలో నిలిపాడు. చెన్నై ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల డబుల్స్‌లో నార్త్ ఈస్ట్రన్ ద్వయం 15-13, 14-15, 15-10తో సుమీత్ రెడ్డి-ధ్రువ్ కపిలపై నెగ్గి విజయాన్ని అందించారు. ట్రంప్ మ్యాచ్ ఓడిపోవడంతో చెన్నై ఖాతాలో పాయింట్ కోతపడింది. వారియర్స్ గెలుపు ఖరారు కావడంతో మిగిలిన మహిళల, పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లు జరగలేదు.

## 'ఆసియా బ్యాడ్మింటన్' నుంచి వైదొలగిన భారత మహిళల జట్టు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా భారత మహిళల జట్టు ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్ నుంచి వైదొలగింది. అయితే, పురుషుల జట్టు మాత్రం టోర్నీలో పోటీపడుతుందని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) శుక్రవారం ప్రకటించింది. ఆసియా చాంపియన్‌షిప్ ఈనెల 11 నుంచి 16 వరకు పిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరగనుంది. కరోనా వైరస్ శరవేగంగా ఇతర దేశాలకు కూడా వ్యాప్తి చెందుతోందన్న వార్తలు వెలువడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బాయ్ తెలిపింది.

## హర్మన్‌ప్రీత్ సేన మరో ఓటమి

**మెల్‌బోర్న్:** బ్యాటింగ్ వైఫల్యంతో మహిళల టీ20 ముక్కోణపు సిరీస్‌లో భారత్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలైంది. ఈ విజయంతో ఇంగ్లండ్ ఫైనల్ ఆశలు మరింత మెరుగుపరచుకోగా.. భారత్ పరిస్థితి దిగజారింది. ఆస్ట్రేలియాతో శనివారం జరిగే ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన నెగ్గినా టైటిల్‌ఫైట్‌కు చేరుకొనే అవకాశాలు తక్కువే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 123 పరుగులు చేసింది. ష్రబ్‌సోల్ 3 వికెట్లు పడగొట్టింది. ఓపెనర్ స్మృతి మంధాన (45) టాప్ స్కోరర్ కాగా.. జెమీమా రోడ్రిగ్స్ 23 పరుగులు చేసింది. ఛేదనలో నటాలి స్కివర్ (50) అర్ధ శతకంతో ఇంగ్లండ్ 18.5 ఓవర్లలో 124/6 స్కోరు చేసి నెగ్గింది. రాజేశ్వరి గైక్వాడ్ (3/23) మూడు వికెట్లు దక్కించుకొంది.

## బంగ్లాదేశ్ 233 ఆలౌట్

**రావల్పిండి:** పేసర్ షహీన్ షా అఫ్రీది (4/53) విజృంభించడంతో పాకిస్థాన్‌తో శుక్రవారం మొదలైన తొలి టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 233 పరుగులకే ఆలౌటైంది. మహ్మద్ మిథున్ (63) అర్ధ శతకం చేయగా.. నజ్ముల్ హొస్సేన్ (44), లిటన్ దాస్ (33), కెప్టెన్ మోమినుల్ హక్ (30) పర్లేదనిపించారు. మహ్మద్ అబ్బాస్, హారిస్ సొహైల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

# సిరీస్‌లో నిలుస్తారా?

## ఒత్తిడిలో భారత్ ● నేడు కివీస్‌తో రెండో వన్డే

**ఐదు టీ20ల సిరీస్‌ను ఏకపక్షంగా ముగించిన భారత్‌కు తొలి వన్డేలో ఊహించని షాకే తగిలింది. భారీ స్కోరు చేసినా న్యూజిలాండ్ అవలీలగా ఛేదించి బోణీ కొట్టింది. ఇక ఇప్పుడు రెండో వన్డేలో ఒత్తిడంతా భారత్‌పైనే.. సిరీస్‌లో నిలవాలంటే ఈ మ్యాచ్ ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదు. బ్యాటింగ్ బలంగానే ఉన్నా బౌలింగ్, ఫీల్డింగ్ మాత్రం స్థాయికి తగ్గట్టుగా లేకపోవడంతో తొలి మ్యాచ్‌లో మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు ఆ పొరపాట్లకు తావీయకుండా కివీస్‌కు ఝలక్ ఇవ్వాలనుకుంటోంది. అటు తమ వన్డే చరిత్రలోనే అత్యధిక పరుగుల ఛేదనతో ఆతిథ్య జట్టు ఫుల్ జోష్‌లో ఉంది. ఇదే జోరుతో మ్యాచ్‌తో పాటు సిరీస్‌నూ పట్టేసి పొట్టి ఫార్మాట్‌లో పరాభవానికి బదులు తీర్చుకోవాలనుకుంటోంది.**


ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

విరాట్ కోహ్లీ

**ఆక్లాండ్:** స్వదేశంలో భారత్ ఆడిన చివరి రెండు వన్డే సిరీస్‌ల్లోనూ తొలి మ్యాచ్ ఓడినా చివరకు 2-1తో వాటిని గెలుచుకుంది. ఇప్పుడు కివీస్ గడ్డపై కూడా కోహ్లీ సేనకు అలాంటి పరిస్థితే ఎదురైంది. తాజా మూడు వన్డేల సిరీస్‌లో అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే నేడు (శనివారం) ఈడెన్ పార్క్‌లో జరిగే రెండో మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. మరోవైపు టీ20 సిరీస్‌లో భాగంగా ఇక్కడే జరిగిన తొలి రెండు మ్యాచ్‌లను భారత్ గెలవడం సానుకూలాంశం. అందుకే ఇక్కడి ట్రాక్ రికార్డును ఆసరా చేసుకుని సిరీస్‌ను సమం చేయాలనుకుంటోంది. అయితే తొలి వన్డేలో అద్భుత విజయం అందుకున్న కివీస్ మాత్రం సిరీస్‌ను గెలుచుకునే సదవకాశాన్ని వదులుకోవద్దనుకుంటోంది. భారత్ తిరిగి పోటీలోకి రాకుండా ఉండేందుకు ఇక్కడే సిరీస్‌ను ముగించాలనే పట్టుదలతో ఉంది.

**బౌలింగ్, ఫీల్డింగ్ మెరుగుపడాల్సిందే..:** సిరీస్‌లో కీలక మ్యాచ్ కావడంతో కెప్టెన్ కోహ్లీ తమ బౌలర్ల ప్రదర్శన మెరుగవ్వాలనుకుంటున్నాడు. బుమ్రా స్థాయికి తగ్గట్టు పరుగులను కట్టడి చేస్తున్నా మిగతా వారి నుంచి సహకారం అందడం లేదు. ముఖ్యంగా శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్‌లను కివీస్ బ్యాట్స్‌మెన్ లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీంతో వికెట్ల కోసం కెప్టెన్ ప్రతీసారి బుమ్రా వైపు చూడాల్సి వస్తోంది. అందుకే బుమ్రాపై అధిక భారం పడకుండా బౌలింగ్‌లో మార్పులు చేసే అవకాశం ఉంది. ఠాకూర్ స్థానంలో సైనీని, కుల్దీప్ స్థానంలో చాహల్‌లను తీసుకోవచ్చు. ఇక ఫీల్డింగ్ కూడా దారుణంగా ఉంది. కివీస్‌లో గాలులు ఎక్కువగా ఉండడంతో ఎత్తు నుంచి వచ్చే క్యాచ్‌లను అందుకోవడం అంత సులువు కాదు. ఇక జట్టులో కేదార్ జాదవ్ ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. తొలి వన్డేలో బౌలర్లు విఫలమైనా జాదవ్‌తో ఒక్క ఓవర్ కూడా వేయించలేదు. ఇప్పుడు ఈ చిన్న మైదానంలో అతడి బౌలింగ్ అవసరం కూడా లేదు. దీంతో అతడినే కొనసాగిస్తారా.. శివమ్ దూబే లేక స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గా మనీశ్ పాండేలలో ఒకరిని ఆడిస్తారా అనేది చూడాలి. బ్యాటింగ్‌లో కోహ్లీ, రాహుల్, శ్రేయాస్ అదరగొడుతుండగా కొత్త ఓపెనర్లు పృథ్వీ షా, మయాంక్ ఎక్కువసేపు క్రీజులో నిలవాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

**4-4**

ఈడెన్ పార్క్‌లో భారత్ ఆడిన 9 వన్డేల్లో నాలుగు విజయాలు, నాలుగు పరాజయాలుండగా.. ఓ మ్యాచ్ టై అయింది. భారత్ చివరిసారిగా ఇక్కడ 2003లో గెలిచింది.

**దూకుడుగా కివీస్:** తమ బౌలింగ్‌లో భారత బ్యాట్స్‌మెన్ భారీగా పరుగులు రాబట్టినా కివీస్ బ్యాటింగ్ ఆర్డర్ దీటుగా బదులిచ్చింది. గప్టిల్, నికోల్స్ శుభారంభానికి మిడిలార్డర్‌లో టేలర్, లాథమ్ సుడిగాలి ఇన్నింగ్స్ ఆ జట్టుకు అద్భుత విజయాన్ని అందించింది. ముఖ్యంగా వెటరన్ టేలర్ ఫామ్ భారత్‌కు ఇబ్బందికరమే. రెగ్యులర్ కెప్టెన్ విలియమ్సన్ ఈ మ్యాచ్‌కు కూడా దూరం కానున్నాడు. అనారోగ్యం కారణంగా పేసర్ కుగెలిన్ ఈ మ్యాచ్‌లో ఆడేది అనుమానమే. అలాగే కివీస్ 'ఎ'కు ఆడనున్న స్పిన్నర్ ఇష్ సోధీ స్థానంలో స్థానిక పేసర్ కైల్ జేమిసన్ అరంగేట్రం చేయనున్నాడు.

# అతడు నాలాగే ఆడుతున్నాడు

**లబుషేన్‌కు సచిన్ ప్రశంస**



**సిడ్నీ:** ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ లబుషేన్ తనలాగే ఆడుతున్నాడని దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ ప్రశంసించాడు. 'లబుషేన్ వేగంగా ఎదుగుతున్న బ్యాట్స్‌మన్. అతడిలో ప్రత్యేక ప్రతిభ ఉంది. అతడి ఫుట్‌వర్క్ అద్భుతం. అతడి బ్యాటింగ్ నా శైలిని తలపిస్తోంది' అని సచిన్ అన్నాడు. ప్రస్తుత బ్యాట్స్‌మెన్‌లో తన ఆటతీరుకు దగ్గరగా ఉన్న ఆటగాడెవరని అడిగినప్పుడు.. సచిన్ పైవిధంగా బదులిచ్చాడు. ఆస్ట్రేలియాలో కార్చిచ్చు బాధితుల సహాయార్థం ఆదివారం మెల్‌బోర్న్‌లో క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. గిల్‌క్రిస్ట్ లెవెన్‌తో తలపడే పాంటింగ్ లెవెన్ జట్టుకు సచిన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

## దక్షిణాఫ్రికా-ఇంగ్లండ్ వన్డే వర్షార్పణం

**డర్బన్:** దక్షిణాఫ్రికా-ఇంగ్లండ్ మధ్య శుక్రవారం జరగాల్సిన రెండో వన్డే వర్షం కారణంగా రద్దయింది. వరుణుడు పలుమార్లు అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య దక్షిణాఫ్రికా 11.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. ఆ సమయంలో వర్షం మరోసారి అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. క్వింటన్ డికాక్ (11)ను రూట్ అవుట్ చేయగా.. బవుమా (21)ను జోర్డాన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. మ్యాచ్ నిలిపివేసేసరికి ఓపెనర్ హెండ్రిక్స్ (35 నాటౌట్) క్రీజులో ఉన్నాడు.

## న్యూజిలాండ్ 'ఎ' 276/5

**భారత్-ఎతో రెండో టెస్ట్**

**లింకోల్న్:** రెండో అనధికార టెస్ట్‌లో న్యూజిలాండ్ 'ఎ' భారీస్కోరు దిశగా పయనిస్తోంది. భారత్-ఎతో శుక్రవారం ఆరంభమైన ఈ టెస్ట్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. గ్లెన్ ఫిలిప్స్ (65) అర్ధ శతకం సాధించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 276/5 స్కోరు చేసింది. తొలిరోజు ఆటముగిసేసరికి డేన్ క్లీవర్ (46), డారెల్ మిషెల్ (36) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ రూథర్‌ఫోర్డ్ (40) ఫర్వాలేదనిపించాడు. సిరాజ్ (2/58) రెండు వికెట్లు పడగొట్టాడు. అశ్విన్ 22 ఓవర్లలో ఒక్క వికెట్‌కు కూడా పడగొట్టలేక పోయాడు.




*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*